అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సోమవారం 24-7-2023

సమగ్ర తెలుగు దినపత్రిక




సంపుటి : 9 | సంచిక : 204 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 14 పేజీలు | వెల : 6.50



# సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నర్సింగరావు మృతి

- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. జ్యోతి నివాళి



నవతెలంగాణ-బేగంపేట్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కామ్రేడ్ నర్సింగరావు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. జ్యోతి, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, నాయకులు కేవీపీఎస్ఎస్ రాజు, ఎస్ సోమయ్య.. హైదరాబాద్ బోయగూడలోని ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జ్యోతి, ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నర్సింగరావు కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులై చిన్నతనం నుంచి పేదల కోసం నిరంతరం పోరాటాలు చేశారని తెలిపారు. సుమారు 1955 నుంచి అప్పటి ఉమ్మడి సీపీఐ, ఆనంతరం సీపీఐ(ఎం) సభ్యుడిగా కొనసాగిన ఆయన.. బోయగూడలో అనేక ప్రజా సమస్యలపైన పోరాటాలు నిర్వహించారని, ఆ ప్రాంత పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. డీవైఎఫ్ఐ, సీఐటీయూ ప్రజాసంఘాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. బోయగూడలోని ప్రాగా టూల్స్‌లో కార్మికుల హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. ఇల్లు లేని పేదలకు అండగా నిలిచి ఇండ్ల నిర్మాణానికి పోరాటాలు నిర్వహించారన్నారు. బోయగూడలో బలమైనటువంటి ప్రజా పునాదిని నిర్మించి అంచలంచెలుగా ఎదుగుతూ 1965లో బోయగూడ కార్పొరేటర్ స్థానానికి పోటీ చేసి అతి తక్కువ ఓట్లతో ఓడిపోయారని తెలిపారు. పార్టీలోకి వచ్చినప్పటి నుంచి చివరి క్షణం వరకు పార్టీ ఆశయాల కోసమే కట్టుబడి పని చేసినటువంటి గొప్ప నాయకులు కామ్రేడ్ నర్సింగ్ రావు అని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీవ్ర నష్టమని తెలిపారు. నివాళి అర్పించిన వారిలో.. నగర కమిటీ సభ్యులు జి.నరేష్, సనత్‌నగర్ నాయకులు పి.మల్లేష్, రమేష్, మహేందర్, కా.నర్సింగ్ రావు తదితరులు ఉన్నారు.

## మోడీ భజనపరుల వింత భాష్యం

(మొదటిపేజీ తరువాయి)

(ఎన్ఎస్ఓ) వివరాల ప్రకారం 2020తో పోలిస్తే 2021లో వ్యవసాయ రంగంలో 70 లక్షల మంది అదనంగా పని చేశారు. అదే యూపీఏ పాలనలో 3.7 కోట్ల మంది వ్యవసాయాన్ని వీడి వేరే ఉద్యోగాలు పొందారు. నిజానికి ఇది మంచి పరిణామం. ఆ కాలంలో వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగాలు సంవత్సరానికి 75 లక్షలు పెరిగాయి.

**2013 తర్వాత...**

ఈ కాలంలో వ్యవసాయం నుండి వేరే రంగాలకు వెళ్లిన వారి సంఖ్య తగ్గిపోయింది. 2016 నుండి దేశంలో కోవిడ్ ప్రవేశించే వరకూ జీడీపీ వృద్ధి రేటు ప్రతి త్రైమాసిక కాలంలోనూ పడిపోతూ వచ్చింది. 2017-18లో మన దేశంలో నిరుద్యోగ రేటు 45 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా గరిష్ట స్థాయికి చేరింది. ముందస్తు ప్రణాళిక లేకుండా లాక్‌డౌన్ విధించడంతో వ్యవసాయ రంగంలోకి వలసలు భారీగా పెరిగాయి. ఇప్పుడు వాటినే పెరిగిన ఉపాధి కల్పనగా బీజేపీ ఆర్థికవేత్తలుచెప్పుకొస్తున్నారు.

**తగ్గిన కుటుంబ ఆదాయం**

వ్యవసాయ రంగంలో అవసరమైన దాని కంటే ఎక్కువ సంఖ్యలో ప్రజలు పనిచేయడం, ఆ రంగంలో ఉపాధి పెరగడం వల్ల ఉత్పాదకత పెరగకపోగా, వ్యవసాయ రంగంపై ఆధారపడిన వారి వాస్తవ ఆదాయం సైతం తగ్గింది. బీజేపీ అనుకూల ఆర్థికవేత్తలు చెప్పుకుంటున్నట్లు 2019 నుండి వ్యవసాయ రంగంలో పెరిగిన ఈ ఉద్యోగాలు వాస్తవానికి జీతం భత్యం లేనివే. కుటుంబంలో అప్పటికే వ్యవసాయం చేస్తున్న వారితో మహిళలు, యువత, పిల్లలు కలిసి పొలం పనులకు వెళ్లారు. పేరుకు వీరందరికీ ఉపాధి దొరికిందని చెప్పుకోవడమే కానీ కుటుంబ ఆదాయం మాత్రం పెరగలేదు.

**వాస్తవ వేతనాలూ తగ్గాయి**

బీజేపీ అనుకూల ఆర్థికవేత్తలు చేస్తున్న మరో వాదన వాస్తవ వేతనాలు భారీగా పెరిగాయట. వాస్తవానికి ఈ వాదనలోనూ పస లేదు. 2017-18 నుండి 2021-22 మధ్యకాలంలో రెగ్యులర్ ఉద్యోగుల రోజువారీ వేతనం రూ.302 నుండి రూ.292కు తగ్గింది. స్వయం ఉపాధి పొందుతున్న వారి వేతనం రూ.199 నుండి రూ.177కు పడిపోయింది. దీనికి కారణం అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. 2019లో ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థకు బాగా నష్టం కలిగించింది. ముఖ్యంగా వ్యవసాయ ఆదాయం, అసంఘటిత రంగంలో పని చేసే వారి ఆదాయం తగ్గిపోయింది. దీనికితోడు 2017లో ప్రవేశపెట్టిన జీఎస్టీ అసంఘటిత రంగానికి చెరుపు చేసింది. సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు బాగా దెబ్బతిన్నాయి. ఆర్థిక వృద్ధి మందగించింది. జీడీపీ వృద్ధి రేటు పడిపోయింది. చివరికి నిరుద్యోగుల సంఖ్య 45 సంవత్సరాల గరిష్ట స్థాయికి పెరిగింది.

**ఉద్యోగాల కల్పన అవసరమే**

మోడీ ప్రభుత్వంలో పని చేస్తున్న సీనియర్ ఆర్థిక సలహాదారు చెప్పిన మాట వింటే ఎవరికైనా నవ్వు వస్తుంది. దేశంలో జనాభా వృద్ధి రేటు తగ్గిందట. 2021లో సంతానోత్పత్తి రేటు కూడా తగ్గిపోయిందట. కాబట్టి సంవత్సరానికి కోటి ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరమే లేదట. ఈ వాదన ఎంత హాస్యాస్పదంగా ఉందో కదా. వ్యవసాయ రంగంలోకి మళ్లిన లక్షలాది మందిని దాని నుండి బయటికి తీసుకురావాల్సిన అవసరాన్ని బీజేపీ అనుకూల ఆర్థికవేత్తలు విస్మరిస్తున్నారు. గత సంవత్సరంలో కూడా వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న వారి సంఖ్య పెరిగింది. దీనిని బట్టే ఉద్యోగాల కల్పన భేషుగ్గా ఉందని బీజేపీ అనుకూల ఆర్థికవేత్తలు కితాబు ఇస్తున్నారు. 2019లో వ్యవసాయ రంగంలో పనిచేసిన కార్మికుల వాటా 42% ఉంటే గత సంవత్సరంలో అది 45.6%కి పెరిగింది. విద్యావంతులు అయిన యువతకు వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉంది. దీనిని బట్టి చూస్తే 2030 వరకూ మన దేశంలో ఏటా కోటి నుండి 1.2 కోట్ల ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

## గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సర్వేను అడ్డుకున్న రైతులు

- అలైన్‌మెంట్ మార్చాల్సిందే.. : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-చింతకాని

నాగపూర్ నుంచి అమరావతి వరకు నూతనంగా నిర్మించే గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి అలైన్మెంట్ మార్చాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని కొదుమూరు, వందనం గ్రామాలకు ఆదివారం తెల్లవారుజాము నుంచే భారీగా పోలీసులు, రెవెన్యూ అధికారులు చేరుకొని భూ సర్వే చేపట్టేందుకు ప్రయత్నించగా వారిని రైతులు అడ్డుకున్నారు. దాంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు మాదినేని రమేష్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు అక్కడికి చేరుకొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రహదారిలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వకుండానే సర్వే ఎలా చేపడతారంటూ ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు పరిహారం అందజేసే విషయంలో లిఖితపూర్వకంగా స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే సర్వే ప్రారంభించాలని సూచించారు. నూతన కలెక్టరేట్ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన పరిహారాన్ని గ్రీన్ ఫీల్డ్ రైతులకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, రెవెన్యూ అధికారులు సర్వే చేసి తీరుతామని చెప్పడంతో రైతులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. సర్వే ప్రాంతంలో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టడంతో అధికారులు ఎట్టకేలకు సర్వే నిలిపివేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) చింతకాని, రఘునాథపాలెం మండలాల కార్యదర్శులు మడిపల్లి గోపాలరావు, నవీన్‌రెడ్డి, నాయకులు వత్సవాయి జానకి రాములు, రాచబంటి రాము, రైతు సంఘం నాయకులు కొల్లి సీతయ్య, పెంటాల అప్పారావు, వెంకటేశ్వర్లు, బొగ్గారపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి

- మారణహోమం జరుగుతుంటే.. కేంద్రం ఏం చేస్తుంది : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. సాగర్
- రాష్ట్రవ్యాప్తంగా పలు పజాసంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు






నవతెలంగాణ - విలేకరులు

మణిపూర్‌లోని కాంగ్‌పోక్పీ జిల్లాలో కుకీ తెగకు చెందిన ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్నా చూసీచూడనట్టు వ్యవహరించడమే కాక, మూడు నెలలుగా రాష్ట్రంలో మరణహోమం జరుగుతున్నా స్పందించని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. సాగర్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మూడు నెలలుగా భయానక మారణ హోమం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దాచ లక్ష్మి ఫంక్షన్ హాల్ నుంచి వివేకానంద చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న టి.సాగర్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై సాగుతున్న అఘాయిత్యాలు వెలుగులోకి వస్తున్నా.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కాని, ప్రధాని మోడీ కాని దీనిపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఈ ఘటనను సుమోటోగా తీసుకుంటామని సుప్రీంకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించడంతో.. ప్రధాని మొసలి కన్నీరు కారుస్తూ నేరస్తులను కఠినంగా శిక్షిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళగా ఉన్న రాష్ట్రపతి కూడా ఏ మాత్రం స్పందించకపోవడం బాధకరమని అన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు.

హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని అమృత ఎస్టేట్ నుంచి 'వై' జంక్షన్ వరకు.. సీపీఐ ఆధ్వర్యంలో గిరిజన సంఘం, మహిళా సమాఖ్య, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి, విద్యార్థి ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు పశ్య పద్మ మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళల నగ్న ప్రదర్శన, వారిపై లైంగికదాడులు, హత్యలు జరుగుతున్నా నియంత్రించలేని రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన తీసుకురావాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ పాస్టర్స్ ఫెలోషిప్స్ ఆధ్వర్యంలో వందలాది మంది క్రైస్తవులు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ.పాల్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరిగిన సంఘటనలను చూసి ప్రపంచమంతా నివ్వెరపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం గ్రామంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో ఐద్వా ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రంలో సీపీఐ(ఎం), ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక వాణిజ్య భవన్‌సెంటర్‌లో నిరసనర్యాలీ చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం సింగన్నగూడెం చౌరస్తాలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని అల్లందేవి చెర్వు గ్రామంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆలేరు పట్టణంలో ప్రగతిశీల మహిళాసంఘం, పీవైఎల్ ఆధ్వర్యంలో రైల్వేగేట్ సెంటర్‌లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. భువనగిరి మండలంలోని ఆకుతోట బావితండాలో ఆలిండియా బంజారా సేవా సంఘ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

## జలమండలి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 30 పీఆర్సీ అమలు : సీఎం నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజి బోర్డు (ఎచ్ఎండబ్ల్యూఎస్ఎస్ బీ) లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 30 శాతం పీఆర్సీని అమలు చేస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. తద్వారా దాదాపు నాలుగు వేల మంది వాటర్ బోర్డ్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనున్నది. ఈ సందర్భంగా.. తమ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేస్తూ నిర్ణయం తీసుకున్నందుకు మెట్రో వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, యూనియన్ నేతలు సీఎం కేసీఆర్‌ను ప్రగతి భవన్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు.



## 'రామదాసు' ఆశయాలు కొనసాగించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి



నవతెలంగాణ-గోవిందరావుపేట

వీరపనేని రామదాసు, వెంకటసుబ్బమ్మ దంపతుల ఆశయాల స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో తీగల ఆదిరెడ్డి అధ్యక్షతన వీరపనేని రామదాసు, వెంకటసుబ్బమ్మ 3వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అంబాల పోషాలు జెండా ఆవిష్కరించారు. అనంతరం మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. రామదాసు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి నుంచి తుది శ్వాస వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేశారని తెలిపారు. గోవిందరావుపేట మండలంలో రైతు సమస్యలతోపాటు లక్నవరం కాలువ సమస్య పరిష్కారానికి, గిట్టుబాటు ధర కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్మించారన్నారు. ఆయనతో పాటు ఆయన భార్య వెంకటసుబ్బమ్మ సైతం మహిళా ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. కానీ నేడు కొంత మంది రాజకీయ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం దేశంలో మతోన్మాద మంటలు లేపుతున్నారన్నారు. మణిపూర్‌లో ఇద్దరు కుకీ మహిళపై క్రిస్టియన్ పేరుతో నగ్నంగా ఊరేగించి లైంగికదాడికి పాల్పడి వారికి దారుణంగా హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో రోజురోజుకూ పేదరికం పెరిగిపోతోందని, ఇంటి స్థలాలు కూడా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మరోపక్క కార్పొరేట్ శక్తుల ఆదాయాలు రోజురోజుకు భారీగా పెరుగుతున్నాయని, వారికి మోడీ ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని తెలిపారు. రామదాసు ఆశయసాధన కోసం వారి కుటుంబ సభ్యులు నేటికీ మండలంలో పేద పిల్లలందరికీ నోటు పుస్తకాలు అందిస్తున్నారన్నారు. రామదాసు స్ఫూర్తిగా మతోన్మాద పార్టీ బీజేపీపై భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు పొదిళ్ల చిట్టిబాబు, ఎండీ దావూద్, రామదాసు కుటుంబ సభ్యులు వీర పనేని డాంగే, వీరపనేని కృశ వౌ, వీరపనేని పాణి, చంద్రశేఖర్,గ్రామ సర్పంచ్ అజ్మీరా లక్ష్మీ పాల్గొన్నారు.

## యువతకు రోల్‌మోడల్.. మంత్రి కేటీఆర్

- అంతర్జాతీయ ఐటీ దిగ్గజసంస్థలను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన యువనేత
- తెలంగాణ భవిష్యత్ నేతగా ఎన్నో విజయాలు.. మరెన్నో ప్రశంసలు : కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొద్దుల లక్ష్మణ్
- కేటీఆర్‌కు జన్మదినం సందర్భంగా ప్రత్యేక పాటల సీడీ ఆవిష్కరణ




నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'దేశంలోనే నెంబర్ నేతగా, యువతకు రోల్‌మోడల్‌గా ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే.తారకరామావు నిలిచారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకొచ్చి.. తెలంగాణ ఐటీ సిగలో యువతకు ఉపాధి గనిని సృష్టించారు. తెలంగాణ ఫ్యూచర్‌లీడర్‌గా ఎన్నో విజయాలు, ప్రశంసలు అందుకుంటున్నారు.' అని కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొద్దుల లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. నేడు మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో ఆయన విజయాలు, ప్రగతిపై ప్రత్యేకంగా రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొద్దుల లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఐటీ రంగంలో దేశంలోనే తెలంగాణను మంత్రి కేటీఆర్ అగ్రగామిగా నిలిపారన్నారు. దేశవిదేశాల నుంచి పెట్టుబడులు తీసుకొచ్చి రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పేలా ప్రోత్సహించారని తెలిపారు. ఇక్కడ పరిశ్రమలు, ఐటీ కంపెనీల స్థాపనకు సులభతరమైన అనుమతులు ఇస్తూ రాష్ట్ర యువతకు ఉపాధిని చూపారన్నారని అభినందించారు. ప్రపంచంలో అతిపెద్ద సంస్థలైన అమెజాన్, గూగుల్, యాపిల్ వంటి అంతర్జాతీయ కంపెనీల ప్రపంచస్థాయి రెండో బ్రాంచ్‌లను ఇక్కడికి తీసుకొచ్చి యువనాయకుడిగా ప్రజల్లో సుస్థిర స్థానాన్ని నిలుపుకున్నారని తెలిపారు. ఇండ్రస్ట్రీయల్ ఫ్రెండ్లీ వాతావరణంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపుతున్న మంత్రి కేటీఆర్ నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్ ఐసీ చైర్మెన్ గ్యాదరి బాలమల్లు, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అమీర్ పాల్గొన్నారు.

అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 24-7-2023 www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 204 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50




# ఓపీఎస్ కోసం సమైక్య ఉద్యమం

**విశాల ఐక్యవేదికలో భాగస్వామ్యం కండి**

**పీఎఫ్ఆర్డీఏ రద్దు కోసం కొట్లాడుదాం కలిసిరండి**

- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపు
- ఓపీఎస్ పునరుద్ధరణ అంశం రాబోయే ఎన్నికల్లో ప్రధాన అజెండాగా మారాలి
- అందుకోసం ప్రజామద్దతు కూడగట్టాలి : ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జేఎఫ్ఆర్ఓపీఎస్ ఆవిర్భావం 7లో..

## ప్రాధాన్యతను మరిచిన ప్రధాని

**మోడీపై మణిపూర్ బీజేపీ ఎమ్మెల్యే నిరసన గళం**

- అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని విమర్శ
- మానవత్వం చూపలేదని మండిపాటు



ఇంఫాల్ : మణిపూర్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే పవోలియన్‌లాల్ హోకిప్ ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శనాస్త్రాలు సంధించారు. హింసాకాండతో రాష్ట్రం అట్టుడుకుతుంటే మోడీ అమెరికాలో పర్యటించడాన్ని తప్పుపడుతూ సమస్య ప్రాధాన్యతను ఆయన ఏ మాత్రం అర్థం చేసుకోలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పరిస్థితిని చక్కదిద్దడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. మణిపూర్ హింసపై మోడీ తొలిసారిగా పెదవి విప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ '79 రోజుల పాటు పట్టించుకోలేదు. హింస చెలరేగుతున్న తరుణంలో వారం రోజులు కూడా సుదీర్ఘ సమయమే' అని చెప్పారు. న్యూస్‌లాండ్రీ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ...7లో

## అర్హతల ప్రకారం శాఖల్లో వీఆర్ఏల సర్దుబాటు..

**ప్రభుత్వ ఉద్యోగులుగా వారిని పర్మినెంట్ చేస్తున్నాం...**

- 61 ఏండ్లు పైబడిన వారి వారసులకు కారుణ్య నియామకం కింద సర్కారు కొలువులు : సీఎం కేసీఆర్ నిర్ణయం
- నేడు ఉత్తర్వులు



సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్న వీఆర్ఏ జేఏసీ నేతలు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

నీరటి, మస్కూరు, లష్కర్ వంటి కాలం చెల్లిన పేర్లతో పిలువబడుతూ, భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన వీఆర్ఏ వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలుగా పనిచేస్తున్న సిబ్బందిని రెవెన్యూ శాఖలో సూపర్ న్యూమరరీ పోస్టుల్లో క్రమబద్ధీకరించనున్నట్టు ఆయన వెల్లడించారు. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల ...7లో





**వాస్తవంలో నిరుద్యోగం పెరిగింది**

## మోడీ భజనపరుల వింత భాష్యం

ఉద్యోగాల కల్పనపై వితండవాదం

## వ్యవసాయంలో ఉపాధి కూడా ఉద్యోగమేనట

**నరేంద్ర మోడీ హయాంలో 2019-2022 మధ్య కాలంలో దేశంలో ఉద్యోగాల కల్పన ఊపందుకున్నదని, దేశ చరిత్రలోనే ఇది ఓ సువర్ణాధ్యాయమని బీజేపీకి వంతపాడే ఆర్థికవేత్తలు ఊదరగొడు తున్నారు. ఆ కాలంలో దేశంలోని నిరుద్యోగులకు 5.8 కోట్ల ఉద్యోగాలు లభించాయంటూ గణాంకాలను ఉదహరిస్తున్నారు. అదే సమయంలో యూపీఏ ప్రభుత్వంపై విమర్శలు కూడా సంధిస్తున్నారు. 2004-05 నుండి 2011-12 వరకూ...అంటే యూపీఏ ప్రభుత్వ పాలనలో కేవలం 1.33 కోట్ల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని వారు చెప్పుకొచ్చారు. అయితే ఘనత వహించిన ఆ ఆర్థికవేత్తలు ఓ వాస్తవాన్ని విస్మరించారు. అదేమిటంటే... మోడీ పాలనలో లభించాయని చెబుతున్న 5.8 కోట్ల ఉద్యోగాలలో ఎక్కువ వ్యవసాయ రంగంలో ఉపాధి పొందుతున్నవారే.. దీనిని కూడా ఉద్యోగాల కల్పనగా చెప్పకోవడం వీరికే చెల్లింది.**

న్యూఢిల్లీ : 2019లో... అంటే కోవిడ్ ప్రారంభ సమయానికి వ్యవసాయ రంగంలో ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 18.8 కోట్లు. 2020వ సంవత్సరం మధ్యలో ఆ సంఖ్య మరో నాలుగున్నర కోట్లు పెరిగింది. కోవిడ్ కష్టకాలంలో పట్టణాలు, నగరాలలో ఉపాధి కోల్పోయిన ప్రజలు గ్రామాలకు వలస వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందారు. 2021లో కోవిడ్ ప్రభావం తగ్గిన సమయంలో వారంతా తిరిగి వ్యవసాయ పనులు వదిలేసి పట్టణాలు, నగరాల బాట పట్టారు. ప్రభుత్వానికి చెందిన జాతీయ సర్వే సంస్థ ...2లో





## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధ్ ప్రమాణం

**హాజరైన గవర్నర్, సీఎం**

**నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్**

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధ్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ప్రమాణం చేయించారు. వేదికపై వారిద్దరితో పాటు సీఎం కేసీఆర్ ఆశీనులయ్యారు. అరాధ్ భగవంతుని సాక్షిగా ఆంగ్లంలో ప్రమాణం చేశారు. రాజ్యాంగానికి అనుగుణంగా చట్టాలను అమలు చేస్తూ విధుల్ని నిర్వహిస్తూ తీర్పులు వెలువరుస్తానని తెలిపారు. ప్రమాణ స్వీకారం తర్వాత గవర్నర్, సీఎంలు చీఫ్ జస్టిస్‌కు ...7లో

## నేడు అల్పపీడనం

- అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ

**వచ్చే 5 రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వానలు**

వివరాలు 7లో..



## మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం

**రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**


నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలోని బీసీలకు అందిస్తున్న తరహాలోనే మైనార్టీలకూ రూ. లక్ష ఆర్థిక సాయాన్ని పూర్తి సబ్సిడీతో ప్రభుత్వం అందించనున్నది. ఈ మేరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించా రు.ఇందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా మైనార్టీలకు ఆర్థిక సాయానికి సంబంధించి సీఎం మాట్లాడుతూ కుల,మతాలకు అతీతంగా పేదరికాన్ని పారద్రోలాలనే దార్శనికతతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే అన్ని వర్గాల పేదలకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తున్నదని ...7లో

## కారుపై థర్టీ పర్సెంట్ సర్కారు అస్త్రం

**ఇంటింటికి కాంగ్రెస్ పోస్టర్లు**

- ఇదే ప్రధాన అజెండాగా ఎన్నికలకు...
- ఆ దిశగా శ్రేణుల సన్నద్ధం



**నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్**

రానున్న ఎన్నికలకు కాంగ్రెస్ బలమైన ప్రచారాస్త్రాలను సిద్ధం చేస్తున్నది. కారు వైఫల్యాలపై హస్తం పార్టీ అస్త్రశస్త్రాలను పోగు చేసుకుంటున్నది. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ అవినీతిపై ప్రతిపక్ష పార్టీగా అనేక ఆరోపణలు గుప్పిస్తున్నది. వాటన్నింటిని వడబోసి ఎన్నికల అస్త్రాన్ని తయారు చేసినట్టు తెలిసింది. బీఆర్ఎస్ 'థర్టీ పర్సెంట్ కమీషన్ల' సర్కారు అంటూ కారుపై కాంగ్రెస్ బాణాన్ని వదలనుంది. ఆ నినాదాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికి పోస్టర్లు వేసి పెద్ద ఎత్తున ప్రచారాన్ని ప్రారంభించనుంది. తద్వారా ...7లో

## ఒక దురహంకార్యం కోసం..

ఉచ్చనీచాలు తలకెత్తుకున్నాక
ద్వేషం నీ నీడై నడుస్తున్నది
మెదళ్ల నిండా దురహంకారం తప్ప
మరో పదార్థమేది నిండలేదు

బుల్ షిట్...

బహుశా నువ్వు వికృత శిశువుగా
ఈ దేశం మీద పుట్టి ఉంటావు
నిన్ను పెంచిన తల్లి...
నీకు నడక నేర్పిన తండ్రి
నీకు సరైన బుద్ధులు మాత్రం
నేర్పలేకపోయారు

నీ పుట్టుకే ఈ దేశానికి తలవంపు!
తరాలు గడిచినా మాయని మచ్చ!!

దిమాక్ లేని నీ వికృత చర్యకు
సిగ్గుతో దేశం బిక్కచచ్చిపోయింది
ప్రపంచం నీ మీద కాండ్రించి ఉమ్మేస్తున్నది
కుక్కలు కూడా చేయని పని
నువ్వు మనిషివై చేసిన వైనానికి
కళ్లూ చెవులు మూసుకుంటున్నది

నీలో కండకావరం తప్ప
మనిషివనే సోయి ఇసుమంతైనా లేదు

నిన్ను ఇట్లా మృగాన్ని చేసిన
మనువు ఈ పూట
ఉరి పెట్టుకొని చావాలి


ఇవాళ నువ్వు నా మీద విసర్జించింది

నీ మూత్రం మాత్రమే కాదు
తరాల నీ అహంకారం
తలకెక్కిన గొరగానితనం
నిచ్చెనమెట్లను నీలోకి
జాగ్రత్తగా నింపినోడొకి
సర్వం అప్పగించిన సన్నాసివి
జంధ్యం పోగుల బానిసవి

మందిని చూసుకొని విర్రవీగే నువ్వు

ఇంతకంటే ఇంకేం చేయగలవు
రేపటి చరిత్ర ముందు
నువ్వు తలవంచుకొని నిలబడే
తొలిపొద్దు ఒకటి
తప్పకుండా ఉదయిస్తుంది
చూపుడు వేలు సాక్షిగా...
నీకు క్షమాబిక్షలు లేని
శిక్షలు విధించడానికి
న్యాయదేవత కూడా
తన కండ్ల గంతలను విడిచేస్తుంది
నీలాంటి వాడి నిర్మూలనకు
ప్రకృతే పగబట్టకపోదు!

- పసునూరి రవీందర్
77026 48825



## పీడితుల గొంతుక జాషువా



ఆనాటి సమాజంలోని జనం బాధల గాధలను గుండెలోంచి ఎలుగెత్తి చాటడం, కన్నీళ్ళను కలంలో పోసుకుని సృజించడం. సమాజపు చలనసూత్రాన్ని గ్రహించి, అసలైన అంశాలను కవిత్వీకరించి ప్రగతిశీల భావాలను ప్రజలకు అందించినవాడే మహాకవి, ప్రజాకవి కాగలడు. అట్లాంటి సృజనాత్మక కృషీవలుడు మహాకవి గుర్రం జాషువా. తాను స్వయానా పేదరికాన్ని, దాని బాధను అనుభవించి, కుల వివక్ష తనూ ఎదుర్కొని సమాజ దుష్టత్వానికి ఎదురు నిలబడ్డ కలం యోధుడు ఆయన. బాధాకరమైన విషయమేమంటే జాషువా ఎదుర్కొన్న సమస్యలు, వివక్షతలూ మరింత పెరిగి సమాజాన్ని ముంచెత్తుతున్న నేటి సందర్భంలో జాషువా కవిత్వం అత్యంత సమకాలీనంగా కనపడుతూ వుంది. సంఘంలో కొనసాగిన ప్రతి జాడ్యాన్నీ ఖండిస్తూ గొంతెత్తిన యోధుడాయన. పేదరికం, ఆకలి మొదలైన విషయాలపై ధ్వజమెత్తడం, వాటి తీవ్రతను, పర్యవసానాలను చెప్పగలగటంలో అతని ప్రగతిశీల దృక్పథాన్ని చూడగలుగుతాము.

జాషువా రచనల గురించి ప్రస్తావించగానే కేవలం కులసమస్యకు పరిమితం చేయటం సరైనది కాదు. ఈ దేశంలోని సమస్త ప్రజల ఆకలిని గురించి కూడా గానం చేశాడు. **'ప్రతిమల పెళ్ళి చేయుటకు / వందలు వేలు వ్యయింత్రు గాని / దు:ఖితమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రికన్ మెతుకు విదల్చదీ భరతమేదిని / ముప్పదిమూడు కోట్ల దేవతలెగబడ్డ దేశమున / భాగ్యహీనుల క్షుత్తులారునే'** అన్నాడు. ఈ క్షుత్తులాటం ఎలా అని ప్రశ్నించాడు. ఆకలితో, దారిద్ర్యంతో వున్న వారిని ఆదుకోవడం, వారి కోసం పోరాడటం కంటే గొప్ప విషయం మరోటి లేదని ప్రతి సందర్భంలోనూ ఆయన చెప్పారు. ఎవరయితే వాస్తవంగా శ్రమించి సంపద సృష్టిస్తున్నారో వారే బాధలు అనుభవిస్తున్నారనీ చెప్పగలిగాడు. **'వాని రెక్కల కష్టంబులేని నాడు / సస్యరమ పండి పులకింప సంశయించు / వాడు ప్రపంచమునకు భోజనము పెట్టు / వానికి భుక్తి లేదు'** అని అన్నాడంటే రెక్కల కష్టాన్ని ఎవరో దోచుకుని పోతున్నారనే అర్థం స్ఫురించడం స్పష్టంగానే వుంది. ఇది శ్రమజీవి తరుపున కవి నిలబడిన ప్రగతిశీలత. రాజకీయ విషయంలో జాషువా కవి గాంధీ సిద్ధాంతాలపై అభిమానం గలవారైనప్పటికీ, పేదవానికీ ధనవంతునికీ వున్న భేదాన్ని, అసమానతను పెంచే రాజకీయాన్ని ద్వేషించాడు. వ్యతిరేకించాడు. పేదలను, దళితులను ఏవిధంగా రాజకీయులు వంచిస్తున్నారో కూడా స్పష్టంగా తెలిసిన కవి జాషువా. **'క్రూరుల్ కుత్సితులు, అస్మదీయములు హక్కుల్ దోచుకొన్నారు / నన్నూరింబైటకు నెట్టినారు / ఇప్పుడు నన్నోదార్చుచున్నారు'** అని చెప్పగలిగాడు. దోపిడి జరుగుతున్న తీరును అనేక సందర్భాలలో చాలా నిక్కచ్చిగా చెప్పాడు. **'నేను చిందులాడి నేను దప్పులు కొట్టి అలసి సొలసి సత్తి కొలువు కొలువ / ఫలితమెల్లనొరుల భాగించుకొనిపోవు / నీచమైన భూమి చూచినావె!'** అని ఈ నేలపై జరిగే తతంగాన్ని వివరించాడు. భూస్వామిక సమాజంలో దోపిడి పీడన దురహంకారం కలగలసి వుంటాయి. అలాంటి దురహంకారాన్ని, కుల పీడనను దునుమాడిన కవి జాషువా. రాజులపై కసిగా స్పందించారు. 'ఫిరదౌసి' కావ్యంలో గజనీ మహమ్మదు క్రూరత్వాన్ని **'పదియునెనిమిది విజయరంభల వరించి / గాంగ జలమున నెత్తుటి కత్తి కడిగి'** అని ఆగ్రహాన్ని ప్రకటించాడు.

పద్య కవిగా ప్రసిద్ధుడైన జాషువా, కొన్ని పద్యాల్లో కరుణామయంగానూ, కొన్ని సామరస్యంగానూ, మరికొన్ని వేదనా భరితంగానూ ఇంకొన్ని ప్రతిఘటనతో కూడుకుని వుంటాయి. సామాజిక అసమానతలపై ఇంత ఆవేదనతో, ఆవేశంతో చెప్పిన కవి మరొకరు లేరనేది వాస్తవం. **'నిమ్న జాతుల కన్నీటి నీరదములు / పిడుగులై దేశమును కాల్చివేయును'**. **'వేద చతుష్టయంబు ప్రభవించిన వ్యాసుని దివ్యవాణిలో మాదిగలుందురా? రుధిరమాంసములున్ గల అంటరాని వారాదిమవాసులు అక్కటకటా! తలపోసిన అల్ల గుండెలో సూదులు మోసులెత్తును! కృశోదరి! ఎట్లు సహించుకొందువో?'** అని ఆక్రోశించాడు పీడితుల వేదనలని. కరుణ పూరితముగా అతని కవిత కనపడినప్పటికినీ అంతర్లీనముగా ఆవేశంతో కూడిన ప్రతిఘటన కనపడుతుంది. స్త్రీల హక్కులను ఎలా హరించి వేస్తున్నారో, ఎలా సాధించుకోవాలో చెబుతూ


**అబలయన్న బిరుదమటించి / కాంతల స్వీయశక్తులదిమి చిదిమినారు / సబలయన్న బిరుదు సాధించి / హక్కులు గడనచేసి కొమ్ము కష్టచరిత!** అని ప్రబోధించాడు. నేడు మన దేశంలో ఏ రకమైన అలజడి చెలరేగినా, యుద్ధం జరిగినా మొదట స్త్రీ బలి పశువుగా మారుతుంది. మణిపూర్ తాజా ఉదాహరణ. అందుకే స్త్రీలను సంప్రదాయమనే పేర హక్కులు లేకుండా చేసి అబలను చేస్తున్న తీరును జాషువా ఆనాడే ధిక్కరించమని పిలుపునిచ్చాడు. ఇంతకన్నా ఏం కావాలి అతను ప్రజాకవని చెప్పడానికి! కవిత్వమంతా పద్యరూపంలో వున్నా, స్వేచ్ఛగా భావాన్ని కవిత్వీకరించాడు. 'గబ్బిలం' అని కావ్యానికి శీర్షికనెంచుకోవడంలోనే తానెవరి పక్షం వహిస్తున్నాడో ధ్వనించాడు. ఖండకావ్యాలు, ముంతాజు మహలు, పిరదౌసి, స్వప్న కథ, స్వయంవరం, క్రీస్తు చరితము, నా కథ మొదలైన ఎన్నో రచనలు మనకందించారు. తెలుగు నేల మీద హరిశ్చంద్ర నాటకంలో కాటికాపరి పద్యాలు అందరి నోళ్ళలోనూ నానుతూనే వుంటాయి. నేటి కవులు, సృజనకారులు జాషువా రచనల నుండి స్ఫూర్తి పొందవలసినది ఎంతో వుంది. జాషువాగారన్నట్లుగానే **'కులమతాలు గీచుకున్నగీతలజొచ్చి, పంజరానగట్టువడను నేను / నిఖిలలోకమెట్లు నిర్ణయించిన నాకు / తిరుగు లేదు, విశ్వనరుడనేను'** కవులు విశ్వ నరులుగా వుంటూ మానవీయతను పెంచాలి. అదే జాషువా దారి.

(జులై 24 జాషువా వర్థంతి సందర్భంగా..)

- కె.ఆనందాచారి, 9948787660

# చమత్కారం చాలించిన శ్రీరమణ

"పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది" అనే నానుడి నిజమైతే శ్రీరమణ పుట్టడంతోనే ఏడవకూడదు, నవ్వుండాలి. అందరిలా ఏడుస్తూ కాకుండా నవ్వుతూ పుట్టుంటారేమో బహుశా!? శ్రీరమణ పుట్టెడు హాస్యమున్న వాళ్లు. ఆయన జీవించి ఉన్నన్నాళ్లు చమత్కారంతోనే చలామణి అయ్యారు.



ఆయన పేరు విషయంలోనే చమత్కారం జరిగింది. ఆయనకు మూడు బారసాలలు అయి ఉండాలి. సెప్టెంబర్ 21, 1952న గుంటూరు జిల్లా వేమూరు మండలంలో ఉన్న వరాహపురం అగ్రహారంలో జన్మించిన వీరికి మొదటి బారసాలలో పేరు పెట్టిన కన్న తల్లిదండ్రులు వంకమామిడి అనసూయ, సుబ్బారావులు. ఆయనకు పెట్టిన పేరు 'వంకమామిడి రాధాకృష్ణ'. తండ్రి సుబ్బారావు గ్రామకరణం, కంపోస్ట్ మాస్టర్. అయితే రాధాకృష్ణ తాతకి గుడిపాటి వెంకటచలం తాతకి పోలిక. ఇద్దరికీ వారసులు లేరు. (చలంని వారి తాత దత్తత తీసుకుని కొమ్మూరి వెంకటచలాన్ని కాస్తా గుడిపాటి వెంకటచలం చేసారు) అలాగే ఈ వంక మామిడి రాధాకృష్ణని వారి తాత దత్తత తీసుకున్నారు. అప్పుడు రెండో బారసాల జరిగి ఆయనకు రెండో పేరు పెట్టారు. ఆ రెండో పేరు 'కామరాజు రామారావు'. దత్తత నాటికి పెద్దవాడై ఉంటాడు కాబట్టి ఈసారి బారసాల అది చేసినా ఉయ్యాలలో వేసి ఉండరు. వేసినా ఉయ్యాల సరిపోదు. కాళ్ళు బయటికి వస్తాయి. ఆయన అసలే పొడగరి మరి. తల్లితండ్రులు, తాత పేరు పెట్టగా లేనిది నాకు నేనే పేరు పెట్టుకోలేనా అనుకున్నారో ఏమో? 'శ్రీరమణ' అని ఆయనకు ఆయనే పేరెట్టుకున్నారు. ఆనాటికే ముళ్ళపూడి వెంకటరమణ అని సుప్రసిద్ధ రచయిత ఉండనే ఉన్నాడాయే. ఆయనకు పోటీ ఎందుకు? అనుకున్నట్టు ఉన్నారు. 'శ్రీరమణ' అని సింపుల్‌గా మార్చుకున్నారు. ఇందులోనూ లౌక్యం చూపారు. పేరుకు ముందు 'శ్రీ' అని తగిలించి. ఇంకొకడు గౌరవించే దాకా ఎదురు చూడటం ఎందుకు? మనకు మనమే ఆపాటి గౌరవం ఇచ్చుకోలేమా? అనుకున్నారు! అయితే కొందరు గౌరవం కొద్దిగా 'శ్రీ శ్రీరమణ' అని అంటే... "ఎందుకు లేండి రెండు శ్రీ లు? 'నాకు నేనొకటి తగిలించుకున్నాను. మీరెందుకు రెండు తగిలిస్తారు?' రెండు శ్రీ లున్నాయన ఈ శతాబ్దం నాది అన్నాడు. శ్రీశ్రీ రమణ అని మీరంటే కనీసం అర్ధ శతాబ్దమైన అడగాలి కదా! ఎందుకు వచ్చిన దురాశ" అని చమత్కరించేవారు.

నవ్వు నాలుగు విధాల రైటు అనేది ఆయన విధానం. ఆయన నినాదం. అందు కని ఆయన చాలా చిన్న వయసులోనే చదువు సంధ్యలు వెలిగిస్తూనే పేరడీలు పలికించారు, హాస్యజ్యోతులు కూడా వెలిగించారు. ఆయన తొలిసారి పేరడీ రచన చేసి నండూరి రామ్మోహనరావు ఎడిటర్‌గా ఉన్న ఆంధ్రజ్యోతికి పంపిస్తే, అది చదివిన నండూరి "డాజిల్ అయిపోయా"రట.

అప్పటిదాకా పేరడీ అంటే జరుక్ శాస్త్రి (అదే జలసూత్రం రుక్మినాథ శాస్త్రి), మాచిరాజు దేవి ప్రసాదులే. 'వారిని మించిన ఘణుడులా ఉన్నాడు ఇతగాడెవడో' అని నండూరి వారి చేతే అనిపించుకున్న పేరడీ గండర గండుడు శ్రీరమణ. ఒకచోట నండూరి వారే అన్నారు.

"సటైరులకు రెడీ రెడీ
స్వతైరులకు ఫెడి ఫెడి
శ్రీరమణ ప్రతి పేరడీ
చిత్రోక్తుల గారడీ" అని.

ఎంకి పాటలు నండూరి సుబ్బా రావు "గుండె గొంతుకలోన కొట్లాడుతాది..." అని ప్రియు రాలు ఎంకి గురించి అంటే, "'గుండు' గొంతులోన కొట్లాడు తాది" అని గోలి సోడా గురించి 'కిస్సు'మనేలా పేరడీ పేల్చారు శ్రీరమణ.


అదొక్కటేనా? అబ్బో చెప్తూ పోతే చాలా ఉన్నాయి ఆయన పేరడీ చమక్కులు. అలా తొలి రచనతోనే నండూరి రామ్మోహనరావు వారు శ్రీరమణకి పాత్రికేయ ఉద్యోగాన్ని ఆఫర్ చేస్తూ "ఏం రాస్తావు?" అని ఆయనంటే, "కాలమ్ రాస్తా" అని ఈయనన్నారు. అది... ఇది... రాసి, రాసి... చేతులు కాయలు కాసి, అనుభవం తోడేసి, అనుభవంతుడైన తరువాతే 'కాలమ్' రాసే కాలం వస్తుంది సామాన్యంగా ఎవరికైనా. అట్లాంటిది జర్నలిజం పసికూన శ్రీరమణ కాలమ్ రాస్తాననగానే "సర్లే నువ్వా?" అనలేదాయన "సర్లే నువ్వే!" అన్నారు. తాజాగా ఆయన రాసిన పేరడీ గుర్తొచ్చి సన్నగా నవ్వుతూ.

అలా కాలమ్ రాయడంతో మొదలైన ఆయన కలం కాలక్షేపంగా చమత్కారపు సువాసనలను సిరాగా నింపుకుని తెలుగు పలుకుబడి తో పరుగు లెట్టింది. ఆయనకు ఏదైనా పదం తెలుగుతనంతో కావాల్సి వచ్చినప్పుడు సొంత అన్నయ్య వంకమామిడి పార్థసారధికి కాల్ చేసి తెలుసుకుని రాసేవారట. అన్నట్టు శ్రీరమణ ధర్మపత్ని జానకి. తన వదిన సొంత చెల్లెలే.

కొంతకాలం ఆంధ్రజ్యోతిలో ఉద్యోగం చేసిన తర్వాత ముళ్ళపూడి వెంకట రమణ పిలుపుమేరకు మద్రాసు పైనమయ్యారు. 'చిత్రకల్పన' సంస్థ ముళ్ళపూడి వారు కాగితాల మీద రాస్తుంటే... బాపు దాన్ని రీళ్ల మీద సినిమాగా తీస్తుంటే... శ్రీరమణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా సుతిమెత్తని పెత్తనం చెలాయించారు. అలా త్యాగయ్య, మిస్టర్ పెళ్ళాం, పెళ్లి పుస్తకం... సినిమాలతో పాటు ఈ ఏడు శతజయంతి జరుపుకున్న ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పిల్లల కోసం బాపు-రమణలతో చేయించిన, తీయించిన వీడియో పాఠాలు, ఈటీవీ వారి భాగవతం వరకు వీరి ముగ్గురి బాగోతం మూడు పువ్వులు ముప్పైఆరు నవ్వులుగా సాగింది. ఆంధ్రజ్యోతి పునః ప్రారంభమైనప్పుడు నవ్య వీక్లీకి సంపాదకుడిగా మళ్లీ మొగ్గ తొడిగారు. వీక్లీ పరిమళాన్ని నాలుగు దిశలా వ్యాపింప చేశాక మహా టీవీ, అటు నుండి భక్తి టీవీకి వెళ్లారు. 'పత్రిక' అనే పత్రికకు గౌరవ సంపాదకుడిగా కూడా వ్యవహరించారు. నండూరి వారి దగ్గర మొదలై మొన్న 19 జూలై 2023 న వారు కాలం చేసే వరకు ఆయన కలం పరుగులెత్తుతూనే ఉంది. వారి రచనలు చదివుతున్న పాఠకుడి పెదవుల మీదకి హాస్యాన్ని వంపుతూనే ఉంది.

శ్రీరమణ పేరడీలు రాశారు. చమత్కారాలు రాశారు. ప్రముఖుల ప్రేమలేఖలు (పేరడీగా) రాశారు. కోనంగి రాతలు రాశారు. శ్రీచానల్ నిర్వహించారు. హాస్య జ్యోతుల్లో 'నవ్వుల నూనె' పోసారు. రంగుల రాట్నం తిప్పారు. మానవ సంబంధాల్లో నవ్వులు నింపారు. ఒకటా రెండా ఎన్నెన్నో శీర్షికలతో ఆయన త్రివిక్రముడిలా చెలరేగిపోయారు. పురాణం సుబ్రహ్మణ్య శర్మ వారి కోరిక మీద "ప్రేమ పల్లకి" నవల రాశారు. అప్పటివరకు ఒకరికి ఇంకొకరు తెలియని యువతీ యువకులు పెద్దలు కుదిర్చిన పెండ్లి చేసుకుని దంపతులుగా మారతారు. ఆ దంపతులు తాము భార్యా భర్తలమన్న విషయం పక్కన పెట్టి ప్రేమించుకుంటే ఎలా ఉంటుంది? అనే థీం తో ప్రేమపల్లకి నవల రాసారు. నవ దంపతులయిన గీత, రాంపండుల చిలిపి శృంగారాన్ని, కోపతాపాల్ని ముగ్ధ మనోహరంగా నవల మొత్తం నింపారు. నేను పదేండ్ల తేడాతో ప్రేమపల్లకి రెండు సార్లు చదివాను. ఎంత హాయిగా ఉంటుందో! మీరింకా ఈ నవల చదవలేదా? ప్చ్... దురదృష్టవంతులు. గంగిగోవు పాల చందంగా ఆయన రాసిన ఒకే ఒక్క నవల ఇది. "రంగుల రామచిలక" అనే మరో నవల సీరియల్‌గా వస్తున్నట్టు అదే ఆంధ్రజ్యోతిలో ప్రకటన వెలువడింది కానీ సీరియల్ మాత్రం రాలేదు. పెన్ను పంజరంలోనే ఉండిపోయింది ఆ రామచిలుక.

ప్రసిద్ధ మలయాళ దర్శకుడు యం.టి. వాసుదేవన్ నాయర్ ఈ కథను మలయాళంలో సినిమాగా తీసి జాతీయ బహుమతిని పొందారు. తెలుగులో మిథునాన్ని తనికెళ్ళ భరణి తన దర్శకత్వంలో యస్.పి.బాలు, లక్ష్మి రెండే పాత్రలతో ఒక గొప్ప కథను సినిమాగా తెలుగువారికి అందించారు.



ఆయన గొప్ప కథకుడు అన్న విషయం ప్రత్యేకంగా చెప్పాల్సినవసరం లేదు. ప్రపంచం మొత్తం మెచ్చిన 'మిథునం'తోపాటు బంగారు ముురుగు, ధనలక్ష్మి, షోడా నాయుడు, అరటి పువ్వు సాములోరు, నాలుగో ఎకరం... వంటి మేలిమి కథలు రాశారు.

ఆయనను పెద్ద పెద్ద సంస్థలు ఏవీ పిలిచి పురస్కారాలు ఇవ్వలేదు. ఆయన చేతులు చాచింది లేదు. తెలుగున పత్రికలని నెత్తిన పెట్టుకుని ఊరేగిన ఆ స్వర్ణయుగం నుండి మొన్నమొన్నటి వరకు రచయిత/త్రులందరూ 'తమ రచనకి బాపు బొమ్మలెయ్యడం పెద్ద గౌరవంగా' చెప్పుకునేవారు. ఒక్కోసారి ఆయనే 'నేను రెమ్యూనరేషన్ తీసుకునేది కథకు బొమ్మ వేసినందుకు కాదు. ఆ కథను చదివినందుకు' అని కొన్ని కొన్ని కథల విషయంలో అనే వారట. అలాంటి బాపు 'మిథునం' కథ చదివిన తర్వాత ఆ కథను ప్రతిబింబించే బొమ్మ వేయలేనేమో? ఒకవేళ వేసినా... కథ జీవాన్ని ఆ బొమ్మ లోకి తీసుకు రాలేమేమో? నని, భక్తి కొద్ది ఆ కథను తన చేతిరాతతో రాసి గౌరవించారు. బాపూ జీవితంలో ఇలా ఒక కథను తన చేతిరాతతో మొదటి నుండి చివరి వరకు రాయడం మిథునం విషయంలోనే జరిగింది. మిథునమే మొదటిది, చివరిది అట. ఇంతకంటే గొప్ప గౌరవం, గొప్ప డాక్టరేట్, మహోన్నత పురస్కారం ఇంకేముంటుంది! రచన శాయి బాపు చేతి రాతతో ఉన్న మిథునాన్ని పుస్తకం గా అచ్చేసి బాపు, శ్రీరమణలతో పాటు తెలుగు కథను గౌరవించారు.

మిథునం కథ కన్నడంలోకి అనువదించబడిన తర్వాత నాటకీకరణ కూడా జరిగింది. ఈ రోజుకి ఏదో ఒక ప్రాంతంలో ప్రదర్శింపబడుతూనే ఉందని కన్నడ రచయిత వసుదేంద్ర చెప్పారు. ప్రసిద్ధ మలయాళ దర్శకుడు యం.టి. వాసుదేవన్ నాయర్ ఈ కథను మలయాళంలో సినిమాగా తీసి జాతీయ బహుమతిని పొందారు. తెలుగులో మిథునాన్ని తనికెళ్ళ భరణి తన దర్శకత్వంలో యస్.పి.బాలు, లక్ష్మి రెండే పాత్రలతో ఒక గొప్ప కథను సినిమాగా తెలుగువారికి అందించారు.

నేడు మన మధ్య శ్రీరమణ లేకపోయినా ఆయన మన మీద చల్లి వెళ్లిన హాస్యపు పరిమళం ఈ జన్మకంటూ పోదు. శ్రీరమణ తెలుగు సాహిత్యపు వాతావరణాన్ని, సినిమా రంగాన్ని, అలాగే రాజకీయాలను దగ్గరగా చూసి, ఆ రాజకీయాలకు దూరంగా ఉన్న రచయిత. శ్రీరమణని మరిపించేలా పేరడీలు, కాలమ్స్, కథలు, కబుర్లు చెప్పే ఇంకో శ్రీరమణ మునుముందుకు వస్తారని ఆశించడం అత్యాశే అవుతుంది. అందుకే ఒకేఒక్క మిథునం. ఒకే ఒక్క శ్రీరమణ.



- కమల్
(kamalmanjarlapati@gmail.com)

### సుంకోజి దేవేంద్రాచారికి కె.ఎన్. జయమ్మ స్ఫూర్తి పురస్కారం

సృజనకారుడు, కవి, చిత్రకారుడు, నవలాకారుడు "అన్నం గుడ్డ" కథా రచయిత, "నీరు నేల మనిషి" నవలా రచయిత సుంకోజి దేవేంద్రాచారికి కె.ఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని ఇవ్వనున్నట్లు నిర్వాహకులు పలమనేరు బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని ఆగస్టు 6న పలమనేరు-గంగవరం, సాయి గార్డెన్ సిటీలోని కళామందిరంలో నిర్వహించే సాహిత్య సభలో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9440995010 నంబరు నందు సంప్రదించవచ్చు.

### 30న సినారె పురస్కారాలు

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో సినారె పురస్కారాలు అందివ్వనున్నారు. ఈ నెల 30న ఆదివారం ఉదయం 10 గంటలకు జడ్చర్ల గంగాపురం రోడ్‌లోని ప్రేమ్‌రంగా గార్డెన్స్‌లో సభ నిర్వహించునున్నారు. ప్రత్యేక పురస్కార స్వీకర్తలు వేణుశ్రీ, డా॥ రాయారావు సూర్యప్రకాశ్‌రావు, ఉమ్మడి జిల్లాల వారీగా గురిజాల రామశేషయ్య, డా॥ మచ్చ హరిదాసు, డా॥ టి.శ్రీరంగస్వామి, కందుకూరి శ్రీరాములు, ఎన్.సిహెచ్. చక్రవర్తి, పొద్దుటూరి మాధవీలత, కొరుప్రోలు మాధవరావు, ఎన్వీ.రఘువీర్ ప్రతాప్, తగుళ్ళ గోపాల్, తోకల రాజేశంలకు అందివ్వనున్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్చర్ల శాసనసభ్యులు డా॥ సి.లక్ష్మారెడ్డి, గౌరవ అతిథిగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ తొలి అధ్యక్షులు బాద్ని శివకుమార్, ఆత్మీయ అతిథిగా జాతీయ సాహితీ పరిషత్తు జడ్చర్ల అధ్యక్షులు చిగుళ్ళపల్లి పద్మలీల రానున్నారు.

### నేడు 'మణిపూర్ మారణహోమం'పై కవి సమ్మేళనం

సాహితీ వార్తలు

తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో 'మణిపూర్ మారణహోమం'పై సాయంత్రం 6 గం॥కు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. వివరాలకు 9490099083, 8897765417 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

# భావాలన్నీ ఒక దగ్గర పలికించిన కవిత్వం

అద్దం... అనేక భావాలను తళుక్కుమనిపిస్తుంది. మురిసిపోతుంది, నవ్వుతుంది, ఏడుస్తుంది, మైమరచి పోతుంది, అప్పుడప్పుడు మనసున ఒకటి పైకి ఒకటిగా అబద్ధాలాడుతుంది, అసూయ పడుతుంది, రాజీ పడుతుంది... అద్దం లాంటిదే జీవితం.. ఇన్ని భావాలు ఒకే దగ్గర పలి కించిన కవిత్వం.. ఝాన్సీ కొప్పిశెట్టి 'ఎడారి చినుకు'

సెలయేరు.. పక్కనే కురిసే వెన్నెల... ఒక అందమైన స్వప్నంలా సాగిపోయే జీవితం. హఠాత్తుగా స్వప్నం మాయమై, ఏరు ఎండినట్లు అయితే... అగ్ని కురుస్తున్న ఎడారి మధ్యలో చిక్కబడిన మనసు. విలవిలలాడే మనస్సు నుండి వెలువడిన అక్షరాలే ఈ "ఎడారి చినుకు".

అప్పటివరకూ వింటున్న గుండె లయ, ఒక్కసారిగా కుప్పకూలిన ప్రేమ, అనుకోని విధంగా ఆమె భర్త లోకాన్ని విడిచినప్పుడు, గుండె పగుళ్లుబారినప్పుడు, ఆమెకు కలిగిన వేదన కవితాత్మ అయ్యింది. అప్పటివరకూ తనతోనే ఉండి, ఒక్కసారిగా జీవంలేని శరీరంగా మారిన అతని గురించిన ఆవేదన ఇది.

"రశ్మికి దారీయని చీకటి తెరల మధ్య..
నీలి ఛాయల నిశి రాతిరి హోరై కురిసింది.."

అతను దూరమైన స్థితిని దృశ్యం చేసిన తీరు ఇది.

"నా ఎడారి కళ్ళల్లో కన్నీరు పొడిబారి
చమరింత అంతర్ముఖమై గుండె ఊబిలోకి జారింది."
"ఒకరికొకరమై అల్లుకున్న ప్రేమ పందిరి
ఒంటరైన నా వంక దిగులుగా చూసింది"

అతని జ్ఞాపకాలు దొంతర్లుగా కళ్ళ ముందు కదలాడుతున్న క్షణాలు మళ్లీ మళ్లీ కదలి గుండెల్ని మెలి పెడుతుంటే... నిశ్శబ్దంగా ఆమె, నిలువుగా స్థాణువైన ఆమె. జ్ఞాపకాలని ఒడిసిపడుతున్న హృదయంతో ఉన్న ఆమె, ఆమె మనసు.

సరిగ్గా అప్పుడే లోకంతీరు, పగిలిన గుండెతో సంబంధం లేని లోకం కళ్ళ ముందు ఆవిష్కరించబడింది.

"ఇప్పుడు నా చెంపలు తడవలేదని గుసగుసలు
కళ్లలో మెరుపులు తగ్గలేదని విరుపులు..."



ఎక్కడ ఎలాంటి పాయింట్ దొరికితే ఆమెను తూట్లు పొడిచే భావాలను వెళ్లగక్కే లోకం ఇది. భర్త శరీరాన్ని దహనం కేవలం కొడుకులు మాత్రమే చేయాలనే ఎప్పటి నుండో నాటుకు పోయిన, వేళ్లూనుకుని ఉన్న నమ్మకం. పురుషులు మాత్రమే ఆ కార్యక్రమం చేయాలనే రివాజు... సరిగ్గా ఇక్కడే ఒక ధిక్కారస్వరం వినపడుతుంది. పిల్లలు ఇద్దరూ విదేశాల్లో ఉండడంతో కొడుకు వరసవాళ్లు చెయ్యొచ్చు అనే తర్జనభర్జనల జాలి మాటల వల్ల కలిగిన అసహనం నుండి వచ్చిన ధిక్కారం అది.

"చెల్లని నాణెం చేసిన శ్రేయోభిలాషులు..
కుమార్తెల కులగోత్రాలు మారితే
కర్మకాండలకు అనర్హులట
మరి వంశపారంపర్య, జన్యుపర సంబంధాలు లేని
ఇతర వంశీయులు పురుషులైతే అర్హులేనట"

సానుభూతి చూపిస్తూ, ప్రేమ పేరుతో, బంధుత్వంతో చేసే కుట్ర అర్థం అయిన ఆవేదన ఆమెది. ఆడవాళ్లకు కొన్ని పరిమితులున్నాయి అనే కుతంత్రం అది. ఎవరు కర్మకాండలు చేయాలనే ప్రశ్నలు, చర్చలు గుండెను తూట్లు

అతని జ్ఞాపకాలు దొంతర్లుగా కళ్ళముందు కదలాడుతున్న క్షణాలు మళ్లీ మళ్లీ కదలి గుండెల్ని మెలి పెడుతుంటే... నిశ్శబ్దంగా ఆమె, నిలువుగా స్థాణువైన ఆమె. జ్ఞాపకాలని ఒడిసిపడుతున్న హృదయంతో ఉన్న ఆమె, ఆమె మనసు. సరిగ్గా అప్పుడే లోకంతీరు, పగిలిన గుండెతో సంబంధం లేని లోకం కళ్లముందు ఆవిష్కరించబడింది.

పొడుస్తుంటే ఆ వేదనలో ఆవేదనతో తనే కర్మకాండలు చేస్తానని ఎదురు నిలిచింది ఆమె.

ఎన్ని అవరోధాలు, ఎన్ని వ్యతిరేకతలు అన్నిటినీ అధిగమించి నిలిచి భర్తకు తలకొరివి పెట్టడానికి నిలబడింది.

"ఎవరైనా నా అడుగులజాడల్లో నడిస్తే
నాదే ముందడుగు..." అంటుంది.

అంతా అగాధం, ఎటు చూసినా చీకటి, ఎక్కడో ఆశ తను తిరిగి లేస్తారనే ఆశ అనడంలో ఆమె హృదయ వేదన కనిపిస్తుంది.

"డప్పుల చప్పుళ్లకి ఉలిక్కిపడి
లేవొచ్చన్న చిరు ఆశ
దింపుడు కళ్లెంలో నా పిలుపుకి
పలకొచ్చన్న పేరాశ"...

ముగిసిపోయిందనుకున్న జీవితంలోకి కూతురు కూతురు ప్రవేశానికి పరవశించి

"కొత్తగా అమ్మయిన మనసు చిందులేసింది...
జీవనది ప్రవహించింది నాలో..."

ఇక్కడే ఆమె తిరిగి తనను తాను దొరికించుకుంది. తిరిగి చిగుర్లు వేసింది. ఎడారిలో చినుకులా ప్రవేశించింది "ఆనిక". పూర్తిగా తనను తాను కోల్పోయి, లోయలోకి జారిన సమయంలో లేత మునివేళ్లను అందించింది ఆనిక.

తనలో మాతృత్వాన్ని తట్టిలేపిన ఆ చిన్నారి రాకకు అందమైన అక్షరాల పూలఏరు ఈ "ఎడారి చినుకు"

- సీహెచ్. ఉషారాణి, 9441228142

## మౌనం మాట్లాడింది

మణిపూర్‌పై దేశం భగ్గుమన్నాక
పార్లమెంట్ మౌనం మాట్లాడింది
దొంగలు పడిన ఆర్నెల్లకు
కుక్కలు లేచి మొరిగినట్టు

తెల్లవారు ఝామున కూయాల్సిన
మణిపూర్ పాలక కోడీ కూసింది
బారెడు పొద్దు ముఖం మీద పడ్డాక
మే దురాగతంపై కాదు, ట్విట్టర్‌పై కోపంతో

మొన్నటి గుజరాత్ నిన్నటి కాశ్మీరుల్లో
రాజేసిన ఉన్మాదపు కాష్టం
నేడు మణిపూర్ని తగలేసింది
రేపు.. దేశమో.. మైనార్టీలో కావచ్చు

దిగ్గున లేచిన దేశానికి దణ్ణం పెట్టారు
పడమటి పొద్దుపొడుపు చూడమన్నారు
నిందుతుడు హరిదాస్ అబ్దుల్లా అయ్యాడు
ఇప్పుడందరూ చప్పట్లు కొట్టండంటారేమో

- వివి

# హైదరాబాద్‌పై కేటీఆర్ మార్క్

- బెంగుళూర్, ముంబయ్‌ను మించిన ఐటీ రంగం
- హైదరాబాద్ దిక్కుచూస్తున్న ఐటీరంగంతోపాటు ప్రముఖ కంపెనీలు
- కేటీఆర్ కృషితో శరవేగంగా నగరం అభివృద్ధి

(రత్నాకర్.ఇ)



తొమ్మిదేండ్ల కాలంలోనే అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ 1 రాష్ట్రంగా నిలిచింది. అభివద్ధి, సంక్షేమంలో తెలంగాణకు తిరుగేలేదనేలా 9 ఏండ్ల పాలన సాగింది. ఐటీ రంగం వేగంగా అభివద్ధి చెందింది. హైదరాబాద్ నగరం దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడుతూ అగ్రస్థానంలో నిలిచింది. అయితే దీనింతటికి ముఖ్య కారణం తెలంగాణ ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు. కేటీఆర్‌గా ఆయన పాపులర్. తండ్రి సీఎం కేసీఆర్ బాటలో నడుస్తూ ఎంతో మంది యువకులకు రోల్ మోడల్ అయ్యారు. యూకే, యూఎస్ఏ పర్యటనల్లో భారీగా పెట్టుబడులను ఆయన ఆకర్షించారు. దీనిలో భాగంగా హైదరాబాద్‌తోపాటు సిద్దిపేట్, కరీంనగర్, నల్గొండ తదితర జిల్లాలో కొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకువచ్చాయి. ఇక ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కూడా తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇక్కడ అనేక కంపెనీలు తమ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు నెలకొల్పుతున్నాయి. హార్డ్‌వేర్ రంగంలో ఫాక్స్‌కాన్ తమ యూనిట్‌ను కొంగరకలాన్‌లో నిర్మిస్తోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన టీ-హబ్ ఎంతో మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సాయం చేస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్‌గా రికార్డులకు ఎక్కింది. దీంతో పాటు వీ-హబ్, టీ-వర్స్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం నూతన ఆవిష్కరణలకు చేయూత అందిస్తోంది. ఐటీ అభివృద్ధిలో కేటీఆర్ మార్క్ స్పష్టంగా కనిపిస్తోంది.



## సిద్దిపేట టూ అమెరికా

కేటీఆర్ సిరిసిల్లా జిల్లా, బొయినపల్లి మండలం, కొదురుపాకలో 1976, జూలై 24న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, శోభ దంపతులకు జన్మించారు. రెండేండ్లపాటు కరీంనగర్‌లో చదువుకున్న రామారావు, హైదరాబాద్‌లోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్ లో పాఠశాల విద్యను పూర్తిచేశారు. 1990-91 ఎస్ఎస్‌సీ, జీజీ స్కూల్, హైదరాబాద్. 1991-93 గుంటూరులోని విజ్ఞాన్‌లో ఇంటర్మీడియట్ పూర్తిచేసి హైదరాబాద్ వచ్చి మెడిసిన్ ఎంట్రెన్స్ రాసిన రామారావుకు కర్ణాటకలోని ఓ మెడికల్ కాలేజీలో సీటొచ్చింది. కానీ అది ఇష్టంలేక నిజాం కాలేజీలోని మైక్రోబయాలజీ డిగ్రీలో చేరారు. కాలేజీలో ఉన్నప్పుడు క్రికెట్ బాగా ఆడేవారు. కాలేజీ వేడుకల్లో స్నేహితులతో కలిసి డాన్స్ ప్రదర్శనలో కూడా పాల్గొనేవారు. పుస్తకాలు బాగా చదివేవారు. 1996-98 ఎమ్మెస్సీ, (బయోటెక్నాలజీ) పూణే యూనివర్సిటీ, ముంబాయి. తర్వాత న్యూయార్క్ వెళ్లి మార్కెటింగ్ అండ్ ఈకామర్స్‌లో ఎంబీఏ చేశారు. 2001 నుంచి 2006 దాకా ఐటీ ప్రొఫెషనల్‌గా పనిచేశారు. 2006లో పూర్తి స్థాయిలో బీఆర్ఎస్‌లో చేరి క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

- సిరిసిల్లా జిల్లా, బొయినపల్లి మండలం, కొదురుపాకలో కేటీఆర్ జూలై 24, 1976లో కేటీఆర్ జన్మించారు.
- జీవిత భాగస్వామి శైలిమ
- సంతానం : హిమాన్ష్ (కొడుకు), అలేఖ్య (కూతురు)
- తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషలలో కేటీఆర్‌కు ప్రావీణ్యం ఉంది.





మైక్రో సాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లతో తెలంగాణ మంత్రి కేటీఆర్



గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌తో తెలంగాణ మంత్రి కేటీఆర్

ప్రపంచ సమస్తం

## కృత్రిమ మేధతో జర్నలిజాన్ని పరీక్షిస్తున్న గూగుల్



**న్యూయార్క్** : కృత్రిమ మేధ(ఏఐ)ను ఉపయోగించి చేసిన ఒక జర్నలిస్టిక్ ఉత్పత్తిని గూగుల్ పరీక్షిస్తున్నది. ఈ ఉత్పత్తిని ప్రధాన వార్తా సంస్థల ముందుంచాలనే లక్ష్యంగా గూగుల్ పనిచేస్తున్నదని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ఈ రిపోర్టుకు సదరు ఉత్పత్తి తయారీకి దగ్గరగావున్న మూడు వనరుల ఆధారం అని కూడా న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. దీనినిబట్టి గూగుల్ ఈ పత్రికను కూడా సంప్రదించినట్టు అర్థమవుతున్నది.


గూగుల్ సంస్థలో అంతర్గతంగా ఈ ఉత్పత్తిని జెనెసిస్ అని పిలుస్తారు. ఒక విషయంపైన ఎవరు, ఏమిటి, ఎక్కడ లేక ఎప్పుడు అనే లబ్దిదారు ఇచ్చిన సమాచారం ఆధారంగా వార్తలను అందించే సామర్థ్యం ఈ జెనెసిస్ సాధనానికి ఉంటుంది. ఇది వార్తా సంస్థల ఉద్యోగులను తొలగించనవసరం లేకుండా ఉపయోగించగలిగే 'బాధ్యతగల సాంకేతికత' అని గూగుల్ భావిస్తున్నది. అయితే జనరేటివ్ కృత్రిమ మేధను ఉపయోగిస్తే ఉద్యోగుల అవసరం ఉండకపోవచ్చు.

జెనెసిస్ సాధనంవల్ల వార్తా కథనాల్లో యాంత్రికత నెలకొంటుందని జర్నలిస్టులు భావిస్తున్నారు. అయితే జెనెసిస్ లక్ష్యం వార్తల రిపోర్టింగ్, వాస్తవాలను సరిచూసుకోవటం, సృష్టించటంవంటి పాత్రను పోషించే జర్నలిస్టులను స్థానభ్రంశం చెయ్యాలని కాదనీ, అందుకు బదులుగా శీర్షికలకు ప్రత్యామ్నాయాలను సూచించటం, రాసే స్టయిల్స్‌ను అందించటంగా ఇది ఉంటుందని గూగుల్ ప్రతినిధి తెలిపారు. జెనెసిస్ జర్నలిస్టులకు "వ్యక్తిగత సహాయకుడి"గా ఉంటుందని గూగుల్ భావిస్తున్నది. నిత్యం చేసే పనులను ఆటోమేట్ చేసి ఇంటర్వ్యూలు, రిపోర్టింగ్ వంటి క్షేత్ర స్థాయి కార్యకలాపాలపైన దృష్టిని సారించేలా చేస్తుందని గూగుల్ అంటున్నది.

జర్నలిజం కోసం చాట్ జీపీటీ వంటి సాధనాన్ని గూగుల్ తయారు చేస్తుందని తెలిసినప్పుడు అది జెనెసిస్‌తో ఫేక్ వార్తల పండోరా బాక్స్‌ను తెరవటంగా ఉంటుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమైంది. గూగుల్ కృత్రిమమేధతో ఈ సంవత్సర ఆరంభంలో తయారుచేసిన చాట్ జీపీటీ సంక్లిష్ట అసత్య రూపకల్పనలను సత్యాలుగా అందించే సాధనంగా పేరు తెచ్చుకుంది. ఇటువంటి అభూతకల్పనలు కృత్రిమ మేధ నమూనాల్లో కనపడటం సాధారణమేనని, అవి ఎందుకు వస్తాయో, వాటిని నిజాయితీగా చూపటం ఎలానో ఎవరికీ తెలియదని గూగుల్ సీఈఓ సుందర్ పిచ్చాయ్ అన్నాడు. ఒకవేళ గూగుల్ గనుక తన సెర్చ్ అల్గోరిథమ్స్‌లో కృత్రిమ మేధతో జనరేట్ అయిన విషయాలకు ప్రాధాన్యతనిస్తే వాస్తవాలపైన, జరిగిన ఘటనలపైన రాసే వార్తలు అడుగంటుతాయని రేడియో ఎడిటర్ గాబె రోజెన్బర్గ్ న్యూయార్క్ టైమ్స్ వ్యాసానికి స్పందనగా ట్రీట్ చేసింది.

చాలా ప్రముఖ వార్తా సంస్థలు కృత్రిమ మేధతో కుస్తీ పట్టినా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బజ్ ఫీడ్ వార్తాసంస్థ కృత్రిమ మేధతో తయారు చేసిన క్విజ్‌ల క్వాలిటీ అంతంత మాత్రంగానే ఉంది. కృత్రిమ మేధతో వ్యాసాలు రాయించి వ్యక్తుల పేర్లు పెట్టిన సినెట్ సంస్థ ప్రయోగం బెడిసికొట్టింది. ఇన్ని వైఫల్యాలున్నా చాట్ జీపీటీని తయారుచేసిన ఓపెన్ ఆర్టిఫిసియల్ ఇంటెల్లిజెన్స్ కంపెనీతో అసోషియేటెడ్ ప్రెస్ వంటి ప్రముఖ వార్తా సంస్థలు తమతమ న్యూస్ రూముల్లో ఈ టెక్నాలజీని వాడటానికి ఒప్పందాలు చేసుకుంటున్నాయి.

## 'నాజీ' జెలెన్ స్కీని తిరస్కరించిన నికరాగ్వా అధ్యక్షుడు



**న్యూయార్క్** : ఈయూ-సీఈఎల్ఏసీ శిఖరాగ్ర సమావేశంలో 'ఫాసిస్టు నాజీ' ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదీమీర్ జెలెన్ స్కీకి మద్దతుగా ప్రకటన చేయమని యూరోపియన్ యూనియన్ వత్తిడి చేయటం కమ్యూనిటీ ఆఫ్ లాటిన్ అమెరికన్ అండ్ క్యారిబియన్ స్టేట్స్ (సీఈఎల్ఏసీ) ప్రయోజనాలకు భంగకరమని నికరాగ్వా అధ్యక్షుడు, డేనియల్ ఓర్టేగా ఆరోపించాడు. నికరాగ్వాలో శాండినిస్తా 44వ వార్షిక విజయోత్సాహ సమావేశంలో మాట్లాడుతూ బ్రస్సెల్స్ సమావేశంలో ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంపట్ల ఆందోళనను వ్యక్తపరిచే ప్రకటనపట్ల తన విచారాన్ని వెలిబుచ్చాడు.

'నికరాగ్వాను అమెరికా అనుకూల దేశం'గా మార్చేందుకు యూరోపియన్ యూనియన్ ప్రయత్నిస్తున్ననీ, మూడవ సీఈఎల్ఏసీ-యూరోపియన్ యూనియన్ శిఖరాగ్ర సమావేశం చేసిన అసత్య సంయుక్త ప్రకటనపై తన ప్రభుత్వం సంతకం చేయలేదని, ఆమోదించలేదని, అనుసరించలేదని ఆయన గట్టిగా చెప్పాడు. తీర్మానాలను అందరి సమ్మతితో ఆమోదించాలనీ, యూరోపియన్ యూనియన్ సరియైన పద్ధతిని అనుసరించకుండా సీఈఎల్ఏసీ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నదని ఆయన అన్నాడు.

'సీఈఎల్ఏసీతో జరిగిన యూరోపియన్ కమ్యూనిటీ సమావేశంలో వాళ్ల ఫాసిస్టు, నాజీ ఉక్రెయిన్ అధ్యక్షుడిని భాగం చేయాలని చూశారు. యూరోపియన్లు ఎంతగా ఒత్తిడి చేసినా మెజారిటీ సీఈఎల్ఏసీ దేశాలు ఫాసిస్టు ఉక్రెయిన్ అధ్యక్షుడికి మద్దతుగా నిలువలేదు' అని ఓర్టేగా అన్నాడు. శిఖరాగ్ర సభ సంయుక్త ప్రకటనలో ఉక్రెయిన్ యుద్ధానికి రష్యా మాత్రమే కారణమని సూచించే వాక్యాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నాన్ని తిప్పికొట్టారని కూడా ఆయన అన్నాడు.

## మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలి : మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మనఇంటి పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదివారం ఉదయం 10 గంటలకు 10 నిమిషాల పాటు దోమల నివారణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కోకాపేట్‌లోని తన నివాసంలో దోమల నివారణ కోసం ఇంటి పరిసరాలలో నిల్వ ఉండే నీరును స్వయంగా తొలగించి చెత్తను మంత్రి హరీష్ రావు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం, కుటుంబం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆదివారం ఉదయం 10 గంటలకు 10 నిమిషాలు కేటాయించి కుటుంబ సమేతంగా మన ఇంటి పరిసరాలను, నిల్వ ఉండే నీటిని శుభ్రం చేసుకోవాలని కోరారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని అప్రమత్తం చేశారు.

## సిట్టింగులకే సీట్లు ఇవ్వాలి.. : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత లేదని చెబుతున్న సీఎం కేసీఆర్ అదే నిజమైతే..సిట్టింగ్‌లకే సీట్లు ఇచ్చి ఎన్నికల బరిలో నిలపగలరా? అని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. రాష్ట్రంలో తొమ్మిదేండ్లుగా అవినీతి తీవ్రంగా పెరిగిందని తెలిపారు. కుటుంబానికి పదవులిచ్చి, ఉద్యమ ద్రోహులను నెత్తిన పెట్టుకున్నారని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని గుర్తుచేశారు.

# ఉద్యోగ భద్రత 'కరువు'

- ఉపాధిహామీ ఉద్యోగుల వెతలు
- 17 ఏండ్లయినా పర్మినెంట్ కాని వైనం
- గ్రామీణ అభివృద్ధిలో కీలక భూమిక
- పే స్కేల్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం
- ఆందోళనల దిశగా సన్నద్ధం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ఉద్యోగుల వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయి. 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా నియమితులై నేటికీ 17ఏండ్లకు పైగా అయినా పర్మినెంట్ చేయకపోవడంతో ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని వీరు వాపోతున్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్లు అన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణమైన విద్యార్హతలతో రాత పరీక్షలు రాసి జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికైనా.. ఏండ్లకు ఏండ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగానే చెలామణి అవుతున్నారు. తెలంగాణ గ్రామీణ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఎస్ఆర్‌డీఎస్), ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ) పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉంది.

**గ్రామీణ అభివృద్ధి శాఖ నిర్లక్ష్యం**

గ్రామీణాభివృద్ధిశాఖలో పనిచేస్తున్న 'ఉపాధి' హామీ ఉద్యోగులను 2006లో విధుల్లోకి తీసుకున్నా 2008 నుంచి హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తున్నారు. ఈ శాఖ పరిధిలోనే ఎస్ఆర్‌డీఎస్‌ను ఏర్పాటు చేసి ఎఫ్‌టీఈలుగా వీరిని కొనసాగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,874 మంది ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ) ఉండగా ఖమ్మం జిల్లాలో 172 మంది పనిచేస్తున్నారు. వీరితో పాటు ఇదే సెర్ప్ సొసైటీ ద్వారా కాంట్రాక్టు పద్ధతిన తీసుకున్న ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ) ఉద్యోగులను పర్మినెంట్ చేసిన గ్రామీణ అభివృద్ధి శాఖ.. ఉపాధిహామీ ఉద్యోగుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోందని సంబంధిత ఉద్యోగ సంఘాల జేఏసీ ఆరోపిస్తోంది. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుతో పాటు మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, స్పెషల్ కమిషనర్‌లు, 70 మందికి పైగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నా తమకు పే స్కేల్ అమలయ్యేలా లేదని ఉపాధి హామీ ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రికి రెండు పర్యాయాలు (జోగులాంబ గద్వాల బహిరంగసభ, ఆసిఫాబాద్ కలెక్టరేట్ ప్రారంభోత్సవం) వినతిపత్రాలు ఇచ్చారు. రాష్ట్రంలో ఏ ఒక్క ఉద్యోగ సంఘం కూడా ఇన్ని ప్రయాసాలకు ఓర్చి, ఇంతమంది ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించి ఉండకపోవచ్చని ఉపాధిహామీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

**గ్రామీణ అభివృద్ధిలో ఉద్యోగుల కీలక భూమిక..**

గ్రామీణ అభివృద్ధిలో రాష్ట్రవ్యాప్తంగా 3874 మంది ఉద్యోగులుండగా వీరిలో 2072 మంది టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ అకౌంట్స్ అసిస్టెంట్స్ 887, అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్లు 396, ఇంజినీరింగ్ కన్సల్టెంట్/ జూనియర్ ఇంజినీర్లు 356, ప్లాంటేషన్ సూపర్‌వైజర్స్ 27, హెచ్ఆర్ మేనేజర్స్ 23, ప్రాజెక్టు ఆఫీసర్స్ 23, మొత్తం 26 హోదాలతో కూడిన ఉపాధిహామీ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణ పల్లెలకు 13కు పైగా అవార్డులు రావడంలో వీరిపాత్ర ఎనలేనిది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రాష్ట్ర దశాబ్ది అవతరణోత్సవాల్లో ప్రకటించిన 23 అంశాల్లో దాదాపు 10 నుంచి 15 అంశాల్లో ఉపాధిహామీ ఉద్యోగుల కృషి ఉంది. గ్రామాల్లో కీలకంగా పారిశుద్ధ్య పనులు, మరుగుదొడ్ల నిర్మాణం, భూమి అభివృద్ధి పనులు, తెలంగాణ హరితహారం, అవెన్యూ ప్లాంటేషన్, మల్టీ లెవల్ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనాలు, అంగన్‌వాడీ భవనాలు, శ్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్లు, రైతువేదికలు, సీసీ రోడ్ల నిర్మాణం...ఇలా ఎన్నెన్నో ఉపాధిహామీ ఉద్యోగుల కృషితో ముందుకు సాగుతున్నాయి. కరోనా వంటి విపత్కర సమయంలోనూ వీరందించిన సేవలు ప్రశంసలు అందుకున్నాయి. ఉపాధి ఉద్యోగులను పర్మనెంట్ చేసి, పేస్కేల్ అమలు చేయడంలో తమవంతు సహకారం అందిస్తామని 60 మందికి పైగా ప్రజాప్రతినిధులు, చివరకు శాసనసభ, శాసనమండలి స్పీకర్లతో సహా వీరి న్యాయబద్ధమైన ఆకాంక్షకు మద్దతు తెలపడం గమనార్హం.



**'ఉపాధి' ఉద్యోగులందరికీ భరోసానివ్వాలి..**



ఉపాధిహామీలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన ఉపాధిహామీ సిబ్బందిని ఆదుకోవాలి. గ్రామాల అభివృద్ధి, పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న 17 ఏండ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా బతుకులు వెళ్లదీస్తున్నాం. ఇకనైనా పేస్కేల్ వర్తింపజేసి, పర్మనెంట్ చేయాలని ప్రభుత్వాన్ని ప్రాధేయపడుతున్నాం. శాంతియుతంగా సాగుతున్న మా పోరాటాన్ని పరిగణనలోకి తీసుకోవాలని వేడుకుంటున్నాం.

- ఎండీ జలీల్‌ఖాన్, జేఏసీ, స్టేట్ కో కన్వీనర్

## 30న కొల్లాపూర్‌లో భారీ బహిరంగ సభ

**ప్రియాంక గాంధీ హాజరు**

- ఆగస్టు 15న నిర్వహించే ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ గర్జనకు ఖర్గే
- బస్సు యాత్ర రూట్ మ్యాప్ కోసం సబ్ కమిటీ
- రాజకీయ వ్యవహారాల కమిటీలో నిర్ణయాలు
- మణిపూర్‌లో బీజేపీ సర్కారును బర్తరఫ్ చేయాలని తీర్మానం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం పూరించనుంది. ఈనెల 30న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో భారీ బహిరంగసభను నిర్వహించనుంది. ఈ సభకు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకాగాంధీ హాజరుకానున్నారు. ఆగస్టు 15న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గర్జన నిర్వహించనుంది. ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే రానున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ,మైనార్టీలకు సంబంధించిన సమస్యలపై డిక్లరేషన్లు విడుదల చేయనున్నారు. అందుకోసం అధ్యయన కమిటీని నియమించాలని కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) నిర్ణయించింది. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ ఇంచార్జ్ మాణిక్‌రావు ఠాక్రే అధ్యక్షతన పీఏసీ సమావేశమైంది. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కతోపాటు సభ్యులు జీవన్ రెడ్డి, రోహిత్ చౌదరీ, మన్సూర్ ఖాన్, మధు యాష్కీ,మహేష్ కుమార్ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, జగ్గారెడ్డి, ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, వి. హనుమంతరావు, కె. జానారెడ్డి, షబ్బీర్ అలీ, సంపత్ కుమార్, చిన్నారెడ్డి, దామోదర రాజనర్సింహ, రేణుకాచౌదరీ, బలరాం నాయక్ తదితరులు హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మధుయాష్కి మాట్లాడుతూ తొమ్మిందేండ్లుగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయా వర్గాలకు ఏం చేయబోతున్నదో అధ్యయనం చేసేందుకు రెండు రోజుల్లో సబ్ కమిటీ వేయనున్నట్టు తెలిపారు. వికలాంగులకు రూ 4వేల పింఛన్ ఇస్తామన్న కాంగ్రెస్ హామీ సత్ఫలితాలనిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు రూ.4016 పింఛన్ ప్రకటించడం కాంగ్రెస్ విజయమేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మరో సబ్ కమిటీ వేస్తామని తెలిపారు. ఎక్కడి నుంచి యాత్ర చేయాలనే విషయాన్ని త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. కన్వీనర్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలు, క్రిస్టియన్ మైనార్టీలు, మహిళలకు సంబంధించిన డిక్లరేషన్లు విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. ఆయా వర్గాలకు మేలు చేసేందుకు నిపుణులతో అధ్యయం చేయిస్తామన్నారు.

సమావేశంలో కేరళ మాజీ సీఎం ఊమెన్ చాంది, మాజీ మంత్రి సి రామచంద్ర రెడ్డి మృతి పట్ల సంతా పాన్ని తెలిపారు. మణిపూర్‌లో 80 రోజులుగా దారు ణాలు జరుగుతున్నా...కేంద్ర ప్రభుత్వం పట్టించు కోవడం లేదని విమర్శించారు. వెంటనే ఆరాష్ట్ర ప్రభుత్వాన్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## కెప్టెన్ లక్ష్మీ సెహగల్ స్ఫూర్తితో హక్కుల కోసం ఉద్యమాలు

**ఐద్వా ఉపాధ్యక్షులు టీ. జ్యోతి**



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ పోరాట స్ఫూర్తితో మహిళా హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షులు టి జ్యోతి పిలుపునిచ్చారు. లక్ష్మీసెహగల్ 11 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యమైన పాత్ర పోషించడమే కాక, యుద్ధంలో గాయపడిన సైనికులకు డాక్టర్‌గా వైద్య సేవలు అందించిన వీరనారి సెహగల్ ఆమెని తెలిపారు. స్వాతంత్ర్యం పోరాటంలో సుభాష్ చంద్రబోస్ నడిపిన సైన్యంలో చేరి 50 మందితో మహిళా రేంజిమెంట్ తయారుచేసి దానికి కెప్టెన్‌గా బాధ్యత వహించారని చెప్పారు. పోరాడి సాధించుకున్న స్వతంత్ర భారతంలో నేడు మహిళలకు భద్రత లేకుండా పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

మూడు నెల్లుగా మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమానికి బీజేపీనే బాధ్యత వహించాలని చెప్పారు. స్త్రీలపై జరుగుతున్న అమానుష ఘటనలను నిలవరించటంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం సెహగల్ తాన తుది శ్వాస వరకు పేదలకు ఉచితంగా వైద్యం అందించిన గొప్ప మహనీయురాలని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బి. కవిత, కే. శాంతమ్మ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కెప్టెన్ లక్ష్మి సెహగల్ జీవితం స్ఫూర్తిదాయకం : సుభాషిణీ అలీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణీ అలీ అన్నారు. సెహగల్ 11వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉదయం సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయంలో 'ఆజాదీ - కెప్టెన్ లక్ష్మి సెహగల్ పోరాటం, దృక్పథం' అంశంపై నిర్వహించిన వెబినార్‌లో సుభాషిణీ అలీ మాట్లాడారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఆమె తెగబడి పోరాడారని తెలిపారు. నేతాజి సుభాష్ చంద్రబోస్ సైన్యంలో ఝాన్సీ కా రాణీ రెజిమెంట్‌ను ఏర్పాటు చేసి పాల్గొన్నారని గుర్తుచేశారు. లక్ష్మీ సెహగల్‌తో పాటు స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది మహిళలు పోరాడారనీ, వారందరినీ స్మరించుకోవాలని సూచించారు. 1940లో వైద్యవిద్యను అభ్యసించిన లక్ష్మీ బ్రిటీష్ పాలకులు విధించిన షరతు (స్వదేశంలో అయినా సరే...లేదా బ్రిటీష్ వలస పాలనలో ఉన్న దేశాల్లో అయినా సరే కచ్చితంగా బ్రిటీషర్ల ఆస్పత్రుల్లోనే పని చేయాలి)ను ఇష్టపడలేదని తెలిపారు. దీంతో సింగపూర్‌లో, తన వైద్య వృత్తిని కొనసాగించారని వివరించారు.

కాన్పూర్‌లో స్థిరపడ్డ లక్ష్మీ సెహగల్ జీవితకాలం హిందూ, ముస్లీం ఐక్యత కోసం నిలబడ్డారని చెప్పారు. ఈఎంఎస్ నంబూద్రిపాద్ కాన్పూర్‌కు రావడం, నేతాజీని తీవ్రంగా విమర్శించాల్సిన అవసరం లేదనడం, బంగ్లా సరిహద్దుల్లో వైద్య సేవల కోసం జ్యోతిబసు ఆమెను ఆహ్వానించడం తదితర పరిణామాలతో పాటు అక్కడ సీపీఐ(ఎం) కార్యకర్తల సేవా నిబద్ధతను చూశాక 57 సంవత్సరాల వయస్సులో పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారని గుర్తుచేశారు. 1981లో ఐద్వా ఏర్పాటు తర్వాత తొలిసారిగా ఆ సంఘానికి ఉపాధ్యక్షురాలిగా సేవలందించారని సుభాషిణీ అలీ చెప్పారు. ఢిల్లీ సరిహద్దుల్లో సిక్కులపై ఊచకోత సమయంలో కాన్పూర్‌లో అలాంటి దాడి జరగకుండా అడ్డుగా నిలిచిన ధైర్యవంతురాలు లక్ష్మీసెహగల్ అని తెలిపారు. ప్రతిపక్షాల ఉమ్మడి రాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలిచిన సమయంలో ఆమె కాళ్లు మొక్కేందుకు నాటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ జోషి ప్రయత్నిస్తే, రక్తం తాకిన చేతులతో తన కాళ్లు ముట్టుకోవద్దంటూ బహిరంగ సభలో చెప్పిన ధీర వనిత సెహగల్ అని కొనియాడారు. గెలుపోటములతో నిమిత్తం లేకుండా పోరాట మార్గం ఎంచుకున్న ఆమె తాను బతికిన 97 ఏండ్లూ అదే బాటలో పయనించారని తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీలు, సర్పంచులు

**అమ్మవారి బంగ్లాలో గద్వాల జిల్లా బంధీ: రేవంత్**

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జోగులాంబ గద్వాల జడ్పీ చైర్ పర్సన్ సరిత, తిరుపతయ్య, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గద్వాల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నేతలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులతో కలిపి 800 మంది హస్తం పార్టీలో చేరారు. అందులో 30మంది సర్పంచులు, 12 మంది ఎంపీటీలతోపాటు పలువురు నాయకులు ఉన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గద్వాల జిల్లా అమ్మగారి బంగ్లాలో బంధీ అయిందని ఆరోపించారు. ప్రజలను ఆ బంగ్లా ముందు బానిసలుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాల్లోని అన్ని ఎమ్మెల్యే స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పాలమూరు ఎత్తిపోతల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్‌కు తన పాలనపై నమ్మకముంటే, సిట్టింగులందరికీ సీట్లివ్వాలని సూచించారు. గజ్వేల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పోటీ చేయాలని డిమాండ్ చేశారు.

## కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌కు సీపీఐ(ఎం) నివాళి

**న్యూఢిల్లీ** : స్వాతంత్ర్య సమరయోధురాలు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వ్యవస్థాపక ఉపాధ్యక్షులు కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌కు సీపీఐ(ఎం) ఘన నివాళులర్పించింది. ఆమెను స్మరించుకుంటూ పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. మహిళల పట్ల వివక్షకు తావులేని, సమానత్వం, న్యాయం పరిఢవిల్లే సమ సమాజ నిర్మాణం కోసం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా ప్రతీనబూనుదామని సీపీఐ(ఎం)పిలుపునిచ్చింది. అమరవీరులు, స్వాతంత్ర సమరయోధుల కలలను సాకారం చేసేందుకు ప్రతిక్షణం వెచ్చిద్దామని పేర్కొంది. ప్రజల హృదయాల్లో సజీవంగా ఉండే లక్ష్మీ సెహగల్ వంటి యోధులకు మనమిచ్చే ఘన నివాళి ఇదేనని సీపీఐ(ఎం) తెలిపింది.

## జనం మెచ్చిన నాయకుడు కేటీఆర్

- ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు : కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు జనం మెచ్చిన నాయకుడనీ, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ పేర్కొన్నారు. టీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా రాణించాలనీ, యువతకు ఐకాన్‌గా, పార్టీ నాయకులకు మార్గదర్శిగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

## కేటీఆర్ జన్మదినం : టెకీల రక్తదానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్ మెంట్ కౌన్సిల్ (టీఎఫ్ఎంసీ) అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, ఐటీ డిప్యూటీ సీఆర్ఓ శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్ ఖాజాగూడలోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ వెనుకవైపు ఉన్న దివ్యశ్రీ ఎస్ఎస్ఎల్ ఐటీ పార్క్ లో నిర్వహించే ఈ శిబిరంలో దాదాపు వెయ్యి మంది వరకు రక్తదానం చేస్తారని తెలిపారు.

## కార్పోరేట్ల కోసమే మణిపూర్‌లో మానవ హననం : గడ్డం సదానందం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్పొరేట్ల కోసమే మణిపూర్‌లో మానవ హననం జరుగుతున్నదని సీపీఐ (ఎంఎల్) ఆర్ ఐ,సీఓసీ సభ్యులు గడ్డం సదానందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అటవీ సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుకీలను అడవి దూరం చేసే కుట్రలో భాగమే ఈ దారుణాలని తెలిపారు. అనేక మంది మహిళలపై సామూహిక లైంగిక దాడులు జరుగుతున్నా..కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## గురక నిద్ర అనారోగ్యానికి దారి తీస్తుంది : మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురక నిద్ర అనారోగ్యానికి దారి తీస్తుందని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఆదివారం రాష్ట్రంలో మొట్ట మొదటి స్లీప్ థెరపెటిక్స్ కేంద్రాన్ని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురక నిద్ర అనేక అనర్థాలకు కారణమవుతుందని చెప్పారు. దీంతో పాటు నిద్ర రాకపోవడం, నిద్రలో నడవడం, అతిగా నిద్ర పోవడం వంటి సమస్యలకు స్లీప్ థెరపెటిక్స్ కేంద్రం ఎంతో ఉపయోగ పడుతుందని హరీష్ రావు తెలిపారు. గురక నిద్ర, నిద్ర లేమి సమస్యలు ప్రతి ఒక్కరికీ ఇబ్బంది కలిగిస్తున్నాయని, అలాంటి వారికి స్లీప్ థెరపెటిక్స్ కేంద్రంలో చక్కని పరిష్కారం దొరుకుతుందని వివరించారు. ఈ కేంద్రం వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ హర్షిని ప్రతీక్ వినూత్న ఆలోచనలకు రూప కల్పన చేశారని హరీష్ రావు ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, శాసన మండలి చీఫ్ విప్ టీ.భాను ప్రసాద్ రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు దేశంలోనే అధిక పింఛన్..

- కార్పొరేషన్ చైర్మెన్ వాసుదేవ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో ఎక్కడా లేని విధంగా వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక పింఛన్‌ను ఇస్తున్నదని వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వికలాంగులకు సీఎం కేసీఆర్ కొండంత అండగా నిలిచారని కొనియాడారు. ఒకే సారి వెయ్యి రూపాయలు పెంచుతూ జీవో జారీ చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో బాణా సంచా కాల్చి సంబురాలు చేసుకున్నారని తెలిపారు.పెరుగుతున్న జీవన ప్రమాణాలకు అనుగుణంగా పింఛన్‌ను పెంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికంగుల నాయకులు మున్నా, గుత్తికొండ కిరణ్, నల్లగొండ శ్రీనివాస్ సుమన్, రాజ్యలక్ష్మి, కొమురెల్లి, వేణు,నాగరాజు, మనీ, తదితరులు పాల్గొన్నారు.




కవిత్వం వలె చిత్రం కూడా ఎన్నో భావాలను పలికిస్తుంది. మరెందరినో కదిలిస్తుంది. మనల్ని చైతన్య పరుస్తుంది. అదే చిత్రకారుల్లోని మనసులోతుల్లోని ఆలోచనలను కాన్వాస్‌పై ఆవిష్కరించేలా ప్రేరేపిస్తుంది. కాదేదీ కవితకనర్హం అని శ్రీశ్రీ అన్నట్టు కాదేదీ కళకు అనర్హం అంటూ తమ ప్రతిభను చాటుకుంటున్న వారు ఎందరో మన కండ్ల ముందు ఉన్నారు. వారిలో ఆర్టిస్ట్ సుకన్య గార్గ్ కూడా ఒకరు. మనిషి శరీరమే ఆమె చిత్రకళకు కథా వస్తువు. చిన్న గాయమయితే చాలు అంత పెద్ద శరీరం నొప్పితో విలవిలలాడిపోతుంది. అసలు శరీరానికి బాధ ఎక్కడి నుండి వస్తుంది అంటూ తన కళ ద్వారా నొప్పిని, శరీర చిక్కులను అన్వేషిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

# బాధా చిత్ర అన్వేషణ














ముంబైకి చెందిన చిత్రకారిణి సుకన్య గార్గ్ శరీర నొప్పిని, వైద్యంలోని విభిన్న పద్ధతులను అర్థం చేసుకోవడానికి తన చిత్ర కళను ఉపయోగిస్తుంది. ఆమె తన కళలో మానవ శరీర చిక్కులను సైతం అన్వేషిస్తుంది. దీని కోసమే చిత్రాలను గీస్తున్నది. ఆమె రచనల దృశ్య సౌందర్యం మానవ కణం రూపం నుండి ప్రేరణ పొందింది. "మన శరీరంలో 37 ట్రిలియన్లకు పైగా జీవకణాలు ఉన్నాయని జీవ శాస్త్రం చెబుతుంది. ఈ కణాలలో ప్రతి ఒక్కటి దాదాపు ఒకేలా కనిపిస్తున్నప్పటికీ, వాటి పనితీరు వంశపారంపర్యంగా, మన వ్యక్తిగత అనుభవాలతో నిరంతరం మారుతుంటాయి. మన శరీరం ఇన్ని మార్పులకు గురవుతుంది కాబట్టే నా పెయింటింగ్‌లు మన అనుభవాలు, భావోద్వేగాలతో విభజింపబడే శరీరం, ఈ అనంతమైన సెల్యులార్ రూపాల నుండి ప్రేరణ పొందాయి" అంటుంది సుకన్య



### ప్రశ్నలు ఎదుర్కొంటున్నా...

ఒక కళాకారిణిగా సుకన్యకు ఆసక్తి కలిగించే విషయం ఏమిటంటే గాయాలు అయినపుడు కొన్నిసార్లు మన శరీరంపై మచ్చలు ఏర్పడతాయి, కానీ కొన్నిసార్లు అసలు గాయం అయినట్టే తెలియదు. యుఎస్‌ఏలోని డ్యూక్ యూనివర్శిటీ నుండి పబ్లిక్ పాలసీ గ్రాడ్యుయేట్ చేసిన సుకన్య "మన జీవశాస్త్రం భౌతిక విషయాలను మాత్రమే కాకుండా వాటిపై అవగాహనలను కూడా పెంచుతుంది. అయితే వైద్య ప్రమాణాల ఆధారంగా అనారోగ్యాలను నిర్ధారించడానికి చేస్తున్న నా పని కొంత వివక్షతను, కొన్ని ప్రశ్నలను ఎదుర్కుంటోంది. రోగనిర్ధారణకు ఇటువంటి పాత పద్ధతులను నేటి పరిస్థితుల్లో చాలామంది అంగీకరించరనేది వాస్తం. ఎందుకంటే ఇలాంటి వైద్యం కంటికి కనిపించదు. అందుకే నేను అవగాహన కల్పించాలని ప్రయత్నిస్తున్నాను" అని ఆమె అంటున్నారు.

### తొందరపడొద్దు

ప్రముఖ చిత్రకారిణి శోభా బ్రూటా వద్ద సుకన్య శిక్షణ పొందింది. ఢిల్లీలోని ధూమిమల్ గ్యాలరీ నుండి విజువల్ ఆర్ట్ రంగంలో రవి జైన్ మెమోరియల్ వార్షిక ఫెలోషిప్ అవార్డు 2021ని అందుకుంది. అంతే కాదు అనేక ఇతర అవార్డులకు నామినేట్ చేయబడింది. ఆమె పెయింటింగ్స్ న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, ఖాట్మండు, బెర్లిన్, విల్నియస్‌లోని గ్యాలరీలలో ప్రదర్శించబడ్డాయి. జపాన్‌కు చెందిన మోటోయ్ యమమోటో అనే కళాకారుని ప్రభావం సుకన్యపై తీవ్రంగా ఉంది. దీనికి తోడు ఆమె శిక్షకురాలు శోభ సలహాలు కూడా ఆమెకు అండగా నిలిచాయి. "ఏ విషయంలోనూ తొందరపడొద్దు. సమయం ఇవ్వాలి, ఎక్కడా రాజీపడవద్దు. నీ సొంత వ్యక్తిగత కళకు ప్రామాణికంగా ఉండటం నీ ఎదుగుదలకు అవసరం అని నా గురువైన శోభా ఎప్పుడూ చెబుతుంటారు" అని ఆమె పంచుకున్నారు. అందుకే కొత్తగా చిత్రకళను ప్రారంభించిన కళాకారులందరికీ సుకన్య ఇచ్చే సూచన ఏమిటంటే 'ఎదుగుదల విషయంలో తొందరపడవద్దు. ఓర్పుగా ఉండటమే మన ప్రయాణంలో ఒక ముందడుగు' అంటుంది.

### చిత్రం తృప్తినివ్వనపుడు...

సుకన్య తన జీవితంలో రోజువారీ జరిగే చర్యల ద్వారా ప్రేరణ పొందింది. ఆమె తరచుగా ప్రకృతి, ప్రత్యేకించి దాని రేఖాగణిత నమూనాలు, భౌగోళిక భూభాగాలలతో ప్రేరణను పొందుతుంది. ఆమె వైద్య, సాహిత్యం, శాస్త్రీయ విషయాల పట్ల కూడా ఆకర్షితురాలైంది. అవి మానవ అనుభవాలు, కథలను రూపొందించడానికి సహాయపడతాయని ఆమె నమ్ముతుంది. తాను గీసిన చిత్రం తనకు తృప్తినివ్వనపుడు ఆమె కవిత్వానికి తిరిగి వస్తుంది. తనలోని సృజనాత్మకతకు మరింత మెరుగులు దిద్దేందుకు, తన మార్గం సుగమం చేసుకునేందుకు ఓదార్పు కోసం కవిత్వం వైపు చూస్తుంది.



# ఒకరికి ఒకరుగా...

దంపతుల్లో చిన్న చిన్న మనస్పర్థలు సర్వసాధారణం. భాగస్వాములిద్దరూ ఒకరికి ఒకరుగా ఉంటేనే ఎంతటి సమస్య అయినా, కష్టాన్నైనా పారద్రోలి... బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఉద్యోగం చేసుకునే దంపతుల్లో ఒకరిపట్ల ఒకరికి ఎక్కువ సానుకూలత ఉండటం చాలా అవసరం. ముఖ్యంగా ఇంటి పనుల్లో షేరింగ్ చాలా ముఖ్యం. దీనితో పాటు ఒకరి కోసం ఒకరు సమయం కేటాయించుకోవాలి. అలా కాకుండా ఒకరినొకరు నిందించుకుంటే సమస్య మరింత జటిలమవుతుంది. సమస్య పరిష్కార దిశగా ఆలోచించేందుకు ఎలాంటి మార్గాలున్నాయో తెలుసుకుందాం...

**కూర్చుని మాట్లాడుకోవాలి :** సమస్య ఏదైనా సరే ఇద్దరూ కలిసి కూర్చుని మాట్లాడుకోవాలి. ఇద్దరి మధ్యా వచ్చినదైనా, బయటి నుండి వచ్చినదైనా సరే కలిసి కూర్చుని చర్చించుకుంటేనే పరిష్కారం లభిస్తుంది. అలా కాకుండా ఒకరినొకరు నిందించుకోవడం ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉండదు.

**కలిసి పనులు :** ఉరుకుల పరుగుల జీవితంలో మీకంటూ ప్రత్యేకంగా సమయం దొరక్కపోవచ్చు. ఆఫీస్ హడావుడిలో పడి చిన్న చిన్న సంతోషాలకు దూరమై వుండొచ్చు. ఆ లోటును భర్తీ చేసుకోవడానికి కచ్చితంగా కొంత సమయం కేటాయించుకోవాలి. ఇంటి పనుల్లో ఇద్దరూ భాగస్వాములు కావాలి. అన్ని పనుల్లో ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, ఆడుతుపాడుతూ పని చేస్తుంటే అలుపూ సొలుపే కాదు విసుగు కూడా వుండదు. ఇది ఇద్దరి మధ్య ప్రేమా ఆప్యాయతలను మరింతగా పెంచుతుంది.

**పుస్తకాలు :** ఎంత లేదనుకున్నా, ఎంతో కొంత ఒత్తిడి కచ్చితంగా వుంటుంది. నచ్చిన పుస్తకాలు చదువుతుంటే కొంత స్వాంతన ఉంటుంది. చదివిన పుస్తకాల మీద ఒకరి భావాలు ఒకరు పంచుకోండి. అప్పుడు ఈ ఒత్తిడి నుండి దూరం కావొచ్చు.

**విసుగు లేకుండ :** ఒత్తిడి కారణంగా ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక సందర్భంలో కచ్చితంగా విసుగు పుడుతుంది. అలాంటి సమయంలో విసుగును పోగొట్టుకునే ఆలోచనలు చేయాలి. ఇద్దరూ కలిసి ఇష్టమైన సినిమాలు చూడటం, రుచికరమైన వంటకాలు కలిసి తయారు చేసుకోవడం చేస్తుండాలి. అభిరుచుల్ని బట్టి ఇండోర్ గేమ్స్ వంటివి కూడా ఆడినా విసుగు లేకుండా ఉంటుంది.



**మానసిక ధైర్యం :** సమస్య ఎదురైనపుడు మొదట నిందించుకోకూడదు. ఈ సమయంలో మానసిక ధైర్యం చాలా ముఖ్యం. సమస్య ఎవరికి వచ్చినా ఇద్దరిదిలా ఉండాలి. భాగస్వామిని నిందిస్తూ మాట్లాడితే సమస్య మరింత జటిలమవుతుందే తప్ప పరిష్కారం దొరకదు. మీరు తోడు ఉన్నారనే మానసిక ధైర్యం భాగస్వామికి చాలా ఓదార్పునిస్తుంది. సమస్యను ఎదుర్కొనే మానసిక ధైర్యాన్ని అందిస్తుంది.

**అభిరుచులకు అనుగుణంగా :** అందరిలో ఏదో ఒక సృజన తప్పక ఉంటుంది. భాగస్వామిలో ఉన్న అభిరుచిని గుర్తించి, దాని మీద ఆసక్తి పెంచుకునేలా ప్రోత్సహించాలి. పాడటం, నృత్యం, సంగీతం, పెయింటింగ్ వంటివి ఆసక్తి ఉంటే... బయటకు వెళ్ళి ప్రత్యేకంగా క్లాసుల్లో చేరి నేర్చుకోవాల్సిన అవసరం లేదు. టెక్నాలజీ అందుబాటులో వుంది, యూట్యూబ్ సహాయంతో మీకు నచ్చినవి నేర్చుకోవచ్చు.

**మధురక్షణాలు :** పాత ఫొటోలు, పెండ్లి నాటి వీడియోలను మళ్లీ చూడండి. ఇలా చేస్తే మీ సమయాన్ని మీరు ఆస్వాదించడంతో పాటు ఆ క్షణాలను మరింతగా ఆనందించవచ్చు. ఇద్దరూ కలిసి గడిపిన మధురక్షణాలను గుర్తు చేసుకుంటే, ఇది మనసును మరింత ఉల్లాసంగా ఉత్సాహంగా మారుస్తుంది.

**ప్రేమ వ్యక్తం :** భాగస్వామిపై మీకెంత ప్రేమ ఉందో వ్యక్తం చేయండి. అందుకోసం అవతలి వారికి ఇష్టమైన వస్తువులను సర్‌ప్రైజింగ్‌గా ఇవ్వడం, నచ్చినవి తెలుసుకుని తీసుకురావడం వంటి సర్‌ప్రైజింగ్‌లు ఉంటే, జీవితం ఉత్సాహంగా ఉంటుంది. ఒకరిపై ఒకరికి సానుకూలత పెరిగి ప్రేమ మరింత బలోపేతం అవుతుంది.

ఈ విధంగా బంధాన్ని బలోపేతం చేసుకుంటూ, క్లిష్ట సమయంలోనూ తోడుగా ఉంటే... ఎంతటి స్పర్థలైనా ఇట్టే తొలిగిపోతాయి.

## నేడు అల్పపీడనం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు ఎక్కువ ప్రదేశాల్లో, అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. సోమవారం దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ దగ్గర్లో వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. 25, 26 తేదీల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడొచ్చని సూచించారు. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు గంటలకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదు రోజులకు వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీ చేసింది. 25న మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, హన్మకొండ, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో, 27న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచనలుండటంతో ఆ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో అత్యధికంగా 5.35 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 60 ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది.

## మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. వారి అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. విద్య, ఉపాధి సహా పలు రంగాల్లో ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తూ మైనార్టీల్లోని పేదరికాన్ని, వెనుకబాటును తొలగించేందుకు కృషి చేస్తున్నాయని వెల్లడించారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమర్థవంతమైన కార్యాచరణ సత్ఫలితాలను అందిస్తున్నదని వివరించారు. భిన్న సంస్కృతులను, మత, ఆచార సాంప్రదాయాలను సమానంగా ఆదరిస్తూ రాష్ట్రంలో గంగా జమునా తహజీబ్‌ను కాపాడే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

## ప్రాధాన్యతను మరిచిన ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

మోడీపై హోకిప్ నేరుగా విమర్శలు చేశారు. అమెరికా పర్యటనకు ముందు ప్రధానిని కలుసుకునేందుకు తాను చేసిన ప్రయత్నం ఫలించలేదని హోకిప్ తెలిపారు. ప్రజలు మారణహోమానికి బలవుతుంటే సమస్యను పరిష్కరించడంలో మానవత్వం చూపలేదని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధిగా ప్రధాని అపాయింట్‌మెంట్ కోరానని, అయితే ఆయన నుంచి స్పందన రాలేదని చెప్పారు. ఇప్పటికి కూడా పరిస్థితి తీవ్రతను ప్రధానికి వివరించే అవకాశం కోసం ఎదురు చూస్తూనే ఉన్నామని అన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న పది మంది కుకీ ఎమ్మెల్యేలలో హోకిప్ ఒకరు. కుకీలకు ప్రత్యేక పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చిన్, కుకీ, మిజో, జోమీ గిరిజన తెగలను కాపాడడంలో తమ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రంలోని మైనారిటీ తెగలపై మెజారిటీ మైతీలు నిరాటంకంగా సాగిస్తున్న హింసకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని ఆరోపించారు. కుకీ మహిళలపై లైంగిక దాడి జరిగిన విషయం తనకు తెలియదని ముఖ్యమంత్రి బీరేన్ చేసిన ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ ఇది వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకేనని అన్నారు. రాష్ట్రంలో హింసకు మైతీలు, పోలీసు కమాండోలే కారణమని నిందించారు.

## ఓపీఎస్ కోసం సమైక్య ఉద్యమం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ(ఓపీఎస్) కోసం జాతీయ స్థాయిలో సమైక్య ఉద్యమం చేయాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నొక్కి చెప్పారు. ఓపీఎస్ కోసం తెలంగాణలో విశాల ఐక్యవేదిక ఏర్పడటం మంచి పరిణామమన్నారు. ఆ వేదికలో చేరని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలన్నీ కలిసి రావాలని కోరారు. ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కొట్లాడితే కచ్చితంగా దిగొస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైల్వేలు, బ్యాంకింగ్, బీమా, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, లెక్చరర్ల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్(జేఎఫ్ఆర్ఓపీఎస్) ఏర్పడింది. ఇందుకోసం నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి అజీజ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ..నూతన పెన్షన్ విధానాన్ని (ఎన్పీఎస్) కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా అమల్లోకి తీసుకొచ్చిందని విమర్శించారు. అందులోకి కోటి 75 లక్షల మంది సభ్యులుగా బలవంతంగా నెట్టబడ్డారన్నారు. 1991 తర్వాత వచ్చిన ఆర్థిక సంస్కరణల ప్రభావం పెన్షన్ స్కీమ్‌పై కొట్టొచ్చినట్టు ఉందన్నారు. అంతకుముందు పరోక్షంగా దాడి జరిగిందనీ, 2004 తర్వాత అది ప్రత్యక్షరూపం దాల్చిందని వివరించారు. భవిష్యత్‌లో ప్రమాదం ముంచుకు రాబోతున్నదని అప్పట్లోనే తాము హెచ్చరించామన్నారు. ఎన్పీఎస్ ప్రాణం పీఎఫ్ఆర్డీఏలో ఉందనీ, దాని రద్దు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఓపీఎస్ కోసం ఉద్యమాలు విడివిడిగా జరుగుతున్నాయనీ, వాటన్నింటినీ ఐక్యంగా ముందుకు తీసుకోవాల్సిన బాధ్యత ఈ వేదిక తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నీ విశాల ఐక్య వేదికలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని పాలకులు ఓపీఎస్ పునరుద్ధరించడం సాధ్యం కాదనీ, దానివల్ల ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున భారం పడి ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతుందని చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని నర్సిరెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ.. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, ఢిల్లీ, తదితర రాష్ట్రాల్లో ఓపీఎస్ అమలవుతున్నదన్నారు. మిగతా రాష్ట్రాల్లోనూ అమలు కోసం పోరాటం తీవ్రం చేయాలన్నారు. పాత పెన్షన్ విధానం కార్మిక, ఉద్యోగ వర్గాలకే కాక దేశానికి కూడా చాలా ఉపయోగకరమన్నారు. ఈ అంశం రాబోయే ఎన్నికలలో ప్రధాన ఎజెండాగా మారాలనీ, ప్రజల మద్దతు కూడగట్టాలని పిలుపునిచ్చారు. అన్ని సంఘాలు సంయుక్తంగా పోరాడితేనే అది సాధ్యమవుతుందని నొక్కిచెప్పారు. 14 కోట్ల మందికి సామాజిక భద్రత కల్పించే సరైన వ్యవస్థ లేదనీ, జాతీయ సామాజిక భద్రత పేర వృద్ధులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఉద్దేశించిన పథకం ద్వారా ఇచ్చే సహకారం చాలా మందికి కేవలం రూ.1000లోపే అందుతుండటం దారుణమన్నారు. కూరగాయలు, దినసరి సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇది అత్యంత కనిష్టమన్నారు. ఒక్కరోజులో 27 మీడియా ఛానళ్లను కొనుగోలు చేయగలిగే శక్తి కలిగి, 27 అంతస్తుల భారీ భవంతిలో సుఖాలు అనుభవిస్తున్న అంబానీ లాంటి శతకోటీశ్వరుల సంపదలో కేవలం ఒక్క శాతం పన్నులు ప్రభుత్వానికి సమర్పించినట్లయితే.. దేశంలోని ఉద్యోగ కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం సునాయాసంగా అందించవచ్చని తెలిపారు. అయినా నేటి కేంద్ర పాలకులు ఇలాంటి చర్యలకు పూనుకోరని శ్రీకాంత్ మిశ్రా ఎద్దేవా చేశారు.శంకర్‌రావు మాట్లాడుతూ..ఎన్పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించే పార్టీలకే తమ ఓట్లు అని స్పష్టం చేశారు. ఉద్యోగి రిటైర్డయ్యే సమయంలో పొందే వేతనంలో 50 శాతాన్ని పెన్షన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్‌దారుడు చనిపోతే పూర్తిస్థాయిలో భార్య, ఇతర కుటుంబ సభ్యులకు అందేలా చూడాలన్నారు. ఎన్పీఎస్‌పై కేంద్రం వేసిన కమిటీపై భ్రమలు అవసరం లేదన్నారు. కమిటీలపై ఆశలు పెట్టుకోకుండా ఓపీఎస్ కోసం ఉద్యమం చేయడమే సరైందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌భాస్కర్, టీపీటీఎఫ్ అధ్యక్షుడు వై అశోక్ కుమార్, డీటీఎఫ్ అధ్యక్షుడు ఎం సోమయ్య, డీఆర్‌డీఓ హైదరాబాద్ ల్యాబ్స్ సీఓసీ(ఏఐడీఈఎఫ్ అనుబంధం) చైర్మెన్ శ్రీకాంత్ గౌడ్, టీఆర్‌టీఎఫ్ అధ్యక్షుడు కె అశోక్ కుమార్, జి తిరుపతి (ఎల్‌ఐసి), శ్రావణ్ కుమార్ (పోస్టల్), సతీష్ బాబు (రూరల్ బ్యాంక్స్), ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవికాంత్, బి కొండయ్య, షౌకత్ అలీ, కొప్పిశెట్టి సురేష్, యు.పోచయ్య, ఎస్ యాదగిరి, వై విజయకుమార్, టి లింగారెడ్డి, కె జంగయ్య, పి నాగిరెడ్డి, కె రమేష్, పి.యాదగిరి, కరుణాకర్‌గౌడ్, రజినీకాంత్, హరీశ్, మంగ, తదితరులు పాల్గొన్నారు.

## కారుపై థర్టీ పర్సెంట్ సర్కారు అస్త్రం

(మొదటిపేజీ తరువాయి)

విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యాచరణ రూపొందిస్తున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. కర్నాటకలో బీజేపీ సర్కారుపై హస్తం పార్టీ ఇదే రకమైన ప్రచారాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా పేటీఎం తరహాలో 'పే సీఎం' అంటూ, '40 పర్సెంట్ కమీషన్ల' సర్కారు అంటూ గోడపత్రికలు వేసి మరీ ప్రచారం చేసింది.ఈ ప్రచారానికి ఆ పార్టీ అక్కడ దాదాపు 27శాతం ఓటర్లను ప్రభావితం చేసిందని అప్పట్లో వార్తలొచ్చాయి. అదే తరహాలో రాష్ట్రంలోనూ కారు వేగానికి బ్రేకులు వేసేందుకు 'థర్టీ పర్సెంట్ కమీషన్ సర్కారు' అంటూ విమర్శల బాణం ఎక్కు పెట్టింది. ఆ దిశగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా చుక్కనీరు అందడం లేదనీ, కానీ లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టిందని ఇప్పటికే కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. వేల కోట్ల కమీషన్లు బీఆర్ఎస్ పెద్దలకు అందాయని ఆరోపణలు చేస్తున్నది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ కాంట్రాక్టులు, ధరణి పోర్టల్, పరిశ్రమలకు భూముల కేటాయింపు,గొర్లకుర్మలకు గొర్ల పంపిణీ, దళితబంధు, బీసీలకు లక్ష సాయం, భూముల అమ్మకాల్లో అవినీతితోపాటు కరెంట్ కొనుగోళ్లల్లో రూ.18వేల కోట్లు చేతులు మారాయని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తున్నది. వీటన్నింటిల్లో 30శాతంకమీషన్లు తీసుకోకుండా ఏ బిల్లును మంజూరు చేయడం లేదనేది బీఆర్ఎస్‌పై హస్తం పార్టీ ఆరోపణ.వీటికి సంబంధించిన స్వల్పకాల నిడివి ఉన్న సందేశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని భావిస్తున్నది. ఆయా జిల్లాల్లో నిర్మాణమవుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి, అక్కడే మీడియాకు చెప్పాలని అధిష్టానం కార్యకర్తలను ఆదేశించింది. సర్కారు అవినీతిపై బహిరంగంగా పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేయడం ఒక పద్ధతి కాగా,సెల్‌ఫోన్లు,ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్‌మీడియాతో క్యాంపెయిన్ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో సెల్‌ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తికి ఆ సందేశాన్ని చేరవేసేలా ప్లాన్ చేస్తున్నది. బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల్లో 'కారు, సారు, సర్కారు' అనే ట్యాగ్‌లైన్‌తో విస్తృతంగా ప్రచారం నిర్వహించిన సంగతి తెలిసింది. ఈసారి వినూతన్నమైన ప్రచార శైలితో బీఆర్ఎస్ ఎత్తులకు చెక్ పెట్టాలని హస్తం పార్టీ వ్యూహాలకు పదును పెడుతున్నది.

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధ్ ప్రమాణం



(మొదటిపేజీ తరువాయి)

పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్రపతి జారీ చేసిన నియామక వారెంట్‌ను హైకోర్టు రిజిస్ట్రార్ చదివి వినిపించారు. వారెంట్ కాపీని జస్టిస్ అలోక్‌కి గవర్నర్ అందజేశారు. చీఫ్ సెక్రటరీ శాంతికుమారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటి వరకు సీజేగా చేసిన జస్టిస్ భూయాన్‌కు పదోన్నతి లభించడంతో ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త సీజేగా మధ్యప్రదేశ్ కు చెందిన జస్టిస్ అలోక్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కేంద్రానికి రికమండ్ చేసింది. దీన్ని కేంద్రం ఆమోదించడంతో ఈ నెల 19న రాష్ట్రపతి నియామక వారెంట్‌పై రాజముద్ర వేశారు.భుయాన్ సుప్రీంకోర్టుకు వెళ్లిన నాటి నుంచి యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా అభినంద్ కుమార్ షావిలి పని చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ అలోక్ అరాధ్ 2009 డిసెంబర్‌లో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అక్కడి నుంచి జమ్మూకాశ్మీర్ హైకోర్టు బదిలీ అయ్యారు. ఆ తర్వాత 2018 నుంచి కర్నాటక హైకోర్టు న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. ప్రమోషన్‌పై ఇప్పుడు రాష్ట్ర హైకోర్టుకు వచ్చారు. జస్టిస్ అలోక్ 1964 ఏప్రిల్ 14న రాయ్‌పూర్‌లో జన్మించారు. బీఎస్సీ, ఎల్ఎల్బీ చేశాక 1988లో లాయర్‌గా ఎన్‌రోల్ అయ్యారు. 2007లో ఆయనకు సీనియర్ అడ్వొకేట్ హోదా లభించింది. కార్యక్రమానికి జడ్జీలు, లా ఆఫీసర్లు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

## అర్హతల ప్రకారం శాఖల్లో వీఆర్ఏల సర్దుబాటు..

(మొదటిపేజీ తరువాయి)

మేరకు, నిబంధనలను అనుసరించి వీఆర్ఏల అర్హతలనుబట్టి మున్సిపాలిటీ, మిషన్ భగీరథ, ఇరిగేషన్ తదితర శాఖల్లో సర్దుబాటు చేస్తూ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేస్తున్నామని సీఎం తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో వీఆర్ఏల క్రమబద్ధీకరణ, సర్దుబాటు, స్థిరీకరణ తదితర అంశాలపై ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక పరిణామ క్రమంలో మార్పులకనుగుణంగా, ప్రజల అవసరాలను అనుసరించి పాలకులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. కనుమరుగవుతున్న వృత్తుల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యామ్నాయంగా ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. ఇదే రాష్ట్ర ప్రభుత్వ విధానమనీ, దాన్ని అనుసరించే వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేస్తున్నామని వివరించారు.

వ్యవసాయం అభివద్ధి చెంది సాగునీటి విధానం అమల్లోకి వచ్చిన నాటి కాలంలో ప్రతి గ్రామంలో నీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించడంతో పాటు గ్రామ రెవెన్యూ తదితర అవసరాలకోసం ఏర్పాటైన గ్రామ సహాయకుల వ్యవస్థ నేటి వీఆర్ఏలుగా రూపాంతరం చెందిందని కేసీఆర్ తెలిపారు. నేటి మారిన పరిస్థితుల్లో వీఆర్ఏల వృత్తికి ప్రాధాన్యత తగ్గిన నేపథ్యంలో, వారికి రెవెన్యూ శాఖలో సూపర్ న్యూమరరీ పోస్టులను కల్పించి, పర్మినెంట్ చేసి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకుంటామని స్పష్టం చేశారు.

తరతరాలుగా సమాజానికి సేవ చేస్తున్న గ్రామ సహాయకులకు (వీఆర్ఏలు) రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సహాయం వారి వ్యక్తిగతంగా మాత్రమే కాదనీ, ఇది సమాజానికి చేస్తున్న సేవగా భావిస్తున్నామని తెలిపారు. అట్టడుగు స్థాయి నుంచి త్యాగాలతో, శ్రమతో సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే వారి విషయంలో తమ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. ఎవరూ అడగకుండానే ఉద్యోగ వర్గాలకు జీతాలు పెంచి వారి సంక్షేమానికి పాటుపడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సఫాయన్నా..నీకు సలామన్నా.. అంటూ డిగ్నిటీ ఆఫ్ లేబర్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం తమదేనని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో మస్కూరు తదితర పేర్లతో తమను తరతరాలుగా వెంటాడుతున్న సామాజిక వివక్షతో కూడిన విధుల నుంచి తమకు విముక్తి కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేసి, తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన సీఎంకు రుణపడి ఉంటామని వీఆర్ఏ జేఏసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో...ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాతా మధు, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, ఎ.జీవన్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, రోహిత్ రెడ్డి,మదన్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ముఖ్యమంత్రి సలహాదారు సోమేష్ కుమార్, సీఎస్ శాంతి కుమారితోపాటు పలు శాఖల ముఖ్య కార్యదర్శులు, వీఆర్ఏ జేఏసీ చైర్మెన్ రాజయ్య, కో చైర్మన్ రమేశ్ బహదూర్, సెక్రటరీ జనరల్ దాదే మీయా, కో కన్వీనర్లు షేక్ రఫీ, వంగూరు రాములు, మాధవ నాయుడు, వెంకటేశ్ యాదవ్, గోవింద్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

**వీఆర్ఏల క్రమబద్ధీకరణ సర్దుబాటు విధానం..**

-ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'రాష్ట్రవ్యాప్తంగా 20,555 మంది వీఆర్ఏలు పనిచేస్తున్నారు. వీరిలో నిరక్షరాస్యులు, ఏడో తరగతి, పదో తరగతి, ఇంటర్మీడియేట్ పాసైనవారు, డిగ్రీ ఆపై ఉన్నత చదువులు చదివినవారున్నారు. వారి విద్యార్హతను బట్టి ప్రభుత్వం ఉద్యోగ కేటగిరీలను నిర్ధారిస్తుంది. నిబంధనలకు అనుగుణంగా ఆయా శాఖల్లో వారిని భర్తీ చేస్తాం...' అని సీఎం తెలిపారు.

-అందుకనుగుణంగా చర్యలు చేపట్టి, విధివిధానాలు ఖరారు చేసి, సోమవారం ఉత్తర్వులు జారీ చేయాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌ను సీఎం కేసీఆర్ ఆదేశించారు.

-61 ఏండ్లు పైబడిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు సీఎం నిర్ణయించారు. అదేవిధంగా... 2 జూన్ 2014 అనంతరం 61 ఏండ్ల లోపు ఉండి ఏ కారణం చేతనైనా వీఆర్ఏ విధులు నిర్వహిస్తూ మరణించిన వీఆర్ఏ వారసులకు కూడా ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని అన్నారు. చనిపోయిన వీఆర్ఏల వారసుల వివరాలు, వారి విద్యార్హతలు త్వరలో సేకరించాలని అధికారులను, వీఆర్ఏ జేఏసీ నేతలను కోరారు. వీరికి కూడా నిబంధనలకు అనుసరించి అర్హతల మేరకు, ఆయా శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో సర్దుబాటు చేయాలన్నారు.



మహేశ్వరం జోన్ అదనపు డీసీపీగా బి.వి.సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహన్ ఐపీఎస్ నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తర్వాత శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ- బడంగ్ పేట్

# ఏసీపీ జానకి రెడ్డిని కలిసిన ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ- చైతన్యపురి

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎల్బీనగర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన జానకి రెడ్డిని ఆదివారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ఏసీపీకి ఉపేందర్ రెడ్డి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల కృష్ణ, తలాటి రమేష్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, శివ, కాళిదాస్, విప్లవ్, మాచర్ల వరుణ్, నాగేష్, ఖలీద్, శేఖర్ బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

# గుర్రంగూడలో జీపీఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభం



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడలో నూతనంగా నిర్మించిన జీపీఆర్ (గుర్రం పెంటా రెడ్డి) కన్వెన్షన్ హాల్‌ను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆదివారం స్థానిక కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివాహాది శుభకార్యా లకు...స్థానిక ప్రజలకు అందుబాటు లో ఉండే విధంగా గుర్రం కుటుంబ సభ్యులు కన్వేషన్ హాల్‌ను నిర్మిం చడం హర్షనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ గుర్రం నరసింహా రెడ్డి, మాజీ కౌన్సిలర్ గుర్రం సాయికిరణ్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఈ.ఎల్.వి.అశోక్, కార్పొరేటర్లు పెద్దబావి ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, బీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, గుర్రం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలి

- సీపీఐ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జులై 25న సంఘీభావ కార్యక్రమాలు

నవతెలంగాణ - ధూల్ పేట్

మణిపూర్‌లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని సీపీఐ(ఎం) సౌత్ కమిటీ కార్యదర్శి ఎండీ.అబ్బాస్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయన్నారు. కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను ఇద్దరిని నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం చేసి, హత్య చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 25న మణిపూర్ ఆదివాసీలకు సంఘీభావ కార్యక్రమాలను రాష్ట్ర వ్యాపితంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని చెప్పారు. కమిటీ నిర్ణయం మేరకు పార్టీ హైదరాబాద్ సౌత్ కమిటీల ఆధ్వర్యంలో ఐఎస్ సదన్, సంతోష్ నగర్ ఎక్స్ రోడ్స్ వద్ద జులై 25న ఉదయం 11గంటలకు మణిపూర్ అల్లర్లను అదుపు చేసి శాంతి నెలకొల్పాలని కోరుతూ సంఘీభావ కార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీల సభ్యులు, ప్రజాసంఘాలు, వామపక్ష శ్రేయోభిలాషులు, ప్రజా స్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**మణిపూర్‌లో రాజకీయ లబ్ధికోసమే చిచ్చు..**

మణిపూర్ రాష్ట్ర జనాభాలో 54శాతానికి పైగా ఉన్న మైతీ కులస్తులకు కుకీ, నాగ గిరిజన తెగల మధ్య బీజేపీ తన రాజకీయ లబ్ధికోసం చిచ్చుపెట్టిందని ఆరోపించారు. గిరిజన చట్టాలను అతిక్రమించి మైత్రీలను గిరిజనులుగా మార్చడానికి ఒడిగట్టిందన్నారు. ఆదివాసీలను అడవుల నుండి దూరం చేసే కుట్రలు చేస్తుందని విమర్శించారు. దీన్ని ప్రతిఘటించిన కుకీ, నాగ తెగలపై మతోన్మాదశక్తులు.. బీజేపీ అండతో గత రెండున్నర నెలలుగా తీవ్రమైన దాడులకు తెగబడుతున్నాయని వివరించారు. ఇండ్లు, చర్చిలు, ప్రజల ఆస్తులు ధ్వంసం అవుతున్నాయని, అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఈ హింసాత్మక ఘటనలకు కేంద్ర, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు బాధ్యత వహించి.. దోషులను శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- నాగోల్ సీఐ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ- నాగోల్

తల్లీదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచినప్పుడే భవిష్యత్‌లో మంచి మార్గంలో ఎదుగుతారని నాగోల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బోనాలు, రాబోయే గణేష్ పండుగల ఉత్సవాలను పురస్కరించుకొని నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులతో ఆదివారం నాగోల్ పోలీస్ స్టేషన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల అధ్యక్షులు తమ తమ కాలనీలోని సమస్యలను సీఐ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న బోనాల పండుగ ఉత్సవాలతో పాటు రాబోయే గణేష్ పండుగ ఉత్సవాలను కూడా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కాలనీల్లో గంజాయి, జూదం ఇలా అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే..వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాగోల్ పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ స్నేహభావంతో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాసులు, మధులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్ ఘటనపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన




నవతెలంగాణ- సంతోష్ నగర్

మణిపూర్‌లో ఆదివాసి మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనను వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సంతోష్ నగర్ చౌరస్తా లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహకారదర్శి ఎం బాలునాయక్, ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. రఘులు మాట్లాడుతూ దేశంలో బీజేపీ పరిపాలి స్తున్న రాష్ట్రాలలో గిరిజన, ఆది వాసులు, మైనార్టీలపై అనేకదాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ మధ్యకాలంలో మణిపూర్‌లో జరుగు తున్న హింసా త్మక ఘటనలే సాక్ష్యం అని చెప్పా రు. మణిపూర్ రాష్ట్రంలో జాతుల మధ్య చిచ్చుపెట్టి విధ్వంసాన్ని సృష్టి ంచడానికి బీజేపీ ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రను ప్రజలు గమనించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు, నాయకులు, యువకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 'ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు పెంచాలి'




నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్‌లోని కేడీ స్టీల్ షాపులలో 12 ట్రాలీ ఆటోల కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు కనకయ్య మాట్లాడుతూ లోకల్లో 30 రూపాయలు, దూరం చౌటుప్పల్ వరకు 200 రూపాయలు పెంచడం జరిగిందని, గత రెండు నెలలుగా ఆటో కార్మికులు రేట్లు పెంచాలని అడుగుతున్నా యాజమాన్యం స్పందించకపోవడంతో సీఐటీయూ నాయకత్వం జోక్యం చేసుకుందన్నారు. దీంతో యాజమాన్యం దిగివచ్చి చర్చలు జరిపి.. రేట్లు పెంచుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇలాగే హైదరాబాదులో అనేక షాపుల్లో, కర్మాగాల్లో పనిచేస్తున్న ట్రాలీ ఆటో కార్మికులు, ఇతర కార్మికులను యాజమాన్యాలు మోసం చేస్తూ శ్రమను దోచుకుంటున్నారని మండి పడ్డారు. ఎక్కడ కార్మికులకు అన్యాయం జరిగినా సీఐటీయూ యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ, ఆటో కార్మికులు సత్తయ్య కృష్ణ నాయక్, హనుమంతు నాయక్, మల్లయ్య ,పాండు, కృష్ణ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు



నవతెలంగాణ - ఎల్బీనగర్

సరూర్ నగర్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్, పోచమ్మ బస్తీ, భగత్ సింగ్ నగర్, శంకర్ నగర్‌లలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాలలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

**వనస్థలిపురం :**



సాహెబ్ నగర్ బతుకమ్మ కుంటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ఆలయ చైర్మన్ ముద్దగౌని చంద్రకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పండుగకు ఎల్బీనగర్ డీసీపీ బత్తిని సాయిశ్రీ గౌడ్, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్‌లు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్ సింగ్, నాగరాజు గౌడ్, బాలరాజ్, నాగు, శ్రీనివాస్, కాశీనాథ్, మురళీ, హరి, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో..**



బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం, సాహెబ్ నగర్ పోచమ్మ, ఎల్లమ్మ ఆలయం, పద్మావతి బ్యాంక్ కాలనీ బంగారు మైసమ్మ ఆలయం, పద్మావతి కాలనీ ఉప్పలమ్మ ఆలయం, భవానీ ఎంక్లేవ్ రేణుక ఎల్లమ్మ ఆలయం, సాహెబ్ నగర్ విలేజ్ ఎల్లమ్మ దేవి ఆలయం, శ్రీనివాస కాలనీ రేణుక ఎల్లమ్మ ఆలయం, సాహెబ్ నగర్ ఎల్లమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం కన్నుల పండువగా బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డిలు హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రామిరెడ్డి, యంజాల భిక్షపతి, గంగం శివశంకర్, గంగం రాజు, పద్మావతి కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, సాయిరాం, కిరణ్, పాండు, భరత్, శ్రీనివాస కాలనీ అధ్యక్షులు చిత్రాంజన్, ఆలయ చైర్మన్ నరసింహ, పాపి రెడ్డి కాలనీ అధ్యక్షులు రవికుమార్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి శరత్ కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ముడుపు సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మహేందర్ రెడ్డి, నాయకులు కామేష్, ఫణి,పవన్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, కళా చైతన్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**సంతోష్ నగర్ :**



బోనాల ఉత్సవాలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ఆలయ చైర్మన్ చిలుకూరి రాంరెడ్డి అన్నారు. హైద రాబాద్ సైదాబాద్ డివిజన్ పరిధిలో శంకేశ్వర బాజార్ క్రాస్ రోడ్ సిద్ధి వినాయక సాగర్ శ్రీ భవానీ శంక రాలయం వద్ద అమ్మవారి బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, అశోక్ కుమార్, మురళీకృష్ణ, రఘు, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు

**సైదాబాద్‌లో..**



మలక్ పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె. దర్శన్, శంకర్, మధు, నరేష్, జగన్, యాదయ్య, గణేష్, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**సంతోష్‌నగర్ :**



బోనాలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని నల్ల పోచమ్మ ఆలయ చైర్మన్ రాజశేఖర్ అన్నారు. మలక్ పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్ కాలనీ చైర్మన్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల జాతరను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీకాంత్, చిన్న రాందాస్, వీరయ్య, నాని, సాయి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**హస్తినాపురం :**



తెలంగాణ బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా డివిజన్ పరిధిలోని భుపేష్ గుప్త నగర్ కాలనీలో ఉన్న నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకలకు హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మమత మల్లేష్ గౌడ్, రామచంద్రనాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హయత్‌నగర్ :**

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హయత్ నగర్ ప్రగతి నగర్ కాలనీలో ఆదివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, ఎల్బీనగర్ బీఆర్ఎస్ ఇంచార్జి ముద్దగౌని రాంమోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, జక్కిడి రఘు వీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




**ఎల్బీనగర్ :**



బోనాల పండుగను పురస్కరించుకొని ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాలను ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి ఆదివారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుర్రం శ్రీనివాస్ రెడ్డి, మంజులా రెడ్డి, సదా శివుడు, కిషోర్ గౌడ్, సురేందర్ రెడ్డి, వేణు యాదవ్, శ్రీపాల్ రెడ్డి, గజ్జి శ్రీనివాస్, గాంధీ నాయక్, రాజశేఖర్, శ్యామ్ చరణ్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సౌమ్య, భాను, లల్లు గౌడ్, సాయి, సూర్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**బడంగ్ పేట్ :**



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడ గ్రామంలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి, జెనిగే ఐలమ్మ, గడ్డం లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ - మీర్ పేట్

వికలాంగుల పెన్షన్లు రూ. 3016 నుండి రూ. 4016 పెంచినందుకు మీర్‌పేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో లలిత నవర్ చౌరస్తాలో ఆదివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 5 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని..అందుకు ప్రతి ఒక్కరూ మరోసారి ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు బొక్క రాజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దీప్ లాల్ చౌహన్, మేకల రవీందర్ రెడ్డి, సిద్దాల బీరప్ప, సిద్దాల అంజయ్య, సుదర్శన్ రెడ్డి, దయానంద్, గోపి యాదవ్, లక్ష్మణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష

- చైర్మన్ ఆయాచితం శ్రీధర్



నవతెలంగాణ - చైతన్యపురి

సీఎం కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ చౌరస్తాలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో వికలాంగుల పెన్షన్‌ను రూ.1000 పెంచినందుకు ఆదివారం సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ రూ.4016 ఇవ్వడం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ జనరల్ సెక్రటరీ మురుకుంట్ల అరవింద్ శర్మ, దుబ్బాక శేఖర్, రామాచారి, నేలకొండ శ్రీనివాసరెడ్డి, కంచర్ల శేఖర్, దేవేందర్, అల్లావుద్దీన్ పటేల్, ఫరీద్ పాషా, వాజిద్ పటేల్, శంకర్ నాయక్, శ్రీరాములు, మహేష్, మల్లేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సందయ్యకు నివాళి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజక వర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్ గుల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్టగల్ల జగన్ తండ్రి పుట్టగల్ల సందయ్య 5వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు నాయకులు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం పీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు, దేప భాస్కర్ రెడ్డి, చిగిరింత నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'బంజారా సంస్కృతిని ప్రతిబింబించేదే సీత్ల పండుగ'



నవతెలంగాణ- బడంగ్ పేట్

బంజారా సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే తీజ్ ఉత్సవాల్లో భాగంగా మొదటగా జరుపుకునేదే సీత్ల పండుగ అని బంజారా సెంట్రల్ కమిటీ అధ్యక్షులు మహిపాల్ నాయక్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డిలు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడలో ఆదివారం బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీత్ల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పండుగను గిరిజన సంస్కృతి సాంప్రదాయాల్లో భాగంగానే జరుపుకోవడం హర్ష నీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు లాలూ నాయక్, అల్మాస్ గూడ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దన్ సింగ్ నాయక్, కార్యదర్శి మోహన్ నాయక్, కోశాధికారి రామచందర్ నాయక్, బహుగుణ నాయక్, భారత్ నాయక్, బంజారా సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ బోనాల ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని ఆయన అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట శివారెడ్డి, దయాకర్‌రెడ్డి, సల్ల రాజీరెడ్డి, బిక్కుమల్ల అంజయ్య గుప్తా, కుమ్మరి నారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, వేముల సంతోష్ రెడ్డి, మస్క సుధాకర్,సత్యపాల్ రెడ్డి, పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో నేడు మంత్రి మల్లారెడ్డి పర్యటన



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సోమవారం పర్యటించనున్నట్టు మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండల పరిధిలోని నూతన్‌కల్, కోనాయిపల్లి, మైసిరెడ్డిపల్లి, లింగాపూర్, డబిల్‌పూర్ గ్రామాలల్లో మంత్రి మల్లారెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

# మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

- సీపీఐ(ఎం), సీపీఐ
- మేడ్చల్ జిల్లా కమిటీల డిమాండ్

నవతెలంగాణ-కాప్రా

మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని తక్షణమే అక్కడ శాంతిని నెలకొల్పాలని సీపీఐ, సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కమిటీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు సీపీఐ సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శులు సాయిల్ గౌడ్, పి సత్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను ఇద్దరిని నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడి చేసి హత్య చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నదని వాపోయారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఈనెల 25న ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రెండు పార్టీల సభ్యులు, ప్రజాసంఘాలు, వామపక్ష శ్రేయోభిలాషులు ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. 54 శాతానికి పైగా ఉన్న మైథీ కులస్తులకు, కుకీనాగ గిరిజన తెగల మధ్య ఘర్షణను బీజేపీ తన రాజకీయ లబ్ది కోసం చిచ్చు పెట్టిందని విమర్శించారు. గిరిజన చట్టాల్ని అతిక్రమించి మైథీలను గిరిజనులుగా మార్చటానికి ఒడిగట్టిందని తెలిపారు. ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేస్తున్నదని పేర్కొన్నారు. దీన్ని ప్రతిఘటించిన కుకీనాగ తెగలపై మతోన్మాద శక్తులు బీజేపీ అండతో రెండున్నర నెలలుగా తీవ్రమైన దాడులకు తెగబడుతున్నాయని వివరించారు. ఇండ్లు, ఇతర ఆస్తులను దహనం చేయడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలకు కేంద్రం ప్రభుత్వం, మణిపూర్ బీజేపీ ప్రభుత్వాలు బాధ్యత వహించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

# వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాలంలో, జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య వివిధ వ్యాధుల వ్యాప్తికి అనుకూలమైన పరిస్థితుల కారణంగా అంటువ్యాధులు, వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ తెలిపారు. వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు ప్రజలకు మార్గదర్శకాలు చేశారు.

### నీటి ద్వారా వచ్చే వ్యాధులు

1. జీర్ణకోశ ఇన్ఫెక్షన్లు : కలరా, టైఫాయిడ్, వైరల్ ఇన్ఫెక్షన్లు కలుషిత ఆహారం, నీటి ద్వారా వ్యాప్తి చెందుతాయి.
2. హెపటైటిస్ :కలుషితమైన నీరు, ఆహారం ద్వారా వ్యాపిస్తుంది.
3. అతిసారం :కలుషిత ఆహారం లేదా నీటినితాగడంతో వస్తుంది

### వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులు

1. మలేరియా :సోకిన దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది.
2. డెంగ్యూ జ్వరం : ఏడీస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది.
3. చికెన్‌గున్యా : ఏడీస్ దోమల ద్వారా కూడా వ్యాపిస్తుంది.
4. లెప్టోస్పిరోసిస్ : ముఖ్యంగా వరదల సమయంలో కలుషితమైన నీరు లేదా మట్టి నుంచి సంక్రమిస్తుంది.

### శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు

1. ఇన్ఫ్లుఎంజా(ఫ్లూ) :కాలానుగుణంగా మార్పులతో వస్తుంది.
2. సాధారణ జలుబు :వైరల్ ఇన్ఫెక్షన్లు రద్దీగా ఉండే ప్రదేశాల్లో సులభంగా వ్యాపిస్తాయి.



### ఫంగల్ ఇన్ఫెక్షన్లు

1. అథ్లెట్స్ ఫుట్ : తడిగా ఉన్న పరిస్థితుల్లో, ముఖ్యంగా కాలి వేళ్ల మధ్య వద్ధి చెందుతుంది.
2. రింగ్‌వార్మ్ : చర్మంపై వత్తాకార, దురద దద్దుర్లు కలిగించే ఫంగల్ ఇన్ఫెక్షన్.

### ప్రజలందరూ ఈ నివారణా చర్యలు పాటించాలి

1. వేడి లేదా శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలి.
2. ముఖ్యంగా వీధి వ్యాపారుల నుంచి పచ్చి లేదా తక్కువ ఉడికించిన ఆహారాన్ని తినడం మానుకోవాలి.
3. తినడానికి ముందు పండ్లు, కూరగాయలను శుభ్రమైన నీటితో బాగా కడగాలి.
4. వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్‌వాష్ పద్ధతులను పాటించాలి.
5. నిద్రపోయేటప్పుడు దోమల నిరోధకాలు, దోమతెరలను ఉపయోగించండి. దోమ కాటును తగ్గించడానికి పొడవాటి చేతుల దుస్తులు ధరించాలి. దోమల వద్ధిని నిరోధించడానికి మీ పరిసర ప్రాంతం చుట్టూ నిలిచిపోయిన నీటిని తొలగించాలి.
6. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు ఉన్న వ్యక్తులతో దూరంగా ఉండాలి. దగ్గినప్పుడు లేదా తుమ్మేటప్పుడు మీ నోరు, ముక్కును కప్పి ఉంచడం ద్వారా మంచి శ్వాసకోశ పరిశుభ్రతను నిర్వహించండి. సబ్బు, నీటితో తరచుగా చేతులు కడుక్కోండి లేదా హ్యాండ్ శానిటైజర్లను ఉపయోగించండి.
7. అంటువ్యాధులు, గాయాలను నివారించడానికి వర్షపునీరు నిల్వ ఉన్న ప్రాంతాల మధ్య నడవడం మానుకోవాలి.
8. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా రోగనిరోధక శక్తిని, మంచి గాలి ఉండేలా చూసుకోండి. తడిగా లేదా సరిగా గాలి లేని ప్రదేశాల్లో ఉండకుండా ఉండండి. వర్షాల సమయంలో గొడుగులు, రెయిన్ కోట్లు తీసుకెళ్లండి.

### అనారోగ్య లక్షణాలు కనిపిస్తే దవాఖానలకు వెళ్లాలి

ప్రజలకు ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ/పల్లె దవాఖానలను సందర్శించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం దష్ట్యా ఆదివారం, సెలవు దినాల్లో కూడా అన్ని ఆరోగ్య సౌకర్యాలు, పరీక్షలు, అవసరమైన మందులు సిద్ధంగా ఉండేలా ఆదేశాలు జారీ చేశామనీ, తగు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. స్థానిక ఆరోగ్య సలహాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవడం, వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అని ప్రజలకు సూచించారు.

# కాలనీ సంక్షేమ సంఘాలతో అభివృద్ధి సాధ్యం

- కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ
- రెడ్డీస్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బోడుప్పల్

కాలనీ సంక్షేమ సంఘాల ఐక్యతాతోనే కాలనీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బోడుప్పల్ 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ అన్నారు. ఆదివారం బోడుప్పల్ నగరపాలక సంస్థ 15వ డివిజన్ రెడ్డీస్ కాలనీ (ఈస్ట్) సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎలిమినేటి జంగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.హనుమాన్ రెడ్డి, అధ్యక్షుడిగా జోలే శశిప్రీతం, ఉపాధ్యక్షులుగా కె.శేఖర్ రెడ్డి, పి.విష్ణు మూర్తి, ఎన్.ప్రభాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి పానుగంటి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా జె.రాజేందర్‌రెడ్డి, ఐ.వెంకటాచారి, కోశాధికారిగా ఎన్.సన్నీయాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సీహెచ్ బాలమురళీ, పీ.రబింద్ర మిత్ర, ఆర్.నగేష్, ఏ. శేఖర్, సంస్కృతిక కార్యదర్శులుగా పీ.బాలకృష్ణారెడ్డి, పీ.భగవాన్‌రెడ్డి, జి.నరేష్, సీహెచ్ యాదగిరి లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శశిప్రీతం మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి కోసం అందరి సహకారంతో ముందుకు సాగుతానన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

# రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి : బీసీ విద్యార్థి నేత



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రేకుల బావి నుంచి బండమైలారం వెళ్లే దారిలో సోమారం గ్రామ చెరువు వరకు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు గోదా అరుణ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం గుంతలు, గుంతలుగా ఏర్పడిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. ఈ దారిలో నూతనంగా ప్రారంభమైన పవిత్రమైన బద్రీనాథ్ ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారని అన్నారు. ఆటోలో వెళ్లే విద్యార్థులు రోడ్డు సక్రమంగా లేక ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని కోరారు.

# సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు కొమ్మరాజుల వెంకటేష్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిపోర్టర్ శాగ కృష్ణను ఆయన పరామర్శించి ఆదివారం రూ. 5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజం కోసం నిరంతరం పనిచేస్తారని అన్నారు. అనంతరం శాగ కృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని మానోధైర్యం నింపారు.

# ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని అమలు చేయాలి



- మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్
- 60వ వారానికి చేరిన జ్ఞానమాల

నవతెలంగాణ-కాప్రా

ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని అమలు చేయాలని మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ ఆశయ సాధన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులను తెలుసుకోవాలని చేపట్టిన అంబేద్కర్ జ్ఞానమాల 60 వ వారానికి చేరింది. ఈ సందర్భంగా జమ్మిగడ్డలో అంబేద్కర్ చిత్రపటానికి మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి కోమటి రవి, ప్రసాద్ బాబు జ్ఞానమాల సమర్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని అమలు చేయాలనిన కోరారు. ప్రజలు రాజ్యాంగాన్ని చదివి తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా రైట్స్ ప్రొటెక్షన్ సభ్యులు సీహెచ్. నాగేశ్వరరావు, బీఎస్పీ నాయకులు ప్రసాద్‌బాబు, స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు కోమటి రవి, శ్రీమన్నారాయణ, బీజేఆర్ కాలనీ అధ్యక్షులు రహీం, మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, నరసింహ చారి, దయానంద్ రవినాయక్, నరేందర్ రావు, కొండల్, చిన్నారావు, నాగేష్, స్వామి ముదిరాజ్, చంద్రయ్య సురేష్ నాయక్, తదితలున్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని మాజీ సర్పంచ్ రాములుగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని చౌదరిగుడా గ్రామపంచాయతీ పరిధిలోని విజయపురి కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 470 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రాములుగౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం మండలంలో, మున్సిపాల్టీ పరిధిలోనూ నీలిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం ఎంతో గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో నీలిమ ఆస్పత్రి సీఈవో నీలిమ, విజయపురి కాలనీ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 'అమ్మవారి దీవెన ప్రజలపై ఉండాలి'



నవతెలంగాణ-ఉప్పల్

అమ్మవారి దీవెనలు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని కార్పొరేటర్ గీతాప్రవీణ్ కోరారు. బోనాల పండుగని పురస్కరించుకొని ఉప్పల్ నల్లపోచమ్మ, చిలుకానగర్ డివిజన్‌లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ నల్ల పోచమ్మ ఆలయంలో మంత్రి మల్లారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి ప్రత్యేక పూజ చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుళ్ల కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకుండా జగన్, బాణాల నారాయణరెడ్డి, రామానుజన్, మహమూద్, ఎండీ షఫీ, హనీఫ్, రవీందర్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, ఫోటో బాలు, సుందర్, శ్యామ్, బాలు, పలు కాలనీలో ఆలయ కమిటీ సభ్యులు సత్తయ్య, సాయిలు, ఐలయ్య కొండయ్య, రాములు, రాంరెడ్డి, గోపి చిన్న, రాజమౌళి, కమలాకర్, కరుణాకర్, బిట్టు,ఆకాష్ రెడ్డి ఉన్నారు.

# మెస్ ఛార్జీలు పెంపు అభినందనీయం

- కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కమిటీ హర్షం

నవతెలంగాణ-కాప్రా

రాష్ట్రంలో అన్ని రకాల సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థుల మెస్ ఛార్జీలను పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడం అభినందనీయమని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. కృపాసాగర్, ఎన్. బాలపీరులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు మెస్ ఛార్జీల పెంపు ఊరట నిస్తుందని తెలిపారు. 3నుంచి7 తరగతి విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1200, 8 నుంచి 10 తరగతి విద్యార్థులకు రూ.1400, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.1875 పెంచడం హర్షనీయమన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్లలో సర్వేలు, యాత్రలు చేపట్టామని పేర్కొన్నారు. సమస్యలను వెలికి తీసి ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు. సీఎం స్పందించి మెస్ ఛార్జీలు పెంచడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. హాస్టల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి విద్యార్థుల సమస్యలు తీర్చాలని వారు కోరారు.

# మణిపూర్ ఘటన దేశానికి అవమానం



నవతెలంగాణ-ఉప్పల్

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి దారుణంగా చిత్రహింసలకు గురి చేసి దారుణంగా చంపడం దేశానికి అవమానకరమని చిలుకానగర్ క్రైస్తవ సహవాస సమాజం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మణిపూర్‌లో వివిధ తెగల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరులో చెలరేగిన అల్లర్ల వలన కూడూ, గూడు కోల్పోయి అనేక మంది సామాన్య ప్రజలు నానా విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మణిపూర్‌లో శాంతి నెలకొల్పే దిశగా సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిస్థితులు వీలైనంత త్వరగా చక్కబడాలని వారి కోసం ప్రార్థన చేస్తూ సంఘీభావం ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మీద దాడులు దేశంలో ఎక్కడా జరుగకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో పాస్టర్ కె.జేమ్స్ రాజ్, పాస్టర్ మేళ్ల పీటర్ పాల్, మారపాక నాగయ్య, ఇసాక్, వడ్డేపల్లి వెంకటేష్, నీలం గణేష్, స్వామి, దేవదానం, హరిబాబు, సురేష్, అనిత, సంజీవ్, సలోమి, మున్న, హేమంత్, డేవిడ్ రాజ్, సొలొమేన్ రాజ్, ప్రిన్స్ విన్సెంట్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యం కోసం లక్ష్మీ సైగల్ పోరాటం

- మేడ్చల్-మల్కాజ్‌గిరి
- ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం. వినోద



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ లక్ష్మీసైగల్ స్వాతంత్ర్యం కోసం ఎంతో పోరాటం చేశారని మేడ్చల్ మల్కాజ్‌గిరి ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం వినోద అన్నారు. ఆదివారం డాక్టర్ లక్ష్మీసైగల్ 11వ వర్ధంతి పురస్కరించుకొని హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో, ఇంద్రానగర్‌లో ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో ఆమె గొప్పతనంపై మాట్లాడారు. డాక్టర్‌గా ఉచితంగా అనేక సేవలు అందించారని తెలిపారు. కెప్టెన్‌గా రెజిమెంట్‌గా మహిళలకు శిక్షణ ఇచ్చి దేశానికి స్వాతంత్ర్యం రావడానికి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. సింగపూర్‌లో తేయాకు తోటలలో ఎట్టి చాకిరి చేస్తున్న కూలీలపై యాజమానులు లైంగిక దాడులు చేస్తే బాధిత మహిళలందరినీ చైతన్యం చేసి ప్రతి ఘటించేలా వ్యవహరించారని పేర్కొన్నారు. నేతాజీ సమక్షంలో ఐదు వేల మంది మహిళలను సమావేశ పర్చి అందులో 1500 మందికి సైనిక శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఆమెకు కేంద్ర ప్రభుత్వం మెమోరియల్ డేగ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సఫియా సుల్తానా, ఐద్వా నాయకురాలు యాదమ్మ, ఉమా, రేవతి, కవిత, నిర్మల, సుమిత్ర, రాజమణి, సుగుణమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణగిరి కాలనీలో వైభవంగా బోనాల పండుగ



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలం చౌదరిగూడ గ్రామంలోని స్వర్ణగిరి కాలనీలో పోచమ్మ తల్లి, స్వర్ణ మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ బోనాల వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీల వాసుల ఆహ్వానం మేరకు టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి హాజరై అమ్మవార్లను దర్శించుకునిన్నారు. పూజా కార్యక్రమాలలో పాల్గొని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్‌గౌడ్, ఎంపీటీసీ పులగంటి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యురాలు బండ్లగూడ వాణీ భోజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండ్ల గూడెం నాగేష్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కులగంటి రాజశేఖర్, నానావత్ సురేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

# 'రాష్ట్రంలో సంక్షేమ పాలన '

నవతెలంగాణ-శామీర్‌పేట

తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమ పాలన సాగుతోందని బీఆర్ఎస్ శామీర్‌పేట మండలాధ్యక్షుడు విలసాగరం సుదర్శన్, కేసీఆర్ సేవా దళం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అఫ్జల్‌ఖాన్ అన్నారు. ప్రభుత్వం వికలాంగులకు ఆసరా పెన్షన్ పెంచండంతో హర్షం వ్యక్తం చేస్తూ శామీర్ పేట మండల కేంద్రంలోని వైఎస్ఆర్ చౌరస్తాలో ఆదివారం వికలాంగులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్ల రమేష్ యాదవ్, రైతు సహకార సంఘం ఉపాధ్యక్షులు ఐలయ్య యాదవ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మేడి రవి, వార్డు సభ్యులు దూడల శ్రీకాంత్‌గౌడ్, రవిందర్, శేఖర్, డేవిడ్, వికలాంగుల సమితి మేడ్చల్ నియోజకవర్గం అధ్యక్షులు బత్తిని భిక్షపతిగౌడ్, జిల్లా అధ్యక్షులు బూరుగు మల్లేశం, శామీర్‌పేట మండల వికలాంగుల సమితి అధ్యక్షులు ఎమ్ సాయిలు, బూరిళ్ల రమేష్, దేశం రమేష్ గౌడ్, దొంతరబోయిన భూమయ్య, మాధవరెడ్డి, పెంటయ్య డి శ్రీనివాస్, సుమన్ ఖాన్, పరుశురాం తదితరులు ఉన్నారు.



# బోనాల పండుగ సందర్భంగా అన్నదానం



నవతెలంగాణ- కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లో బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ ముత్యాలమ్మ అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించుకున్నారు.ఈ సందర్భంగా ఫేజ్1లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో చిన్న ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మారుతి కన్వెన్షన్స్ యజమాని ఉమా వెంకటేశ్వరరావు ముఖ్యతిథిలుగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జేర్రిపోతుల ప్రభుదాస్ ,మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నారు. కార్యక్రమంలో కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్,చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు డప్పు గిరిబాబు, నవీన్ గౌడ్, రమేష్, నవీన్ రెడ్డి, పల్లె శ్రీనివాస్ రెడ్డి, కొయ్యడ జయపాల్, శేఖర్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, కుమార్ చిన్న కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# నల్ల పోచమ్మ అమ్మవారికి ఆభరణాలు అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధి కిష్టాపుర్ 4వ వార్డులోని ఇంద్రానగర్ కాలనీలోని శ్రీ నల్లపోచమ్మ అమ్మవారికి పూడూరు గ్రామ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు గాదం రాములు యాదవ్ రూ.60 వేలతో పంచలోహ మకర తోరణం, కిరీటం చేయించి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వెల్లడించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనతో పాటు వారి కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తుడుం గణేష్, పరశురాం, తోంటయి హదయ్య, కృష్ణ, శ్రీనివాస్, బాలయ్య, నరేందర్, నాగరాజు, నర్సింహ, కృష్ణ, నరేష్, మహేష్, నవీన్, మహిపాల్, యాదగిరి, స్వామి, పరశురాం కాలనీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాగారం మహిళా అధ్యక్షురాలుగా నవనిత



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి 140వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలుగా నాగారం నవనీతను నియమిస్తూ ఆదివారం డీసీసీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ రాజ నియమాక పత్రం అందజేశారు. నవనీత మాట్లాడుతూ తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్షురాలుగా నియమించినందుకు డీసీసీ అధ్యక్షులు నంది కంటి శ్రీధర్, పీసీసీ డెలిగేట్ జీడి శ్రీనివాస్ గౌడ్, బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు వాసగోని శ్రీనివాస గౌడకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. మహిళలను రాజకీయంగా చైతన్యం తీసుకొస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేశెట్టి రాములు, ఎస్సీ సెల్ ఛైర్మెన్ సామాజి శంకర్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు వీన స్ మేరీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మన్నె రాజు ఆర్థిక సాయం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ, ఎన్టీఆర్ నగర్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇండ్లు కూలిపోయి గూడు లేక ఇబ్బంది పడుతున్నారని సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ,మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మెన్ మన్నె రాజు బాధితుల దగ్గరకు వెళ్లి హార్థిక సాయం అందించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు మరింత సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎల్లవేళలా ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# డీఈఓ అత్యుత్సాహం..!

- నోట్ పుస్తకాల పంపిణీకి అడ్డు..
- 'అన్ ఆథరైజ్‌డ్ పర్సన్స్'ను రానివ్వొద్దంటూ రెండు స్కూల్స్‌కు నోటీసులు జారీ
- జిల్లాలోని హెచ్‌ఎంలకు మౌఖిక ఆదేశాలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఈఓ వింత పనితీరు..!



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER: MEDCHAL-MALKAJGIRI DISTRICT

It is brought to the notice of the undersigned that, some of unauthorized people were allowed by the Head Mistress, ZPHS Ravalkole, Nagavaram, Kesara mandal, Medchal-Malkajgiri Dist into the school premises without any prior permission from the authorities.

Now therefore the Head Mistress, ZPHS Ravalkole, Medchal mandal, Medchal-Malkajgiri Dist is hereby directed to submit her explanation as to why disciplinary action shall not be taken against her for allowing the unauthorized people into the school premises without any prior permission from the authorities.

District Educational Officer
Medchal-Malkajgiri Dist

నవతెలంగాణ-సిటీబ్యూరో

'అమ్మ పెట్టదు.. అడుక్క తిననివ్వదు' అన్నట్టుగా ఉంది మేడ్చల్-మల్కాజిగిరి డీఈఓ పని తీరు. ప్రభుత్వ స్కూల్స్‌లోని విద్యార్థులకు దాతలు ముందుకొచ్చి నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని స్వయంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రే పిలుపునిచ్చారు. కానీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నది పరిస్థితి. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తుంటే డీఈఓ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. 'అన్ ఆథరైజ్‌డ్ పర్సన్స్'ను పాఠశాలల్లోకి రానివ్వొద్దంటూ జిల్లాలోని రెండు స్కూల్స్‌కి నోటీసులు జారీ చేయగా.. జిల్లా వ్యాప్తంగా ఉన్న హెచ్‌ఎంలకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 375 ప్రాథమిక పాఠశాలలు, 22 ప్రాథమికోన్నత పాఠశాలలు, 108 ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలతో కలిపి మొత్తం 515 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపు 96 వేల మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. జూన్ 12న స్కూల్స్ ప్రారంభమయ్యాయి. నెల రోజులు దాటినా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయలేదు. ఇక 'మన ఊరు-మన బడి' కింద 176 పాఠశాలల్లో తరగతి గదులతోపాటు పెయింటింగ్, వంటశాలలు (కిచెన్ షెడ్స్), మూత్రశాలలు, మరుగుదొడ్లు, టేబుళ్లు, ఫ్యాన్లు, బ్లాక్ బోర్డులు, విద్యుత్ సౌకర్యం, నీటి వసతితోపాటు మరిని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. ఇందులో దాదాపు 30 వరకు పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి ప్రారంభోత్సవాలు జరిగాయి. మరో 20 పాఠశాలల వరకు అన్ని సౌకర్యాలతో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. మిగతా పాఠశాలల్లో పనులు ఆయా దశల్లో కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. ఈ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. స్కూల్ ప్రారంభమైన నెల రోజులు దాటినా 'మన ఊరు మన బడి' పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇక జిల్లాలో ఇంత వరకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఒక్క జత యూనిఫామ్ మాత్రమే అందింది. మరో జతపై స్పష్టత లేదు. జిల్లా వ్యాప్తంగా 6.39 లక్షల పుస్తకాలు అవసరం ఉండగా.. దాదాపు 4 లక్షల వరకు పంపిణీ చేసినట్టు సమాచారం. ఇలాంటి అసంపూర్తి పనులపై దృష్టి పెట్టి పూర్తి అయ్యేలా చూడాల్సిన డీఈఓ.. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి నోటు పుస్తకాలు పంపిణీ చేస్తుంటే అడ్డుపడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. జిల్లాలోని మేడ్చల్ మండలం, రావల్‌కోల్ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్, కీసర మండలంలోని నాగవరం స్కూల్స్‌కి డీఈఓ వింత నోటీస్ జారీ చేశారు. 'ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా పాఠశాల ప్రాంగణంలోకి ఎవ్వరినీ రానివ్వొద్దు... నోట్ పుస్తకాల పంపిణీ పేరుతో విద్యార్థుల మైండ్‌ను డైవర్ట్ చేస్తున్నారు... మా అనుమతి లేకుండా ఎవరినైనా పాఠశాల లోపలికి అనుమతిస్తే.. ఎందుకు క్రమ శిక్షణా చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలి... నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం' అని రెండు స్కూల్స్ హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేశారు. అంతటితో ఆగకుండా ఇవే అదేశాలు జిల్లాలోని అన్ని స్కూల్స్‌కు వర్తిస్తాయంటూ మిగతా హెచ్‌ఎంలకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. 'ఎంఈఓ, డీఈఓ అనుమతి లేకుండా ఒక్క పుల్ల కూడా లోపలికి వచ్చినా చర్యలు ఉంటాయి. ఎవరు ఏం ఇవ్వాలన్నా.. డీఈఓ ఆఫీసులో పర్మిషన్ తీసుకోవాలి. ఓరల్ ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తున్నాం. రిటర్న్ ఇన్‌స్ట్రక్షన్స్ కూడా ఉంటాయి. యాక్షన్ సీరియస్‌గా ఉంటుంది. బీ కేర్‌ఫుల్' అంటూ హెచ్‌ఎంలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.

### పిల్లలు ఎలా చదువుకోవాలి



విద్యార్థులకు ఇంకా పూర్తి స్థాయిలో పుస్తకాలు పంపిణీ చేయలేదు. ఇప్పటి వరకు ఒక్క యూనిఫామ్ మాత్రమే అందింది. దాతలు ముందుకొచ్చి నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తుంటే.. రానివ్వొద్దు అనడం సరికాదు. నోట్ పుస్తకాలు ప్రభుత్వం ఇవ్వదు.. దాతలను ఇవ్వొద్దు అంటే ఎలా. స్వయానా విద్యాశాఖ మంత్రే దాతలు నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. వెంటనే డీఈఓ జారీ చేసిన నోటీసు, ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి.

**ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్**

## సుభాష్‌నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన...



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ 91వ రోజు 'ప్రగతి యాత్ర'లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవ ర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ, వి.డి.ఆర్ స్ట్రీట్ , లూయిస్ బ్రెయిలీ వీధిలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పూర్తి చేసిన రోడ్లు, డ్రయినేజీ వంటి అభి వృద్ధి పనులు పరిశీలించారు. అదే విధంగా సంక్షేమ పథకా లు ఏ విధంగా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసు కున్నారు. కాగా తమ బస్తీల అభివృద్ధికి నిధుల కొరత లేకుం డా ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించినందుకు కా లనీవాసులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. మిగిలి ఉన్న చిన్న పాటి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే మిగిలిన పనుల కోసం వెంటనే వ్య యప్రణాళికలు రూపొందించి వాటిని పూర్తి చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ ఛైర్మెన్ మన్నే రాజు, మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగా రావు, స్థానిక డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలె శ్రీకాం త్,129 డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు డా. హుస్సేన్, పండరి యాదగిరి, వెంకట స్వామి, తార సింగ్, ప్రభాకర్, రాజ్ కుమార్, కాలనీ వాసు పాల్గొన్నారు.

## 40 ఏండ్ల నాటి వరద నీటి సమస్యకు పరిష్కారం




నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఒకప్పుడు వర్షం వస్తే అల్వాల్ డివిజన్‌లోని రెడ్డి ఎంక్లేవ్ జల దిగ్బంధనంలో చిక్కుకొనేది. వరద నీరు బయటకు వెళ్లకపోవడంతో నడవలేని దుస్థితి నెలకొంది. వ ర్షాకాలం వచ్చిందంటే కాలనీ అంత ముంపునకు గురై చెరువును తలపించేది. 40 సంవత్సరాలుగా శ్రీనివాస్ నగర్, ప్ర శాంత్ నగర్, రెడ్డి ఎంక్లేవ్‌లు ముంపునకు గురై స్థానికులు ఎ న్నో ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యలను స్థానికులు మ ల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దృష్టికి తీసుకె ళ్లారు. దీనికి స్పందించిన ఆయన గత నాలు గు సంవత్స రాల క్రితం మంత్రి కేటీఆర్‌ను తీసుకు వచ్చి సమస్యను వివరించారు. శాశ్వత పరిష్కారం కోసం బాక్స్ డ్రైన్ ఏర్పాటు చేయాలని కోరారు. కేటీఆర్ సహకా రంతో రూ. 18 కోట్లు నిధులు మంజూరైనాయి. అల్వాల్ సర్కిల్‌లోని మొత్కుల కుంట చెరువు నుంచి, కొత్త చెరువు నుండి (రెడ్డి ఎంక్లోవ్ మీదుగా) చినరాయుని చెరువు వరకు ఈ నిధులతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు అయిపోయి రెడ్డి ఎన్‌క్లేవ్, ప్రశాంత్ నగర్ శ్రీనివాస నగర్, భారతి నగర్ కాలనీ వరకూ బాక్స్ డ్రైన్ నిర్మించారు. దీంతో వరద నీటి ముంపు నుండి కాలనీ వాసులకు ఉపశ మనం కలిగింది.

**- అనతికాలంలోనే అభివృద్ధి పనులు :**



ఎమ్మెల్యే సహకారంతో అల్వాల్ డివిజన్ అభివృద్ధి ప థంలో దూసుకుపోతుంది. ముఖ్యంగా వరద నీటి ముంపు సమస్య పరిష్కారంలో ఎమ్మె ల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక శ్రద్ధ, చొరవ అభినందనీయం. ఆయన సహకారంతో కాలనీలలో బాక్స్ డ్రైన్స్ పనులు వేగంగా పూర్తి చేశాం. 40 ఏండ్ల నుం చి కాలనీ వాసుల ఇబ్బందులన్ని తొలగిపోయాయి. బాక్స్ డ్రయినేజీ, సీసీ రోడ్లు, అంతర్గత డ్రయినేజీ నిర్మాణ పనులు పూర్తి కావడంతో కాలనీల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**- కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి**

**కేటీఆర్ సహకారంతో బాక్స్ డ్రైన్ పనులు పూర్తి**



అల్వాల్ సర్కిల్‌లోని లోతట్టు ప్రాంతాలన్నీ గతంలో జలమయమయ్యేవి. ప్రధానంగా రెడ్డి ఎన్‌క్లేవ్, శ్రీనివాస న గర్, భారతి నగర్‌లలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి, ఆయనను ఇక్కడకు తీసుకువచ్చి, బాక్స్ డ్రైన్ పనులు, కల్వ ర్టులు సీసీ రోడ్లు అంతర్గత డ్రయినేజీలకు కోట్ల రూపాయలు మంజూరు చేయించాను. దీంతో దాదాపుగా వరద ముంపు నుంచి విముక్తి కలిగింది. నియోజకవర్గ ప్రజల సహకారంతో అందరి సహకారంతో అభివృద్ధి పనులు చేప ట్టాం. మ ంత్రి కేటీఆర్‌కు రుణపడి ఉంటాను.

**-ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు**

**-ఎమ్మెల్యే సహకారంతోనే సమస్య పరిష్కారం**



వర్షాకాలం వచ్చిందంటే రెడ్డి ఎన్‌క్లేవ్, శ్రీనివాసనగర్, భారతిన గర్‌లు జలమయంగా మారి చెరువు లను తలపిం చేవి. ఈ సమస్య గత 40 ఏండ్లుగా ఉంది. గత ప్రభుత్వా లు పట్టించుకున్న పాపాన పోలేదు. రెడ్డి ఎన్‌క్లేవ్‌లో వరద నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్య తెలుసు కున్న స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మోత్కు లకుంట నుండి చినరాయని చెరువు వరకు బాక్స్ డ్రైన్‌ను ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో వర్షపు వరద నీరు నేరుగా చెరువులోకి వెళ్లే విధంగా చేయడంతో సమస్య పరిష్కా రమైంది.

**- ఎం. బలవంత రెడ్డి, బీఆర్ఎస్ అల్వాల్ జనరల్ సెక్రెటరీ**

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి డివిజన్ ప్రజలకు హామీ ఇచ్చారు. సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని జై భీమ్ నగర్, మైత్రి నగర్, సురారం కాలనీలలో ఆదివారం స్థానికులతో కలిసి లోతట్టు ప్రాంతాలను పర్యటించారు. భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారని, తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనకు వీలైనంత సహాయం ఆయన ఆ కుటుంబాలకు అందజేశారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అన్నివేళల్లో తమకు అండగా ఉండే సురేష్ రెడ్డిని మహిళలు హారతులతో స్వాగతం పలుకుతూ ఘనంగా శాలువతో సత్కరించారు. పిలవకుండానే వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే గొప్ప నాయకుడని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ... మీ కుటుంబంలో ఒక బిడ్డగా ఎల్లప్పుడూ అండగా ఉంటూ... మీకు ఎలాంటి సహాయం, సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకు వస్తే తప్పకుండా సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. అలాగే వికలాంగుల పెన్షన్లు పెంచినందున స్థానికులతో కలిసి ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, వికలాంగులు, స్థానికులు మహిళలు పాల్గొన్నారు.

## డాక్టర్ కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌కు ఐద్వా ఆధ్వర్యంలో నివాళి



నవతెలంగాణ-మల్కాజిగిరి

స్వాతంత్ర్య సమర యోధురాలు డాక్టర్ లక్ష్మీ సెహగల్ 11వ వర్ధంతి పురస్కరించుకొని ఐద్వా మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఆఫీసులో నివాళుల ర్పించారు. ఐద్వా మేడ్చల్ మల్కాజి గిరి జిల్లా కార్యదర్శి ఎం. వినోద మాట్లాడుతూ డాక్టర్‌గా ఉచితంగా అనేక సేవలందించింది. కెప్టెన్‌గా, రెజిమెంట్‌గా , మహిళలకు శిక్షణ ఇచ్చి దేశాన్ని స్వాతంత్రానికి అనేక పోరాటాలు చేయడం జరిగింది. సింగపూర్‌లో తేయాకు తోటలలో ఎట్టి చాకిరీ చేసేవారి పైన యజమానులు లైంగిక దాడులు చేసేవారు. అటువంటి మహిళలందరినీ చైతన్య పరిచారు. నేతాజీ సమక్షంలో 5 వేలమంది మహిళలను సమావేశపరిచారు. 1500 మందికి సైనిక శిక్షణ పొందారు. అట్లాంటి ఆమెను మహనీయురాలుగా, ఆమెకు మెమోరియల్ 'డే' గా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వా న్ని డిమాండ్ చేస్తున్నాం. మండల కార్యదర్శి పి. మంగ ఐద్వా నాయకులు రాజ్యలక్ష్మి సరోజ చిట్టెమ్మ ,లక్ష్మి , బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే మైనంపల్లి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపు కోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. బోనాల పండుగ సం దర్భంగా ఆదివారం ఆయన, మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌తో కలిసి కౌకూర్, భరత్ నగర్, కింద బస్తీ, బర్నాపేట, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అన్నారు అమ్మ వారి బోనాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపు కోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఏసిపి వెంకట్ రెడ్డి, సిఐ సీతారాం, నాయకులు మల్లికార్జున్, లక్ష్మణ్ యాదవ్, సతీష్, వెంకటేష్ యాదవ్, రాజేష్, హనుమాన్ చారి, విక్రమ్, నరేష్, గణేష్ భక్తులు ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## దివ్యాంగుల పెన్షన్ పెంపుదలపై హర్షం





నవతెలంగాణ-బాలానగర్

రాష్ట్రంలో దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను మరో వెయ్యి రూపాయలు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటనపై ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కార్పొరేటర్ అధ్వర్యంలో దివ్యాంగులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి కార్పొరేటర్ ఆఫీస్ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దివ్యాంగుల పాలిట దేవుడని, సీఎం కేసీఆర్ మరోసారి గొప్ప మనసును చాటుకున్నారని పేర్కొన్నారు. పెంచిన పెన్షన్‌ను వచ్చే నెల నుంచి ఇవ్వనున్నారని, దీంతో రాష్ట్రంలో 5 లక్షల 16 వేల మంది దివ్యాంగులు లబ్ధి పొందనున్నారని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, కుక్కల రాము ముదిరాజ్, కుక్కల కీర్తి, గట్ల శేఖర్, భాగయ్య, రహీమా, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**బాలానగర్:** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెబుతున్నట్టు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పెంచిన పింఛనుతో 5 లక్షల 16 వేల మంది దివ్యాంగులు లబ్ధి పొందనున్నా రని, దివ్యాంగుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నా రని కార్పొరేటర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పెన్షన్లు ఏ రాష్ట్రంలో కూడా ఇం త అద్భుతంగా అమలు కావడం లేదన్నారు. దివ్యాంగులు అందరితో సమానంగా ఎదగాలిఅన్నదే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారని కార్పొరేటర్ సంతోషం వ్యక్తం చేశారు.

**కుత్బుల్లాపూర్:** వికలాంగుల పెన్షనను రూ. 3016 నుంచి 4016 పెంచినందున ఆదివారం కార్పొరేటర్ ఆఫీసు వద్ద స్థానిక వికలాంగులతో కలిసి సుభాష్ నగర్ 130 డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఎల్లప్పుడు దివ్యాంగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. అందరిలాగా మాటలు చెప్పే ప్రభుత్వం కాదని, బీఆర్ఎస్ అంటేనే చేతల ప్రభుత్వమని కార్పొరేటర్ అన్నారు.



## అమ్మవారి ఆలయాల్లో ఒడి బియ్యం అన్నదానం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ కూన మహాలక్ష్మి నగర్ సోమయ్య నగర్ ప్రాంతాలలోని రేణుక ఎల్లమ్మ, పోచమ్మ, మహంకాళి, దేవాలయాల్లో ఆషాడమాసం అమ్మవారి ఒడిబియ్యం అన్నదాన కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సుభాష్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, సత్తిరెడ్డి, లక్ష్మణ్, సునీల్, విగ్నేష్, ఆంజనేయులు, కూనమ హాలక్ష్మి నగర్, సోమయ్య నగర్ ఆలయ కమిటీ సభ్యులు గిరి. సతీష్, కునమాలక్ష్మి నగర్ ఆలయ కమిటీ సభ్యులు కె.వి రాజు తదితరులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్ట:** ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ 'ఏ' ప్రాంతం లోగల శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ పోచమ్మ, నాగదేవత ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఒడి బియ్యం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో అందరూ సుఖశాంతులతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు మురళి కృష్ణ ,ఆలయ కమిటీ ఛైర్మెన్ నేమూరి నరేష్ గౌడ్, వైస్ ఛైర్మెన్ రమేష్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు సింగారం మల్లేష్, బస్తీ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్ గౌడ్, రమణయ్య, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.




## నాలాపై వెలసిన అక్రమ షెడ్లను తొలగించాలి..

- ఎమ్మెల్యే వివేకానందకు రంగారెడ్డి నగర్ వాసుల వినతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి రంగారెడ్డి నగర్ టెక్నో పరిశ్రమ ఆవరణలో నాల పై అక్రమంగా షాపింగ్ షెడ్లు వేయడంతో వర్షాకాలం సమయంలో నాలా నిండిపోయి వరద నీరు రోడ్లపైకి, ఇండ్ల ముందరికి రావడంతో బస్తీ వాసులం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రంగారెడ్డినగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేశా రు.డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, ప్రకృతి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి. సుధాకర్, స్థానిక నా యకులు గోనె యాదిరెడ్డి, రవి యాదవ్, బరిగెల వెంకటే ష్‌లు ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేశారు. గ త కొన్ని ఏండ్లుగా నాలాపై వెలసిన అక్రమ షేడ్లను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే నాలా రీ మోడలింగ్ పనులు చేయించాలని వినతిలో పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమ షెడ్లను తొల గించేందుకు సత్వరమే అధికారులతో చర్చించి, చర్యలు తీసుకుంటామన్నారు. రీ మోడలింగ్ పనులు కూడా త్వరలోనే చేయిస్తారని వారికి హామీ ఇచ్చారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్వీ రమ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేద్దాం అని తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్వీ రమ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమలానగర్‌లోని సీఐటీయూ ఆఫీసులో ఆదివారం అధ్యక్షులు ఉన్నికృష్ణ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్వీ రమ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా చూడాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలనీ, ఇన్సూరెన్స్ చేయాలనీ, బకాయి పడ్డ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన బడ్జెట్‌ను పెంచాలనీ, వసతులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి ప్రేమలత, కోశాధికారి సువర్ణ, ముఖ్య నాయకులు భాగ్య, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మైనంపల్లి శివాంక్ బాబు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మల్కాజిగిరి/నేరేడ్‌మెట్

ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కుమారుడు శివాంక్ బాబు జన్మదిన వేడుకలు ఆదివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగరంగ వైభవంగా జరిగాయి. బీఆర్ఎస్ మల్కాజిగిరి మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో శివాంక్ బాబు కార్యకర్తలు, ప్రజల మధ్య కేక్ కట్ చేసి సందడి చేశారు. ఇంతమంది మధ్యలో తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మైనంపల్లి కుమారుడు శివాంక్ బాబుకు గుండా నిరంజన్ ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయు ఆరోగ్యాలతో ఆనందంగా తన పయనం కొనసాగించాలని అన్ని రకాలుగా దేవుడు చల్లగా చూడాలని వేడుకున్నారు. మంచి మనసున్న, అభం శుభం తెలియని కల్మషం లేని గొప్ప వ్యక్తి శివాంక్ బాబు అని కొనియాడారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్, బీఆర్ఎస్ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు తులసి సురేష్, నాయకులు బాలకష్ణ గుప్తా, ఫరీద్, జాన్సి, పావని, భూపతి, శ్రీనివాస్, అఖిల్, మల్లేష్, దుష్యంత్, సురేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరి:** బీఆర్ఎస్ అధికార ప్రతినిధి సతిష్ కుమార్ ఆధ్వర్యంలో మైనంపల్లి శివంక్ బాబు జన్మదినం సందర్భంగా పీవీఎన్ కాలనిలోని ఫ్యూచర్ ఫౌండేష్‌లో కేక్ కటింగ్ చేశారు. పిల్లలకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బ్రమ్మయ్య ఉమాపతి, కన్నా, పార్థు, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.





కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభిపూర్ కార్యాలయంలో ప్రజలు ప్రభుత్వ వీప్ ఎమ్మెల్సీ శంభిపూర్ రాజును కలిసి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. నవతెలంగాణ-దుండిగల్



టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మీడియా ఇన్‌చార్జ్ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన సందర్భంగా పీపీఆర్ కన్వెన్షన్ అవుషాపూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరు కాగా కూకట్ పల్లి నియోజకవర్గ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కూకట్‌పల్లి ఎ బ్లాక్ ఎస్సీ విభా ప్రెసిడెంట్ బందీగా బాలనర్సింహ, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-బాలానగర్



నాలా నుండి రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు.
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

## ప్రత్యేక పూజలలో పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి ఆలయంలో గత వారం రోజులుగా హరే రామ హరే రామ రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే అంటూ మూల మంత్రాన్ని వారం రోజుల పాటు ప్రతిరోజూ 24 గంటలు ఆపకుండా పారాయణం సంకల్పముతో వేద పండితులు భక్తులు పఠించడం జరిగింది. ఆదివారం చివరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతా రామచంద్ర ఆలయ ధర్మకర్త బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని ఉదయం పుష్ప అర్చనలు, అభిషే కాలు, ప్రత్యేకంగా పూర్ణాహుతి హెూ మం, పలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ దేవుని నామస్మరణతో ఆ మూల మంత్రాన్ని పాటించడం, అన్ని మరచి దేవుడి ధ్యాన ంలో పూజా కార్యక్రమంలో పాల్గొన ప్రతి ఒక్కరికీ శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆ దేవుడి ఆశీస్సులు, కరుణ ఎల్లప్పుడూ అందరిపైనా ఉండాలని, అందరూ మన స్ఫూర్తిగా వేడుకోమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విశేషముగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఖైరతాబాద్ నియోజకవర్గంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆధ్వ ర్యంలో వెంకటేశ్వర కాలనీ డివిజన్ చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకుముందు ఆమె ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎర్ర సతీష్ ఏర్పాటు చేసిన ఎంప కన స్ట్రక్షన్ కంపెనీ లోగోను ఆవిష్కరించారు.



-నవతెలంగాణ-బంజారాహిల్స్

## పోటీ పరీక్షల ఉర్దూ మెటీరియల్ పంపిణీ

నవ తెలంగాణ- సిటీ బ్యూరో

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పోటీ పరీక్షలను ఉర్దూలో రాసే అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఉర్దూ వెర్షన్‌లో తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ మాజీ డైరెక్టర్ మహ్మద్ ఖాజా రచించిన బిట్స్ బ్యాంక్ మెటి రియల్ పుస్త కాలను ఆదివారం అబిడ్స్‌లోని సియాసత్ కార్యాల యంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షలతోపాటు ఉపాధ్యాయ పోస్టులైన టీజీటీ,పీజీటీ, జేఎల్, డీఎల్, గురుకుల పరీక్షలకు హాజం'య్యే ఉర్దూ అభ్యర్థులకు సుమారు ఐదు వేల బిట్స్ గల మెటిరియర్ ఎంతో దోహదపడనుంది. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొని పుస్తకాలు ఉచితంగా అందుకున్నారు.



# మణిపూర్‌లో యుద్ధ ప్రాతిపదికన శాంతి నెలకొల్పాలి





- జాగో తెలంగాణ వేదిక సభ్యులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

మణిపూర్‌లో బీజేపీ ఒక ప్రణాళిక ప్రకారం మెజారిటీ మైతీ ప్రజలను మత తత్వంతో ప్రేరేపిస్తూ, మైనారిటీ గిరి జన కుకీలపై హత్యాకాండ సాగిస్తున్నారని జాగో తెలంగాణ వేదిక సభ్యులు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో వారు మాట్లాడుతూ కుకీ గిరిజన మహిళలపై లైంగికదాడులు భారీ ఎత్తున ప్రేరేపిస్తున్నారని, బీజేపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మత విద్వేష ఎజెండాను కొనసాగిస్తుందని ఎద్దేవా చేశారు. ఈ మారణ హెూమాన్ని ప్రభుత్వం యంత్రాంగాలతో కలిసి సాగిస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని ఎప్పుడో కాల రాశాయని, ఈ ఘటనను ఖండిస్తూ మణిపూర్‌లో తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని, కోరారు. గత నాలుగు నెలలుగా జరిగిన అన్ని హింసాత్మక సంఘటనలను సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో విచారణ జరిపించి తగు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో మతతత్వ విద్వేష విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీ పార్టీకి గట్టి గుణపాఠం తప్ప దని, మతాలను గౌరవిస్తూ విద్వేషాలకు లోనవ్వకుండా అందరు సామరస్యంగా కలిసి మెలిసి శాంతియుతంగా ఉండాలని దేశ ప్రజలకు జగో తెలంగాణ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్,ఆకునూరి మురళి ఐఏఎస్, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి (మాజీ అర్థశాస్త్రఆచార్యులు) , నైనాల గోవర్ధన్ ,సంఘం రెడ్డి పృధ్విరాజ్ ,అన్వర్ ఖాన్, సోగరా బేగంలు ప్రసంగించారు.

### మణిపూర్ ఘటన అమానవియం

### -ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

మణిపూర్ హిందుత్వ మతోన్మాదశక్తులు కుకీ-నాగాలకు చెందిన ఆదివాసి తెగలపై అనాగరిక దాడులు దారుణమని, ఆదివాసి మహిళలు మతోన్మాదులు నగ్నంగా ప్రదర్శన చేయటం, లైంగికదాడులకు పాల్పడటం, హత్య చేయ టం దారుణమని, నిందుతులను కఠి నంగా శిక్షిం చాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అరాచక శక్తులను అణిచివేసి ఆ రాష్ట్రంలో శాంతి భద్ర తలను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆర్చ్ బిషప్ దాసన్న మాట్లాడుతూ మహిళను వివస్త్రను చేసి ఊరేగించి హత్యలు క్షమించరాని నేర మని, అలా చేసిన వారిని ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మణిపూర్‌లో శాంతియుత వాతా వరణం నెలకొనేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో దేశ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షు లు శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, మహిళా అధ్యక్షురాలు డా.లక్ష్మి, ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, బిషం దసన్న, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

# చివరి వ్యక్తి దాకా వైద్యం అందాలి

- డా.సాయి రవి శంకర్

నవతెలంగాణ- బంజారాహిల్స్

ప్రతి ఏటా 22 జూలై నాడు నిర్వహించే ప్రపం చ మెదడు దినోత్సవాన్నిను బంజారాహిల్స్ లోని విరించి ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా కార్యక్రమాలకు హాజరైన ఆస్పత్రి సీఈఓ డా.సాయి రవి శంకర్ మాట్లాడుతూ వయ స్సుతో సంబంధం లేకుండా అందరికీ న్యూరలా-జికల్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వాటికి సరైన సమయంలో నిర్ధారించకపోయినట్లయితే విపరీత పరిణామాలకు దారి తీయవచ్చని అందు కోసం ఇలాంటి వాటిపై ప్రజలు అవగాహన పెంచు కోవా లని సూచించారు. నేటి జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా అల్జీమర్స్, పార్కిన్సనిస లాంటి పలు రకములైన డెమన్షియా రకపు రుగ్మత లతో భాదపడే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోం దని వివరించారు. అందుకే ఆరోగ్య రంగంలో పని చేసే వారే కాకుండా సామాన్య ప్రజల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ సమస్యపై దృష్టి కేంద్రీకరించి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. మెద డుకు సంబంధించిన పలు అంశాలపై ప్రపంచ ప్రజ లలో అవగాహన కలిగించేందుకు ఏటా ఈ ప్రపంచ మెదడు దినోత్సవాన్ని విశ్వవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విరించి హాస్పిటల్స్‌లోని న్యూరాలజీ విభాగపు వైద్యులు హాస్పిటల్ సిబ్బందికి పలు మెదడు కు సంబంధించిన రుగ్మతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మెదడుకు చురుకుదనం కలిగించే రీతిలో హాస్పిటల్ వైద్యులకు ప్రత్యేక క్విజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్విజ్ కార్యక్రమంలో వైద్యుల మెదడుకు పని కలిపించే రీతిలో పలు ప్రశ్నలను క్విజ్ మాస్టర్ సంధించగా వాటికి వైద్యులు సమాధానం ఇచ్చారు. అనంతరం ప్రపంచ మెదడు దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డా.యం ఆర్ సి నాయడు మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సరైన వ్యాధి నిర్ధారణ పరిజ్ఞానం, సదుపాయాలు అందు బాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నా రు.దీంతో మెదడు లేదా నరాలకు సంబంధించిన రుగ్మతలతో భాదపడే వారికి సరైన సమయంలో చికిత్స అందించడం సాధ్యం కావడం లేదని తెలి పారు.ఈ కార్యక్రమంలో డా.శివరామకృష్ణ నేతృత్వం లోని వైద్యుల బృందం మొదటి స్థానంలో నిలువగా డా. రాఘవేంద్ర నేతృత్వంలోని వైద్య బృందం రెండవ స్థానంలో నిలిచారు. వి.సత్యన్నారాయణ, ఎక్జిక్యూటివ్ డైరెక్టర్,సీఈఓ డా.సాయి రవి శంకర్, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్, పూరిడా, యం ఆర్‌సీ నాయడు, విరించి ఆస్పత్రితో పాటు పలు వురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## కిషన్‌రెడ్డికి ఘన సత్కారం

నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర నాయ కులు, సీనియర్ న్యాయవాది చల్లా దామో దర్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనకు శుభాకాం క్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అధికారంలోకి రావడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టీ.గోవర్ధన్‌రెడ్డి, టీ.ఇంద్రారెడ్డి, కే.రవీందర్‌రెడ్డి, గంధమాల ఆనంద్‌గౌడ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.



## బోనాలు తెలంగాణ సాంస్కృతికి చిహ్నాం

- ఆర్.వీ.మహేందర్ కుమార్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలం గాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే బోనాల పండుగను ప్రజలు వైభవంగా జరుపుకుంటారని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్.వి మహేందర్ కుమార్ అన్నారు. ఆది వారం హనుమాన్ టెకిడి లో నిర్వహించిన బోనాల ఉత్సవా ల్లో పాల్గొని మాట్లాడుతూ.. బోనాల పండుగలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాని దేనాని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ వికలాంగులకు 4016 పింఛన్ అందిస్తున్న సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. గోషామహల్ నియోజకవర్గం నుండి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని చెప్పారు. తనకు సీఎం కేసీఆర్. మంత్రి కేటీఆర్ ఆశీస్సులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు





- ప్రత్యేక పూజలు చేసిన మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచర్లలో ఆదివారం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానికంగా ఉన్న శ్రీ పోచమ్మ, కొండపోచమ్మను భక్తులు దర్శించుకుని మొక్కును చెల్లించుకున్నారు. మహిళలు బోనం సమర్పించడానికి ఆలయాల వద్ద బారులు తీరారు. డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, స్థానిక కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, లింగ్ జంగయ్య యాదవ్ ఆహ్వానం మేరకు బోనాల ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక మంత్రి చామకూర మల్లారెడ్డి, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, వీఆర్ఎస్ అధ్యక్షులు మందా సంజీవరెడ్డి, కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మా రెడ్డి, సుమన్‌నాయక్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమ్మవారి దయతో బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని కోరారు. ఇదిలా ఉండగా టీపీసీసీ ఉపా ధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ కొత్త కేశోర్‌గౌడ్, కొత్త ప్రభాక ర్‌గౌడ్, మేడ్చల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తసుశాంత్ గౌడ్, ఎస్సీసెల్ మేడ్చల్ అధ్యక్షులు కుర్రి మహేశ, పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షులు రవి అమ్మవారిని దర్శించుకున్నారు.

### బోనాల పండుగలో కాంగ్రెస్‌నేత రాగిడి

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గడ్డం యాదగిరితో కలిసి కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి బోనాల సందర్భ ంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజ చేశారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డిని ఘనంగా సత్కరించారు. చర్లపల్లి డివిజన్ వాసవీ శివనగర్ చెందిన బల్లు బాయ్ ఆహ్వానం మేరకు బోనాల పండుగలో పాల్గొని వాసవీ శివనగర్‌కు చెందిన యువజన నాయకుడు కోల రాహుల్‌గౌడ్ జన్మదిన సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి రాహుల్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

## కరాటే విద్యార్థులకు బెల్టులు అందజేత



నవతెలంగాణ-అంబర్‌పేట

జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ గ్రేడింగ్‌లో పాల్గొన్న 34 మంది విద్యార్థులను జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫి కెట్లు అందజేసి వారిని అభిన ందించారు. ఈ సంద ర్భంగా అకాడమీ డైరెక్టర్ మాట్లాడుతూ విద్య వయస్సుతో నిమిత్తం లేదని, అన్ని వయస్సుల వారికి వర్తిస్తుందన్నారు. విద్యా ర్థులకు యువతి, యువకులకు ఎంతో ఈ కరాటే ఎంతో అవసరమన్నారు. ఈ విద్య వల్ల ఆత్మస్థైర్యం మనోధైర్యం, ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కరీం, అమృతరెడ్డి, యోగిని, గణ సంతోషిని, గౌతమ్, షైనీ, నందిని తదితరులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి,

నవతెలంగాణ-ఓయూ

ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ పరిధి బాలంరాయిలో గల శ్రీ దండు మారమ్మ దేవస్థానంలో గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మే యర్ అమ్మవారికి బోనం సమర్పించారు. ఆలయ అర్చకులు ఆమెకు సాదరం గా స్వాగతం పలికి, దంపతు లను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ తల్లి దయతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిం చారు. తార్నాకలోని హెచ్ఎండీఎ కార్యాలయంలోని శ్రీ నల్ల పోచమ్మ, లాలపేటలోని శ్రీ మహాలక్ష్మీ ఆలయం, ఎర్రకుంటలోని శ్రీశ్రీ మాత నల్ల పోచమ్మ దేవాలయంలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పాప జ్ఞాపకాలు చిరస్మరణీయం

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఎన్ని సేవలు చేసిన జ్ఞాపకాలు చిర స్మరణీయంగా ఉండాలంటే రాబోవు కాలనికి మనం చేసిన సేవల తాలూకు అనుభవాలు జ్ఞాపకాలు ఉండాలనే లక్ష్యంతో పని చేయాలని పలువురు వక్తలు తెలిపారు. ఆదివారం సోమా జిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాప సతీమని సూర్యవతి, విశ్వేశ్వర్ రెడ్డి, శ్యామ్ మోహన్, గోపీనాథ్లు ఆయన కార్టూన్ గ్యాలరీకి సంబంధించిన పుస్తకావిష్కరణలో పాల్గొన్నారు. అనం తరం వారు మాట్లాడుతూ జర్నలిజం ఎవ్వరైనా చేయచ్చు అనే ఆత్మ స్థైర్యాన్ని కల్గించారని, పంజెట్టు కార్టూన్ స్పేస్ పిల్లర్ సృష్టించిన వ్యక్తి పాప అన్నారు. అవసరమైన పనిగా భావించి రాబోయే తరం వారు ఈ పని నేను చేయాలని దానికి రికార్డ్ అవసమని తెలిపారు. శ్యామ్‌సుం దర్, సుధని, ప్రకాష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సెంచురీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- మధుమేహ, ఈఎన్‌టీ, పల్మనాలజీ, యోగా నిపుణులతో ప్రత్యేక వైద్య పరీక్షలు
- భారీగా తరలివచ్చిన చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



వర్షాకాలం, వరుసగా ముసురుపట్టి ఉం డటంతో వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందనీ, అం దువల్ల ప్రజలందరూ తమ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా -ండాలని సెంచురీ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ హేమంత్ కౌకుంట్ల సూచించారు. ఆస్పత్రి ఆధ్వ ర్యంలో అమృత వ్యాలీలో ఆదివారం వర్షాకాల వ్యాధులపై ఉచిత మెగా వైద్య శిబిరా లను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ సముద్రాల వేణు గోపాలాచారి ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇలాంటి ఉచిత వెద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, తమ జీవనశైలిలో కూడా తగిన మార్పులు చేసుకోవాలని సూచించారు. వెద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు విచ్చేసి పలు రకాల పరీక్షలు చేశారు. పల్మ నాలజిస్టు డాక్టర్ జానపాటి భరత్ నేతృత్వంలో పల్మనరీ ఫంక్షన్ టెస్టు, పల్మనరీ రీహాబిలిటేషన్ (బ్రీతింగ్ ఎక్సర్ సైజులు), ఎత్తు, బరువు, బీపీ, జ్వరం, పల్స్, ఎస్‌పీఓ2 లాంటి వైటల్స్ పరిశీలనతో పాటు పెద్దలకు టీకాలు వేయి ం చాల్సిన అవ సరంపై అవగాహన కల్పించారు. ఈఎన్‌టీ నిపుణులు డాక్టర్ చైతన్యం ఆధ్వర్యంలో ఉచితంగా నాసల్ ఎండోస్కోపీ, వీడియో లారింగోస్కోపీ, ఓటో ఎండోస్కోపీ, తలనొప్పి పరీక్షలు, హియరింగ్ ఎయిడ్ టెస్టులు, వెర్టిగో, టైనిటస్ పరీక్షలు, పిల్లల్లో ఈఎన్‌టీ సమస్యలకు సంబం ధించిన పరీక్షలు, గురక పరీక్ష, హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ పరీక్షలు, థైరాయిడ్ పరీక్షలు చేయడంతో పాటు వినికిడి పరికరాలను రాయితీపై అందించారు. జనరల్ ఫిజిషియన్, వైద్య పరిశోధకులైన డాక్టర్ వేదాల రామకృష్ణ ఆధ్వ ర్యంలో మధుమేహానికి సంబంధించిన పలు రకాల పరీక్షలు చేశారు. ఆయుర్వేద వైదురాలు, నాడీ వైద్య నిపుణురాలు, ఆల్ట్ హీల్ సీఈఓ, వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రియాంకా గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన నాడీ పరీక్షలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు. మానసిక, శారీరక, భావోద్వేగ పరమైన సమతుల్యత ఎలా ఉందో తెలియపర్చేందుకు

ఏఐ టూల్ తో పరీక్షలు జరిపారు. అలాగే స్కిన్ టోన్ మెరుగుపరుచుకునేందుకు సహజమైన పద్ధతి అయిన ఫేస్ యోగా గురించి చెప్పారు. ఇది ముఖ కండరాలను మెరుగుపరిచి, మరింత తేజోవంతంగా ఉండి, యూత్ ఫుల్ లుక్ తీసుకొస్తుందని అన్నారు. దీనివల్ల ముఖం మీద ముడతలు, గీతలు మాయమవుతాయని, ముఖ కండరాల టోన్ మెరుగుపడుతుందని, అలాగే ముఖంపై పడే ఒత్తిడి, టెన్షన్‌ను రిలాక్స్ చేస్తుందని వివరించారు. డైటీషియన్, న్యూట్రిషనిస్టు డాక్టర్ తరణి నాయుడు ఆధ్వర్యంలో ఎవరె వరికి వక్తిగతంగా ఎలాంటి ఆహారం అవసరమో గుర్తించి, ఆరోగ్యకరమైన జీవనశైలి గడిపేందుకు సూచనలిచ్చారు. ఇందులో భాగంగా బాడీ కంపోజిషన్ విశ్లేషణ, ప్రవర్తనలో మార్పులపై సలహాలు, ఎలాంటి ఆహారం తీసుకోవాలనశీ సూచనలు ఇచ్చారు. ఈ మెగా వైద్య శిబిరంలో చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన దాదాపు 150 మందికి పైగా ప్రజలు పాల్గొని ఆయా విభాగాల్లో ఈ వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు.

# మోడీని దించితేనే దేశంలో శాంతి




- ఐద్వా, సీపీఐ(ఎం) సీపీఐ నాయకులు
- ర్యాలీ పాల్గొన్న కాంగ్రెస్, బీఎస్పీ

నవతెలంగాణ-జవహర్‌నగర్

బీజేపీని గద్దె దించితేనే దేశంలో శాంతి నెల కొంటుందని, మహిళ రక్షణలో మోదీ ప్రభుత్వం విఫల మైందని ఐద్వా ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం కార్పొరేషన్‌లో మణిపూర్ ఘటనను నిరసిస్తూ మహిళా కార్మిక సమాఖ్య ఐద్వా మహిళాల ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రజా సంఘాల నాయకులు విజయ మాట్లాడుతూ.. దేశంలో డిజిటల్ టెక్నాలజీ అంటూ గొప్పలు చెప్పుకునే బీజేపీ ప్రభుత్వం మహిళా రక్షణకే దిక్కులేదని దుయ్యబట్టారు. మణి పూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం యావత్ దేశానికే సిగ్గుచేటన్నారు. మోదీ ప్రభుత్వంలో దళిత, గిరిజనులపై దాడు లు పెరిగాయాన్నారు. నింది తులను కఠినంగా శిక్షించాలని తెలి పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ యాదవ్, షేక్షావలీ, శివనారాయణ, సావిత్రి, పాషామియా, కాలేషా, యాదగిరి, బాలు, మమత, రేసు లక్ష్మీయాదవ్, శంకర్, సుగుణ పాల్గొన్నారు.

## కాశ్మీర్‌లో పండితులకు మైనారిటీ హెూదా కల్పించాలి

### కేంద్ర ప్రభుత్వానికి కాశ్మీరీ హిందూ సభ విజ్ఞప్తి

నవతెలంగాణ-బంజారా హిల్స్

కాశ్మీర్‌లో హిందువులను కాశ్మీర్ పండితులను ఊచాకోత కోసి కాశ్మీర్‌తో అసలు హిందువులకు సంబంధమే లేదు అన్న ట్టు ప్రవర్తిస్తున్న ఒక మతం రాజ్యాంగంలోని సెక్యులర్ పదానికి తూట్లు పొడుస్తున్నారని కాశ్మీర్ హిందూ సభ జాతీయ నాయకులు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ సమావేశంలో హిందూ సభ జాతీయనాయకులు విక్రమ్, విజయ్ కథ్, ప్రసంగించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కాశ్మీర్ ఆర్టికల్ 370 తొలగించిన తర్వాత ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి కాశ్మీర్ అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తుంది. కానీ ఐదు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన, కాశ్మీర్ స్థానికులమైన కాశ్మీర్ పండితుల విషయంలో ఇప్పటికీ ఎలాంటి న్యాయం చేస్తుందో అన్న తర్జనభర్జన కాశ్మీర్ పండితులమైన మాకు ఆందోళన కలిగిస్తుందనీ తెలిపారు. కాశ్మీర్ పండితులు తమకు న్యాయం చేయవలసిందిగా ప్రభుత్వాన్ని విక్రమ్ తపోవో పండిత్,ఐకే పండిత్‌లను వేడుకున్నారు.

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT,AT: HYDERABAD**

**O.S.No: 31 of 2023**

**Between:U. Pradeep Babu ..Plaintiff And M/s. Mangaladayak Chit Fund Pvt Ltd & others .. Defendants**

To,
**Sudharshan,Director, M/s. Mangaladayak Chit Fund Pvt Ltd,** O/o. H.No.7-1-215/A/1, 27/A & 28/A,Flat No. 204, Royal Arcadia, 2nd Floor, Above SBI Balkampet Branch,SR Nagar, Hyderabad-38. .... **Defendant No.3**

Please take notice that the **PLAINTIFF HAS FILED THE ABOVE SUIT AGAINST YOU FOR RECOVERY OF MONEY.** Whereas in the said Suit, summons were sent to you through process of Court and through R.P.A.D, but could not be served upon you as the same were returned unserved. Therefore as per Orders of the Honourable Court, this notice is published, the **said Suit stands posted on 02-08-2023** for your appearance in the said court at **10.30 A.m.** and in case you do not appear either in person or through an Advocate, the said suit will be heard and decided in your absence setting you exparte.

**( By Order Of The Court)**
**K. RAMANJANEYULU**
**ADVOCATE**
**Flat No. 305, Raghava Towers, Opposite Archana Hospital, Madinaguda,Hyderabad-49**

**IN THE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE : RANGA REDDY DISTRICT, AT : KUKATPALLY**
**O.S.NO. 38 OF 2018**

**Between:**
B.Chandraiah Goud & another .....Plaintiffs
AND
P.Rani & others .....Defendants

To,
1. B.Amsamma, W/o. Late B.Krishnaiah,
2. B.Rajeshwari, W/o. B.Suresh Goud,
3. B.Malleshwari, W/o. M.Mallesh Goud,
4. D.Jyothi, W/o. D.Satyanarayana Goud,
5. B.Mallesh, S/o. Late B.Krishnaiah,
(S.No, 1 to 5 are R/o. H.No.1-103/1, Serilingampally Village & Mandal, Ranga Reddy District. ) ...Defendants 7 to 11
6. T.Kamala Kumari, W/o. T.Mallikarjuna Rao, R/o. H.No.42, Venkat Reddy Colony, Serilingampally Village & Mandal, R.R.Dist
7. T.Suryanarayana Rao, S/o. T.Mallikarjuna Rao, R/o. H.No.42, Venkat Reddy Colony, Serilingampally Village & Mandal, Ranga Reddy District.
8. Lambu Venkata Rao, S/o. Laxman Rao, R/o. H.No.4-15, Serilingampally Village & Mandal, Ranga Reddy District.
9. Kasula Praveen, S/o. K.Narsimha, R/o. H.No.3-33/7, Venkatreddy Colony, Serilingampally Village & Mandal, R.R.Dist
10. Uppala Mamatha, D/o. U.Ramesh, R/o. H.No.4-6-137/24/2, Plot No.31/B/W, Tulasi Nagar, Allwyn Colpnu, Phase-II, Kukatpally, Hyderabad. ...Defendants 13 to 17
11. M.Ramchander, S/o. Bonappa, R/o. H.No.3-33/7, Venkatreddy Colony, Serilingampally Village & Mandal, Ranga Reddy District. ...Defendant No.19
12. Siddinaboina Venkatesham, S/o. S.B.Mallaiah, R/o. Q.No.241/B, BHEL Township, R.C.Puram, Mandal, Sanga Reddy District. ...Defendant No.22
13. Smt.Anju Murakara, W/o. Mahabir Muraraka, R/o. H.No.233, Prasanth Nagar, Kondapur, Serilingampally Mandal, R.R.District. ...Defendant No.26

Take notice that the Plaintiffs filed the above case in O.S.No. 38 of 2018 seeking partition and separate possession of their share in respect of suit schedule properties before the Hon'ble VI Addl. District Judge, R.R. District, at Kukatpally against you and other defendants. The said case stands posted to **23-08-2023** for your appearance. Please make it convenient to appear either in person or through duly instructed agent on the said date at 10.30 a.m. before the Hon'ble Court, as otherwise, the Hon'ble Court will proceed with the matter in your absence.

**// BY ORDER OF THE COURT //**
**S.SRINIVASA RAO**
**ADVOCATE**
Plot No.238, Doyens Township, Serilingampally, Hyderabad – 500 019
Tel: 98480-80646

**IN THE COURT OF THE HON'BLE I ADDL. DISTRICT & SESSIONS JUDGE Cum MSJ Cum ADDL FAMILY COURT MEDCHAL MALKAJGIRI DISTRICT AT : MALKAJGIRI**
**G.W.O.P. No. 50 OF 2023**

**Between:**
Smt. Salome Rebecca .....Petitioners
AND
All Concerned .....Respondents

**(IN THE CASE OF MINOR MASTER ROHAN JOSHUA FRANCIS)**

To,
All Concerned,

The general public is hereby informed that the petitioner, Smt. Salome Rebecca, W/o. J.E.T. Francis, Age 45 years, Occ: Employee, H.No.4-1-145, Q.No.B-23, VST Colony, Near St. Pius Degree College, Nacharam, Uppal, R.R.District representing her minor son Master Rohan Joshua Francis, S/o. J.E.T. Francis, Age 17 years, Occ: Student had filed the above petition seeking permission of the Hon'ble court for alienating the below described schedule of property of her minor son Master Rohan Joshua Francis.

Please take notice that the above petition is posted on 11-08-2023 for appearance, reply or objections, if any from the persons interested in the above subject matter.

Therefore the persons interested/having claim the above subject matter are hereby directed to make it convenient to appear either in person or through duly instructed agent/pleader on **11-08-2023 at 10.30 A.M.** before the Hon'ble Court, as otherwise, the Hon'ble Court will proceed with the matter as per law.

**SCHEDULE OF PROPERTY:**

All that the plot bearing No. 164, admeasuring 200 Sq.Yards or 167.2 Sq.Mtrs, in Sy.No.428, situated at Rampally village and Gram Panchayath, Keesara Mandal, Medchal Malkajgiri District and bounded as follows:

**NORTH** : by 30' wide road, **SOUTH** : by plot No.175, **EAST** : by plot No.163, **WEST** : by plot No.165

**// BY ORDER OF THE COURT //**
**M/s. MATTAPALLY SRINIVAS**
**T. NAMRATHA**
**ADVOCATES**
Counsel for Petitioner
H.No. 2-3-930, Road No. 2, Arunodaya Nagar colony, Nagole, Hyderabad – 068.
Cell:9848804811

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




నవతెలంగాణ -సుల్తాన్ బజార్

కింగ్ కోఠి కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఓల్డ్ సిటీ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నిరుపేదల కోసం ఆస్పత్రి సహకారంతో గుండె, ఎముకల, బీపీ, షుగర్ పరీక్షలు,మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి కొత్త టెక్నాలజీతో రోబోటిక్ వైద్యాన్ని అందించామని ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ ఆదిత్య తెలిపారు. పనిఒత్తిడి, సరైన వ్యాయామం లేక ఇటీవల గుండె జబ్బులు ఎక్కు వగా వస్తున్నాయని, అలాగే కొంతమంది హఠాత్తుగా మరణిస్తున్నారని కార్డియోలజిస్ట్ డాక్టర్ మీర్జా బైగ్ పేర్కొన్నారు. ఇటువంటి వారి కోసం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేసినట్లు తప్పనిసరిగా ప్రతిఒక్కరూ నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా ఫ్రీగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఈ హెల్త్ క్యాంప్‌లో డా.సైయద్ కౌనియా, డా. సింధు, షైక్ ఇంతీయాజ్, షారుక్‌హుస్సేన్, ఖుదూస్‌లు పాల్గొన్నారు.



## ఘనంగా గంగపుత్ర సంఘం బోనాలు ఉత్సవాలు



నవతెలంగాణ-అడిక్ మెట్

చిక్కడపల్లి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. లోయర్ ట్యాంక్ బండ్ శ్రీ కనకాల కట్ట మైసమ్మ దేవాలయం వరకు బోనాలతో వచ్చిన గంగపుత్ర మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. చిక్కడపల్లి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుండు జగదీష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్లు జి.అరుణా జయేందర్ బాబు, ముఠా పద్మ, కామారెడ్డి కార్పొరేటర్ జ్ఞానేశ్వరి దేవి, నగర గంగపుత్ర సంఘం గౌరవాధ్యక్షుడు వెంగలి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గంగ తెప్పోత్సవం కమిటీ అధ్యక్షుడు మల్క్య మహేందర్ బాబు, ఫిషరీస్ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, చిక్కడపల్లి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## హాస్టల్స్,గురుకులాలలో మౌలిక వసతులు కల్పించాలి

- తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్
- అధ్యక్షులు కూరెళ్ళ మహేష్ కుమార్



నవతెలంగాణ-అడిక్ మెట్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్, గురుకులాలలో మౌలిక వసతులు కల్పించి, సొంత భవనాలు నిర్మించాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కూరెళ్ళ మహేష్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం విద్యానగర్ బీసీ భవన్‌లో తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ తల పెట్టిన విద్యార్థి సింహగర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్‌లు గురుకులాలు తాత్కాలిక ప్రయవేటు భవనాలలో ఉండడం, కనీస వసతులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవు తున్నారు అన్నారు. ప్రభుత్వం తక్షణమే వాటిపైన దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమస్యలపై ఆగస్టు 23న ఖమ్మంలో జరిగే విద్యార్థి సింహ గర్జనకి వేలాది మంది తరలివచ్చి విజయవంతం చేయా లని అన్నారు. ఈ సమావేశానికి గ్రేట్ హైదరాబాద్ అధ్య క్షులు నక్క వెంకటేష్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గద్దపాటి భరత్ మాదిగ, టీఎస్ఎస్ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ మేడి నాగరాజు, నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీలం వెంకటేష్, బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, టీఎస్ఎస్ఏ స్టేట్ కోఆర్డినేటర్ కోట్ర ప్రభాకర్ రెడ్డి శైలజ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆటో యాప్'ను ప్రారంభించాలి' / జేఏసీ చైర్మెన్ బి.వెంకటేశం డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

15 శాతం టేక్-అవే కమీషన్‌తో ప్రభుత్వం 'ఆటో యాప్'ను ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర క్యాబ్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ నూతన చైర్మన్ బి.వెంకటేశం కోరారు. ఆదివారం హిమాయత్‌నగర్, ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో రాష్ట్ర క్యాబ్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ ఆవిర్భవ సభ నిర్వహించారు. బి.వెంకటేశం మాట్లాడుతూ ఓలా, ఉబెర్, రాపిడో లాంటి యాప్ ఆధారిత ఆటో అగ్రిగేటర్లు ఒక్కో రైడ్‌కు 30శాతం కమీషన్ తీసుకుని డ్రైవర్లను దోచుకుం టున్నాయని, రాష్ట్రంలో అన్ని ఆటో అగ్రిగేటర్ కంపెనీలను నిషేధించి, 15శాతం టేక్-అవే కమీషన్‌తో 'ఆటో యాప్'ను ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం నిర్వహించే రవాణా యాప్, డ్రైవర్లతో పాటు ప్రయాణికులకు, ముఖ్యంగా మహిళలు, పిల్లల భద్రతను నిర్ధారిస్తుందని ఆయన తెలిపారు. ఓలా, ఉబెర్, రాపిడో సంస్థల దోపిడీతో స్వయం ఉపాధి పొందుతున్న తెలంగాణ డ్రైవర్లు కోలుకోలేని నష్టాలను ఎదుర్కొంటున్నారని, దీంతో పాటు నిరంతరంగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబాలను పోషించుకోలేక, వాహన రుణాలు చెల్లించలేక సతమతమవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా రంగా కార్మికుల సంక్షేమం కోసం కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, కొత్త ఆటో పర్మిట్లను మంజూరు చేయాలని కోరారు. నిరంకుశ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల కొత్త మోటారు వాహనాల చట్టం 2019లోని నిబంధనలను అమలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**రాష్ట్ర క్యాబ్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ నూతన కమిటీ ఎన్నిక**

కమిటీ నూతన చైర్మన్‌గా బి.వెంకటేశం (ఏఐటీయూసీ), కన్వీనర్ గా శ్రీకాంత్ (సీఐటీయూ), కో-కన్వీనర్ గా షేక్ సలావుద్దీన్, వైస్-చైర్మన్ లుగా బైరగోని రాజు గౌడ్ (ఏఐటీయుసీ), నగేష్ (బీఆర్ఎస్ కెవి), సతీష్, తిరుమలేష్ గౌడ్, డి.ఆంజనేయులు, సయ్యద్ రవుఫ్, కోశాధికారిగా కిరణ్ లతో పాటు 8 మంది ఉపాధ్యక్షులుగా ఈ సభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మున్నూరుకాపు యువత అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-బంజారాహిల్స్

భావితరాలకు మున్నూరు కాపు ఆదర్శంగా నిలువాలని పటేల్‌యూత్ ఫోర్స్ వ్యవస్థాపకులు తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్ పిలుపునిచ్చారు. పటేల్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన రాష్ట్ర స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 22 శాతానికి పైగా ఉన్న మున్నూరు కాపుల్లో అత్యధిక శాతం యువత ఉన్నారని, విద్యాపరంగా మరింత రాణించాలని, మారుతున్న కాలానుగుణంగా వృత్తి నైపుణ్యాలు పెంచు కొని ఇతరులకు ఉపాధి చూపించే స్థాయికి యువత ఎదగాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉండాలని, ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర నలుమూల నుంచి వచ్చే పేద విద్యార్థుల కోసం గ్రేటర్ బాలబాలికల హాస్టల్ నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని, రెండెకరాల స్థలం రూ. 5 కోట్లు నిధులు కేటాయించాలని, అలాగే ప్రత్యేక ఫైనాన్స్ కార్పొ రేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు బండి పద్మ, ప్రముఖ పారిశ్రామిక వేత్త పెరుక రమేశ్ పటేల్, తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం హైదరాబాద్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పగడాల అరుణ్ కుమార్, వెంకట్ దాదె, ఎ సీనియర్ జర్నలిస్టు యోగేశ్వర్ రావు, యూత్ ఫోర్స్ రాష్ట్ర కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట:

నియోజకవర్గంలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ స్థలానికి కేటాయించే విధంగా నావంతు కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట ముదిరాజ్ సంఘం నాయకులు గోల్నాక క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ సామాజిక వర్గం భవనం అందుబాటులోకి వస్తే, స్థలంలో ముదిరాజ్ సంఘం అభివృద్ధికి సంబంధించిన పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సానుకూలంగా స్పందించి, వెంటనే ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించేందుకు తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సతీష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కిషోర్ ముదిరాజ్, మొర శ్రీరాములు ముదిరాజ్, భరత్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## విద్యార్థులను సత్కరించిన అపోలో ఇన్‌స్టిట్యూట్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

దేశంలోని ప్రముఖ ఆస్పత్రి మేనేజ్‌మెంట్ ఇన్‌స్టి ట్యూట్ అపోలో అడ్మినిస్ట్రేషన్, 2020, 2021, 2022 సం వత్సరాల్లో పట్టభద్రులైన బ్యాచ్‌లకు చెందిన మాస్టర్స్ ఇన్ ఆస్పత్రి అడ్మినిస్ట్రే షన్ విద్యార్థుల కోసం ఆదివారం అపోలో అడ్మినిస్ట్రేటివ్ హెల్త్ సిటీలోని గ్రాడ్యు యేషన్ వేడుకను ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలో అపోలో హాస్పిటల్స్, టీఎస్ అండ్ ఏపీ రీజియన్ సీఈవో శ్రీసుబ్రహ్మణ్యం యడవల్లి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రాడ్యుయేషన్ డే ప్రార ంభించారు. ఈ కార్యక్రమంలో గౌరవ్‌లోరియా, ఎస్‌వీపీ చీఫ్ క్వాలిటీ ఆఫీసర్, అపోలో ఆస్పత్రి, ఇనిస్టిట్యూట్ పూ ర్వ విద్యార్థి ఎపీవీరెడ్డి, కోశాధికారి, ఏహెచ్ఈఆర్ఎఫ్ డా.రేఖఆర్కాట్, డీన్ఏఐఎంఎస్ఆర్ అపర్ణారెడ్డి, ప్రొఫెసర్ విజయ రుద్రరాజు, ప్రిన్సిపాల్, అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్‌లు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్‌ను అందజేశారు. 2018-2022 వరకు చెందిన బ్యాంచ్‌లకు చెందిన విద్యా ర్థులకు బంగారు, రజత పతకాలను అందజేశారు. సీఈఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, తమ కెరీర్‌లో ఒక ముద్ర వేయడానికి, హెల్త్‌కేర్ పరిశ్రమలో సుదీర్ఘ కేరీర్ కోసం కష్టపడి పని చేయాలని, చేతిలో ఉన్నపనిపై దృష్టి పెట్టాలని సూచించారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన విద్యా ర్థులను ఆయన అభినందించారు. జీవితంలో, కెరీర్‌లో విజ య మంత్రం వినయంగా ఉండటమేనని, పరిస్థితి ఎలా ఉన్నా వినయంగా ఉండటమే ప్రపంచాన్ని గెలుస్తుందని ఆయన అన్నారు. గౌరవ్‌లోరియా మాట్లాడుతూ తన పూర్వ విద్యాల యంలో ఉన్నందుకు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ అనేది ఒక రకమైన సంక్లిష్టమైనదని, మీరు దానిపై ఎంత ఎక్కువ పని చేస్తే కష్టం అంత తగ్గుతుంది, సాంకేతికతతో పాటు ప్రతి ఒక్కటి మారుతుందని ఆయన అన్నారు. మూడు బ్యాచ్‌ల విద్యా ర్థులు తమను వృత్తిపరంగా సంసిద్ధంగా ఉన్న మేనేజర్లుగా తీర్చిదిద్దినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. వారి అభ్యాస అనుభవాలను జూనియర్లతో పంచుకున్నారు.

## మహిళల చైతన్యం కోసం ఓ సరికొత్త టెక్నాలజీ

### మేనేజింగ్ డైరెక్టర్ శిరీష మల్లాడి

నవ తెలంగాణ-బంజారాహిల్స్

మహిళలను చైతన్యపరచడం కోసం ఆరోహి సూయింగ్ ఎంటర్‌ప్రైజేస్‌సంస్థ ఓసరికొత్త టెక్నాలజీ తీసుకొస్తున్నట్లు మేనే జింగ్ డైరెక్టర్ శిరీష మల్లాడి అన్నారు. ఆదివారం ఆరోహి సూయింగ్ ఎంటర్‌ప్రైజేస్ సంస్థ ఆధ్వర్యంలో లోగోను నందిత శ్వేత, బిల్లితెర నటి శిరీషలు ఆవిష్కరించారు.తక్కువ బడ్జెట్ తో నటీనటులను తీసుకువచ్చి యాడ్ మేకింగ్ డైరెక్షన్ చేస్తున్న ధీరజ్ డ్రీమ్ ప్రొడక్షన్ హౌస్ చిన్నచిన్న వ్యాపారవేత్తలకు తక్కువ ఖర్చుతో సుధీర్ ధీరజ్ దర్శకత్వం వహిస్తూ అవగాహన కల్పించే కార్యక్రమాలను బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు మాట్లాడుతూ మహిళఎదగాలంటే అవరోధాలను తట్టుకుని ముందుకు వెళ్లాలన్నారు. అన్ని రంగాలలో విజయాలు సాధించాలన్నారు. మల్లాడి శిరీష మంగరావు ఆరోహి సూయింగ్ ఎంటర్‌ప్రైజేస్ సంస్థను నెలకొల్పి తనతో పాటు పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగారన్నారు. తక్కువ ఖర్చుతో మొదలుపెట్టి ఐదు లక్షల పెట్టుబడితో తన బిజినెస్ దినదినాభివృద్ధి చెందుతూ నేడు రూ.15 కోట్లకు చేరుకోవడం విశేషమన్నారు.



## గంగపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్




నవతెలంగాణ-అంబర్‌పేట

గంగపుత్రుల అభివృద్ధికి వారి సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం అలీకేఫ్ చౌరస్తాలో ఎస్ఆర్‌జీ ఫంక్షన్‌హాల్లో అంబర్‌పేట డివిజన్, ప్రేమ్‌నగర్ గంగపుత్ర సేవా సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కులాల అభివృద్ధికి దోహదపడుతోందని, గంగపుత్ర సంఘం అభివృద్ధికి అన్ని విధా లుగా అండగా ఉంటానని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పెంటం రాజు, యశ్వంతు , నర్సింగ్ రావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## జయహెూ రామన్న సాంగ్ ఆవిష్కరణ

- పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటు, ఐటీరంగ అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్‌శాఖ మంత్రి క్రల్వకుంట్ల తారక రామారావు ఎంతో కృషి చేశారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కేటీఆర్ బర్తడే సందర్భంగా ఎస్.ఆర్.ఐచాడ సృజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన జయహెూ రామన్న సాంగ్‌ను ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్పొరేషన్ చైర్మన్‌లు అనిల్ కుమార్, ప్రకాష్, మాజీ ఎంఎల్సీ, రెడ్డి, మహేష్ గుప్తాలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సృజన్ రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పట్టుదల, కృషి, లక్ష్యాలను సాధించడంలో యువతకు కేటీఆర్ ఆదర్శనీయమని చెప్పారు. దేశ విదేశాలలో విస్తృతంగా పర్యటించి రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేలా ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఆలయాల్లో శ్రీగణేష్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఆదివారం బోనాల పండుగ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీ గణేష్ ఫౌండేషన్ చైర్మెన్ ఎన్.శ్రీగణేష్ బాలంరాయ్ దండు మారమ్మ , సీతాల పోచమ్మ అంబేద్కర్ నగర్ లోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవార్లని దర్శించుకు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అంబేద్కర్‌నగర్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంప్రదాయ జలపందిరి ఊరేగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గంగపుత్రులు ధైర్య సాహసాలకు ప్రతీక అని, గంగపుత్రుల సాంప్రదాయ బోనాలకు చాలా ప్రాముఖ్యత ఉందని వారు అన్నారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం వారు శ్రీగణేష్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాములు, కృష్ణ, గణేష్, ప్రవీణ్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బోర్డు పరిధిలోని బాలంరాయ్ దండు మారమ్మ దేవాలయంలో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్యనందిత, నివేదితలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి దర్శించుకున్నారు.

-నవతెలంగాణ-కంటోన్మెంట్



రాష్ట్ర బేవరేజ్ కార్పోరేషన్ చైర్మెన్ గజ్జెల నాగేష్ ఆదివారం బలంరాయ్ దండు మారమ్మ దేవాల యంలో అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-కంటోన్మెంట్



బోనాలు పండగ సందర్భంగా రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మెన్ మన్నె క్రిశాంక్ ఆదివారం పలు దేవాలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. 150 డివిజన్ అంబేద్కర్ నగర్‌లోని నల్ల పోచమ్మ, శ్రీమహంకాళి దేవాలయాలను అలాగే 3వ వార్డులోని శ్రీసీతలపోచమ్మ, దండు మారమ్మ దేవాలయాలను సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నవతెలంగాణ-కంటోన్మెంట్

## గోషమాల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురేస్తాం

- నందకిషోర్ వ్యాస్ బిలాల్



నవతెలంగాణ- బేగంపేట్

రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్‌బిలాల్ అన్నారు. శనివారం డివిజన్ ముఖ్య నేతలతో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలవు తున్నాయని, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త ఉందని ఆయన అన్నారు.

# 'మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి'

- లైంగికదాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలి
- ముఖ్యమంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలి
- దళిత, గిరిజన, ప్రజా, రైతు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మణిపూర్ ఏర్పడిన అల్లకల్లోల పరిస్థితులను పరిష్కరించలేని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని వెంటనే తన పదవి నుంచి బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని పలు దళిత, గిరిజన, ప్రజా, వ్యవసాయ, రైతు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. మణిపూర్ ప్రజలు, తెగల మధ్య చిచ్చు రగిలించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకోవాలని నినాదాలు చేస్తూ పలు ప్రజా, గిరిజన సంఘాలు, మహిళా సమాఖ్య, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి, విద్యార్థి ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హిమాయతనగర్‌లోని అమృత ఎస్టేట్ నుంచి 'వై' జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ మణిపూర్ ఆదివాసీ మహిళల నగ్న ప్రదర్శన, లైంగికదాడులు, హత్యలు జరుగుతున్న నియంత్రించలేని రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే 80 మంది చనిపోయారని, ఇంటర్నెట్ సేవలను రాష్ట్ర పాలకులు నిలిపివేయడం వల్ల అక్కడ జరుగుతున్న ఆటవిక చర్యలు ప్రపంచానికి తెలియడం లేదని ఆరోపించారు. రెండు నెలలకు పైగా అనేక దుస్సంఘటనలు, హింస, అత్యాచారాలు కొనసా గుతున్న ప్రధాన మంత్రి ఏమి పట్టనట్లుగా వ్యవహరించటం దారుణమన్నారు. వ్యవసాయ, కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బాల మల్లేష్ మాట్లాడుతూ ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు జరిగిన, గిరిజనులను అభద్రత భావానికి గురి చేసిన తాము సహించబోమన్నారు. జాతీయ మహిళా సమాఖ్య కార్యదర్శి డాక్టర్ కూనంనేని రజిని మాట్లాడుతూ కొండ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదపై కార్పొరేట్ కంపెనీలకు పూర్తిస్థాయిలో అవకాశం ఇవ్వాలని, తెగల మధ్య ఈ గొడవలు పాలకులు సృష్టించినవేనని ఆయన అన్నారు.గిరిజన సమాఖ్య నాయకులు అంజయ్య నాయక్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ , రాష్ట్ర రైతు సంఘం నాయకురాలు పరుచూరి జమున తదితరులు మాట్లాడారు.ఈ నిరసన ప్రదర్శనలో మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదాలక్ష్మి, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మారుపాక అనిల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య, విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, శ్రీమన్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభు లింగం, రామకృష్ణారెడ్డి, సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మి గిరిజన సమాఖ్య నాయకురాలు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

**మణిపూర్ ఘటనను సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : రాగల నాగేశ్వరరావు**



నవతెలంగాణ-అడిక్‌మెట్

మణిపూర్ మహిళల పట్ల అత్యంత పాశవికగా జరిగిన హింసాత్మక ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని, దీనిపై సిట్టింగ్ జడ్జితో పూర్తి విచారణ జరిపించాలని ఆల్ ఇండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ అధ్యక్షులు రాగల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం కవాడిగూడ లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేద్కర్ భవన్ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్ బాబు అధ్యక్షతన మణిపూర్ హింసాత్మక ఘటనపై ఏఐఎస్సీఆర్‌పీఎస్ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు నాగేశ్వరరావు రాష్ట్ర అధ్య క్షులు సుదర్శన్‌బాబు హాజరై మాట్లాడుతూ విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు కావాలని, తమని కూడా షెడ్యూల్ ట్రైబ్‌లో చేర్చాలని డిమాండ్‌తో మోహితీవర్గం వారు శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఘటనను సుప్రీంకోర్టు సెట్టింగ్ జడ్జి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి నిందితులను బేషంతుగా ఉరితీయా లని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు వీణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పూనుకోట్ల చంద్రకళ, ప్రధాన కార్యదర్శి మామిడి రేణుక, కోశాధికారి శంకర్, నగర అధ్యక్షులు విజయబాబు, కవిత, తేజశ్రీ, బత్తుల స్వామి సెల్వరాజ్ నాయకులు పాల్గొన్నారు

## అంబర్‌పేటలో మితి మీరిన మజ్లిస్ ఆగడాలు

- బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్.ఎన్.గౌతంరావు



నవతెలంగాణ-అంబర్‌పేట:

అంబర్‌పేట నియోజకవర్గంలో మజ్లీస్ పార్టీ ఆగడాలు మితి మీరిపోయాయని గోల్నాకలో శనివారం జరిగిన ఘటన నిదర్శనమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్.ఎన్.గౌతంరావు అన్నారు. హిందువులపై దాడులు జరుగుతుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం చోద్యం చూస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వ స్టీరింగ్‌ను మజ్లిస్ చేతిలో పెట్టడం వల్లనే హిందువులకు ఈ దుస్థితి వచ్చి ందని ఆయన అన్నారు. గోల్నాక ఘటనకు సంబంధించి దోషులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను కోరారు. బాధితుల పక్షాన బీజేపీ పోరాడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌ఛార్జి బి.వెంకటరెడ్డి, కార్పొరేటర్ వై.అమృత యాదవ్, కన్నే రమేష్ యాదవ్ నాయకులు శ్యామ్ రాజ్, అజయ్ కుమార్, మూల రవీందర్ గౌడ్, దత్తు, నర్సింగ్ రావు, రాజు ముదిరాజ్ సూర్య ప్రకాష్, తదితరు నాయకులు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనను కేంద్ర హెూం శాఖ పట్టించుకోకపోవడం దారుణం



- ఆదివాసి అమ్మాయిలను నగ్నంగా ఊరేగిస్తుంటే కేంద్రం ఏం చేస్తుంది
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ.పాల్
- తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ ఫాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన

నవతెలంగాణ-హిమాయత్ నగర్

మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా భయానక మారణ హెూమం జరుగుతున్నా దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాలు ఏమాత్రం పట్టిం చుకోకపోవడం సిగ్గుచేటని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు, ప్రముఖ క్రైస్తవ మత బోధకుడు కేఏ.పాల్ అన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న మారణ హెూమానికి నిరసనగా తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ ఫాస్టర్స్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో వందలాది మంది క్రైస్తవులు ఆదివారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రధాని మోడీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేఏ.పాల్ మాట్లాడుతూ మణిపూర్ లో ఆదివాసీ అమ్మాయిలను నగ్నంగా చేసి ఊరేగేస్తుంటే కేంద్రం ఏం చేస్తున్నదని ప్రశ్నిం చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని, కేంద్రంలోనూ, తెలం గాణలోనూ చిత్తుచిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. క్రైస్త వులు, ముస్లింలు, హైందవులంతా ఒక్కటేనని స్పష్టం చేశా రు. మణిపూర్‌లో జరిగిన సంఘటనలను చూసి ప్రపంచమంతా నివ్వెరపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అక్కడి బీజేపీ ప్రభుత్వానికి మోడీ వత్తాసు పలుకుతన్నారని అందుకే అక్కడ మారణ హెూమం జరిగిందని, అనేక మంది చనిపోయారని, అమాయకులైన ఆదివాసీ క్రైస్తవులపై దాడులు, లైంగికదాడులు జరుగుతునాశీయన్నారు. ఈ సంఘటనలను అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని, బాధితులను ఆదుకోవాలని కోరారు. అనంతరం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనే సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలకు కారకులైన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సినీ హీరో రాజా, పలువురు పార్టీ నేతలు, పాస్టర్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# యమున మరోసారి ఉగ్రరూపం

## ప్రమాదకరస్థాయి దాటిన నదీ ప్రవాహం • ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు రోడ్లన్నీ జలమయం



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ క్రమంలో దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది ప్రవాహం ఆదివారం మరోసారి ప్రమాదకరస్థాయి (205.81 మీటర్లు)ని దాటింది. ముఖ్యంగా, ఓల్డ్ రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నదిలో నీటిమట్టం శనివారం రాత్రి 10:00 గంటలకు 205.48 మీటర్లుగా నమోదైంది. దీంతో మరోసారి ఢిల్లీలో పలు ప్రాంతాల్లో వరదలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు యమున నీటిమట్టం 206.35 మీటర్లుగా నమోదైంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా హత్నికుండ్ బ్యారేజ్ నుంచి నదిలోకి నీటిని విడుదల చేశారు. దీంతో యమునా నదిలో నీటిమట్టం ప్రమాదకరస్థాయికి చేరుకుంది. ఢిల్లీలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక, పునరావాస కార్యక్రమాలపై ఇది ప్రభావం చూపించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. 'హత్నికుండ్ బ్యారేజ్ నుంచి రెండు లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం వల్ల ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని ఢిల్లీ మంత్రి అతిషీ వెల్లడించారు. గతవారం వర్షాల కారణంగా యమునా నది నీటి మట్టం అత్యధికంగా 208.05 మీటర్లకు చేరింది. గత కొద్ది రోజులుగా నీటి మట్టం 205.02 మీటర్లుగా ఉంది. తాజాగా హత్నికుండ్ బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేయడంతో ఆదివారం ఉదయం 206.07 మీటర్లకు చేరుకుంది. మరోవైపు జులై 25 వరకు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కేంద్ర వాతావరణ అంచనా వేసింది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా సహా యమునా ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలు తలెత్తాయి. వరదల కారణంగా 27,000 మందికి పైగా ప్రజలు తమ ఇండ్లను ఖాళీ చేసినట్టు అధికారులు తెలిపారు. యమునా నదిలో నీటి విడుదల పెరగడంతో గౌతమ్ బుద్ధ నగర్ పరిపాలన హిండోన్ వెంబడి లోతట్టు ప్రాంతాలకు వరద హెచ్చరిక జారీ చేసినట్టు అధికారులు ఆదివారం తెలిపారు.

### మహారాష్ట్రలో..

మహారాష్ట్రలో కొండచరియలు విరిగిపడిన విషాద ఘటనలో మృతుల సంఖ్య 27కు చేరింది. రాస్‌గఢ్ జిల్లాలో కొండ ప్రాంతమైన ఇర్షల్వాడీలో కొండచరియలు విరిగిపడటంతో పెను విషాదం నెలకొంది. ఈ ఘటనలో 81మంది ఆచూకీ ఇంకా లభించలేదు. గల్లంతైన వారి కోసం నాలుగో రోజూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఇతర సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. శనివారం రాత్రి సరిగా వెలుతురు లేకపోవడం, వాతావరణ ప్రతికూలతల నేపథ్యంలో సహాయక చర్యల్ని నిలిపివేసిన అధికారులు.. ఆదివారం ఉదయం మళ్లీ ముమ్మరం చేశారు. అయితే, ఇప్పటివరకు ఎవరినీ గుర్తించలేదని పేర్కొన్నారు.

నాగ్‌పూర్ డివిజన్‌లో వరదలు, మెరుపులతో 10 రోజుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. వేల సంఖ్యలో ఇండ్లు దెబ్బతిన్నాయి. నాగ్‌పూర్, వార్దా, భండారా, గోండియా, చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాలతో కూడిన నాగ్‌పూర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో 875.84 హెక్టార్ల వ్యవసాయ భూమిని వర్షాలు కూడా ప్రభావితం చేశాయి. విదర్భ ప్రాంతంలోని అమరావతి, అకోలా, భండారా, బుల్దానా, చంద్రాపూర్, గడ్చిరోలి, గోండియా, నాగ్‌పూర్, వార్ధా, వాషిం, యావత్మాల్‌లతో కూడిన కొన్ని ప్రాంతాలలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

ఇదిలా ఉండగా, జూలై 22న ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో అనేక చోట్ల భారీ వర్షాలు, మేఘాల పేలుళ్లు సంభవించడంతో చాలా రోడ్లు, ఇళ్లు, దుకాణాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. వర్షాలకు సంబంధించిన ఘటనల్లో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

ఒరిస్సాల్లోని మల్కన్‌గిరి, కోరాపుట్, రాయగడ, గజపతి, గంజాం, కంధమాల్, బౌద్, బోలంగీర్, సోనేపూర్, బర్‌గఢ్, సంబల్‌పూర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.

పంజాబ్‌లోని హెూషియార్‌పూర్‌లో కాలీ బీన్ వాగులో బలమైన ప్రవాహాలకు 51 ఏళ్ల వ్యక్తి కొట్టుకుపోయాడని అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం అలంపూర్ గ్రామానికి చెందిన మొహిందర్ పాల్, కొంతమంది గ్రామస్తులతో కలిసి కాళీ బీన్ వాగు సమీపంలోకి వెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగిందని, ఈ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా ఉప్పొంగుతున్నదని దసూయా స్టేషన్ హౌస్ ఆఫీసర్ బల్విందర్ సింగ్ తెలిపారు.

గుజరాత్‌లో శనివారం దక్షిణ, సౌరాష్ట్ర ప్రాంతాల్లోని అనేక జిల్లాల్లో భారీ వర్షం కురిసింది, డ్యామ్‌లలో నీటి మట్టాలు, పొంగిపొర్లుతున్న నదుల మధ్య పట్టణ ప్రాంతాలు, గ్రామాల్లోవరద లాంటి పరిస్థితి ఏర్పడింది. ఆదివారం ఉదయం 6 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో జునాగఢ్ నగరంలో 241 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీనివల్ల అనేక ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. నీటి ప్రవాహానికి కొన్ని కార్లు కొట్టుకుపోయాయి. పశువుల కళేబరాలు ప్రవహించే నీటిలో కొట్టుకుపోయాయి.

# ఢిల్లీ ఆర్డినెన్స్‌పై బిల్లును అనుమతించొద్దు

**రాజ్యసభ ఛైర్మన్‌కు ఆప్ లేఖ**

**న్యూఢిల్లీ :** ఢిల్లీ పరిపాలనా కార్యకలాపాల నియంత్రణపై కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు సంబంధించిన బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టడానికి అనుమతించవద్దని ఆప్ కోరింది. ఈ మేరకు ఆప్ ఎంపి రాఘవ్ చద్దా ఆదివారం రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌కు లేఖ రాశారు. మే 11న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం ఢిల్లీలోని ప్రభుత్వంలో పనిచేస్తున్న సివిల్ సర్వెంట్లు ప్రజల చేత ఎన్నికైన ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రిమండలికి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అందుకు భిన్నంగా లెఫ్టినెంట్ గవర్నర్‌కు పెత్తనం అప్పగించేలా ఉన్న కేంద్రం ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమని, అందుకు సంబంధించిన బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. పార్లమెంటు చేసే ఏదైనా చట్టం ఆర్టికల్ 239 ఎఎ నిబంధనలకు అనుబంధంగా ఉండాలని, ఆ నిబంధనలకు విరుద్ధమైన ప్రతిపాదిత బిల్లు పార్లమెంటులో చెల్లుబాటు కాదని తెలిపారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతించవద్దని అభ్యర్థిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.



### కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా

# నేడు తెలంగాణ ట్రై క్రీడా వేడుక

## ఏర్పాట్లను పర్యవేక్షించిన శాట్స్ ఛైర్మెన్ డాక్టర్ ఆంజనేయగౌడ్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాష్ట్ర మున్సిపల్, ఐటీ పారిశ్రామిక శాఖ మంత్రి కె.తారకరామారావు పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం నాడు నిర్వహించబోయే తెలంగాణ ట్రై క్రీడావేడుక-2023కు ఏర్పాట్లు పూర్తయ్యాయని శాట్స్ ఛైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ తెలిపారు. ఆదివారం దానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, తెలంగాణ ఆమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో సైక్లింగ్, రోలర్ స్కేటింగ్ మరియు రెజ్లింగ్ (మహిళ) పోటీల ప్రారంభోత్సవానికి హోంమంత్రి మహమూద్ అలీ, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మి, తదితరులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. మనిషికి ఆరోగ్యాన్ని అందజేసే, అతి సామాన్యులకు కూడా అందుబాటులో ఉండే ఏకైక క్రీడాంశం సైక్లింగ్ అనీ, ఆ క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తున్నదని తెలిపారు.

మానవ సమగ్రాభివృద్ధి క్రీడలతో సాధ్యమనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి,దత్తాత్రేయ మోసపాటి, డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, అర్జున అవార్డు గ్రహీత అనూప్ కుమార్ యామ, ఛైర్మెన్ ఓఎస్డీ డాక్టర్ కే.నర్సయ్య, నిర్మల్ సింగ్, జితేందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు

### మాన్‌సూన్ రెగట్టాలో

# ధరణి, మల్లేష్, దీక్షితకు స్వర్ణాలు

**నవతెలంగాణ-హైదరాబాద్**

హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో ఆదివారం ముగిసిన మాన్‌సూన్ రెగట్టా జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలర్లు లావేటి ధరణి, వడ్ల మహేశ్, కొమరవెల్లి దీక్షిత బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. అండర్ 19 ఇంటర్నేషనల్ క్లాస్ మిక్స్‌డ్ విభాగంలో లావేటి ధరణి - వడ్ల మల్లేష్ 17 పాయింట్లతో అగ్రస్థానంతో జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది. మధ్యప్రదేశ్‌కు చెందిన నాన్సీరాయ్-అనిరాజ్, విద్యాన్షి-మనీష్ జంటలు రజతం, కాంస్యం గెలిచాయి. అండర్-15 ఆప్టిమిస్ట్ బాలికల విభాగంలో దీక్షిత 12 రేసుల తర్వాత 57 పాయింట్లతో స్వర్ణం సొంతం చేసుకుంది. షగున్ ఝా (మధ్యప్రదేశ్) రజతం, ఆర్తి వర్మ (సీఈఎస్‌సీ మహారాష్ట్ర) కాంస్యం




గెలిచారు. బాలుర విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఏకలవ్య బాతం చాంపియన్‌గా నిలవగా, ఎన్‌బిఎస్‌సి గోవాకు చెందిన శరణ్య జాదవ్, అజయ్ గజ్జి వరుసగా రజతం, కాంస్యం సాధించారు. ఈ టోర్నీలో తెలంగాణ సెయిలర్లు 7 స్వర్ణాలు సహా మొత్తం 16 పతకాలు సొంతం చేసుకున్నారు.

# నవచిత్రం

## ఎక్స్‌ట్రా..ఆర్డినరీ మ్యాన్

**ని**తిన్ హీరోగా రూపొందుతున్న 32వ చిత్రానికి 'ఎక్స్‌ట్రా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'ఆర్డినరీ మ్యాన్' అనేది ట్యాగ్ లైన్. రైటర్, డైరెక్టర్ వక్కంతం వంశీ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే 60 శాతం చిత్రీకరణను పూర్తి చేసుకుంది. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.



నితిన్

డిఫరెంట్‌గా ఉన్న ఫస్ట్‌లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో నితిన్ రెండు డిఫరెంట్ లుక్స్‌తో కనిపిస్తున్నారు. ఒక దానిలో ఆయన హెయిర్ స్టైల్, గడ్డంతో సీరియస్‌గా కనిపిస్తున్నారు. అదే పోస్టర్‌లో మరో లుక్‌లో గడ్డం లేకుండా చాలా కూల్‌గా కనిపిస్తున్నారు. పోస్టర్ బ్యాగ్రౌండ్‌లో ఓ సన్నివేశానికి సంబంధించిన స్క్రిప్ట్ కనిపిస్తుంది. అలాగే క్లాప్ బోర్డ్ కూడా కనిపిస్తుంది. నితిన్ ఇప్పటి వరకు చేయనటువంటి పాత్రలో ఆకట్టుకోబోతున్నారని, కచ్చితంగా ఆయన అభిమానులనే కాదు, ప్రేక్షకులను కూడా తయన తన బ్రిలియంట్ పెర్ఫామెన్స్‌తో మెప్పించనున్నారని క్లియర్‌గా తెలుస్తోంది. ఈ సినిమాను డిసెంబర్ 23న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

ఈ సందర్భంగా దర్శకుడు వక్కంతం వంశీ మాట్లాడుతూ, 'క్యారెక్టర్ బేస్డ్ స్క్రిప్ట్‌తో 'కిక్' తర్వాత ఆ రేంజ్ జోన్‌లో తెరకెక్కుతోంది. ఇందులో నితిన్ సరికొత్తగా కనిపించబోతున్నారు.ఆడియెన్స్‌కి రోలర్ కోస్టర్‌లాంటి ఎక్స్‌పీరియెన్స్‌నిస్తూ నవ్విస్తూనే సర్‌ప్రైజ్‌లతో సినిమా మెప్పించనుంది' అని చెప్పారు. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యమూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి హరీష్ జైరాజ్ సంగీతం సమకూరుస్తున్నారు.

## పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ కథ

**పో**లీసులు లేని సమాజాన్ని ఊహించలేం. కాని సమాజంలో పోలీసులంటే చిన్నచూపు ఉంది. దానికి కారణం సామాన్యులలో భయమైతే, .రాజకీయనాయకులకు లెక్కలేనితనం.

అయితే చట్టం ఎవరి చుట్టం కాదని.. కర్తవ్యమే ప్రాణం అని నిరూపించిన ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ కథే 'గిద్దలూరు పోలీస్‌స్టేషన్'. శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో హీరో సీహెచ్‌వీ సుమన్ బాబు పోలీస్ ఆఫీసర్‌గా నటించగా, రఘుబాబు, అజయ్ ఘోష్, అదుర్స్ రఘు, గీతాసింగ్, నాగమహేష్, నవీనా రెడ్డి, రామ్, అబ్దుల్, రాఘవ శర్మ తదితరులు ఇతర ముఖ్య తారాగణంగా నటించారు.



సీహెచ్‌వీ సుమన్‌బాబు

'శక్తివంతమైన కథతో రూపొందిన సినిమా ఇది. ఆగస్ట్ 15 ఇండిపెండెన్స్ రోజున ఫస్ట్ గ్లిమ్స్ రిలీజ్ చేస్తాం. డిసెంబరులో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. అలరిస్తూనే ఆలోచించేలా కథాకథనాలు ఉంటాయి' అని దర్శకుడు సీహెచ్‌వీ సుమన్ బాబు చెప్పారు.హైదరాబాద్, అనంతపూర్, కర్ణాటక తదితర ప్రాంతాలలో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: అబ్దుల్ రెహమాన్.

## అందుకే.. ఈ సినిమా నాకు స్పెషల్

**శ్రీ**విష్ణు, రెబ్బా మోనికాజాన్ జంటగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన చిత్రం 'సామజవరగమన'. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకున్న నేపథ్యంలో హీరోయిన్ రెబ్బా మోనికాజాన్ మీడియాతో మాట్లాడుతూ, 'మలయాళంలో చేసిన సినిమాల్లో 'ఫోరెన్సిక్'కి మంచి పేరు వచ్చింది. తెలుగులో రిలీజైన నా తొలి చిత్రం 'సామజవరగమన'. 'బ్రో' సినిమా లుక్ టెస్ట్‌కు వచ్చిన నేను నిర్మాత రాజేష్‌ని కలిశాను. దర్శకుడు రామ్ అబ్బరాజు చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించా. 'బ్రో' వంటి పెద్ద సినిమాలో చేయకపోయినా 'సామజవరగమనా' వంటి మంచి సినిమాలో చేసినందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా నాకు చాలా స్పెషల్. శ్రీ విష్ణు సినిమాతో పరిచయం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నా. అల్లు అర్జున్‌తోపాటు చాలా మంది ప్రముఖులు నేను చేసిన సరయు పాత్రను మెచ్చుకుని, ట్వీట్స్ ద్వారా ప్రశంసించారు. దళపతి విజయ్ సినిమాలో నటించాలనే కోరిక 'బిగిల్' సినిమాతో తీరింది. కథలో ఇంపార్టెన్స్ ఉంటే తెలుగులో కూడా ఎలాంటి పాత్రలైనా చేస్తాను. పవన్ కళ్యాణ్ అంటే చాలా ఇష్టం. ఆయనతో పని చేసే ఛాన్స్ వస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాను' అని తెలిపారు.



రెబ్బా మోనికాజాన్

## విజువల్ వండర్‌గా కంగువ



సూర్య

**హీ**రో సూర్య నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కంగువ'. ఈ చిత్ర టీజర్‌ను ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాను భారీ నిర్మాణ విలువలతో స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ కథానాయిక దిశా పటానీ హీరోయిన్‌గా నటిస్తోంది. చారిత్రక నేపథ్యంతో పాన్ వరల్డ్ మూవీగా మొత్తం పది భాషల్లో డైరెక్టర్ శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా త్రీడీ ఫార్మెట్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ టీజర్‌ని ప్రస్తుతం ఇంగ్లీష్, హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేశారు. మరో నాలుగు భాషల్లో త్వరలోనే టీజర్‌ను తీసుకొస్తామని చిత్ర బృందం తెలిపింది.

రెండు నిమిషాల పాటు సాగిన ఈ టీజర్‌లో విజువల్ గ్రాండియర్, హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్, మెస్మరైజ్ చేసే సూర్య స్క్రీన్ ప్రెజెన్స్ అందర్నీ ఆకట్టుకున్నాయి. దేవి శ్రీ ప్రసాద్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరో ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న ఈ సినిమాను ఒక విజువల్ వండర్‌గా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చేందుకు చిత్ర యూనిట్ శ్రమిస్తోంది. టాప్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల ద్వారా వచ్చే ఏడాది సమ్మర్‌లో ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ఈ చిత్రానికి ఎడిటర్ - నిశాద్ యూసుఫ్, యాక్షన్ - సుప్రీమ్ సుందర్, డైలాగ్స్ - మదన్ కార్కే, డైలాగ్స్ - ఆది నారాయణ, పాటలు - వివేక్, మదన్ కార్కే, కాస్ట్యూమ్ డిజైనర్ - అను వర్ధన్, దష్ట పిళ్లై, కాస్ట్యూమ్స్ - రాజన్, కొరియోగ్రఫీ - శోభి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - ఏ జే రాజా, కో ప్రొడ్యూసర్ - నేహా జ్ఞానవేల్ రాజా, ప్రొడ్యూసర్స్ - కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్.

## 27న బిగ్ సర్‌ప్రైజ్

**చి**రంజీవి నటిస్తున్న తాజా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర భారీ కాన్వాస్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం మేకర్స్ మరో బిగ్ అప్డేట్ ఇచ్చి అటు ప్రేక్షకులను, ఇటు చిరు అభిమానులను సర్‌ప్రైజ్ చేశారు. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను ఈనెల 27న విడుదల చేస్తున్నారు.

'ట్రైలర్‌తో మరో 4 రోజుల్లో మెగా పండగ ప్రారంభం కానుంది. ఇప్పటికే టీజర్, పాటలతో మేకర్స్ కావాల్సినంత వినోదాన్ని అందించారు. ట్రైలర్ రిలీజ్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో చిరంజీవి కత్తి పట్టుకుని ఫెరోషియస్‌గా కనిపిస్తున్నారు. ఈ పోస్టర్ సైతం మెగా అభిమానులను ఫుల్ ఖుషీ చేసింది' అని చిత్ర బృందం పేర్కొంది. తమన్నా భాటియా, కీర్తి సురేష్, సుశాంత్ ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్నారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్, డైలాగ్స్: తిరుపతి మామిడాల.



చిరంజీవి

## రొటీన్‌కి భిన్నమైన చిత్రం

**ఏ**ఎమ్ఎఫ్, కోన సినిమా బ్యానర్లపై అనిల్ మోదుగ, శివ కోన సంయుక్తంగా నిర్మిస్తున్న తాజా చిత్రం 'రాజు గారి కోడిపులావ్'. కుటుంబ కథా 'వి'చిత్రం అనేది ట్యాగ్ లైన్. శివ కోన, ఈటీవీ ప్రభాకర్, నేహా దేశ్ పాండే, కునాల్ కౌశల్, ప్రాచీ కెథర్, రమ్య గిరీష్, అభిలాష్ బండారి తదితరులు నటిస్తున్నారు. శివ కోన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది.



అభిలాష్, నేహా దేశ్‌పాండే

ఈ సందర్భంగా మీడియాతో డైరెక్టర్ శివకోన మాట్లాడుతూ,'ఇది చిన్న బడ్జెట్ సినిమాలా లేదని పెద్ద సినిమాలా ఉందని అందరూ అనటం హ్యాపీగా ఉంది. సినిమాను కచ్చితంగా థియేటర్లోనే ఆగస్టు 4న చూడండి. లేదంటే మీరు ఎంతో మిస్ అవుతారు' అని తెలిపారు. 'డైరెక్టర్ శివ కోనకు విజన్‌తో పాటు, ప్లానింగ్ కూడా అద్భుతంగా ఉంది. కొన్నిసార్లు స్టార్ హెూటల్స్‌లో బిర్యాని తిన్నదానికన్నా మామూలు హెూటల్స్‌లో తిన్న బిర్యాని చాలా రుచిగా బాగుంటుంది. అలాగే 'రాజు గారి కోడి పులావ్' కూడా మీకు నచ్చుతుంది' అని ఈటీవీ ప్రభాకర్ అన్నారు.

హీరో అభిలాష్ మాట్లాడుతూ,'ఈ సినిమా రొటీన్‌గా ఉండదు. చాలా కొత్తగా, మిస్టీరియస్‌గా ఉంటుంది' అని తెలిపారు. రచన సహకారం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన రవి మాట్లాడుతూ,'ప్రేక్షకులను సంతృప్తి పరిచే కంటెంట్ ఇందులో ఉంది. దర్శకుడు శివకోన ఎంతో కష్టపడ్డారు' అని చెప్పారు.

## మిషన్ తషాఫిలో కీలక పాత్ర

**ఓ**టీటీ మాధ్యమం జీ5 రూపొందిస్తున్న వెబ్ సిరీస్ 'మిషన్ తషాఫి'లో తిరువీర్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని జీ 5 అధికారికంగా ప్రకటించింది. ప్రవీణ్ సత్తారు డైరెక్ట్ చేస్తున్న ఈ వెబ్ సిరీస్‌ను ఫిల్మ్ రిపబ్లిక్ బ్యానర్‌పై ప్రణతి రెడ్డి నిర్మిస్తున్నారు. తిరువీర్ బర్త్ డే సందర్భంగా చేసిన ఈ ప్రకటనతో ఈ వెబ్‌సిరీస్‌పై అంచనాలు మరింత పెరిగాయి.


ఇండియాలో భారీ విధ్వంసాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్న ఒక విదేశీ తీవ్రవాద సంస్థకి, ఇండియన్ రా ఏజెంట్స్‌కి మధ్య నడిచే భావోద్వేగమైన హై ఇన్‌టెన్స్ యాక్షన్ స్పై థ్రిల్లర్ ఇది. 8 ఎపిసోడ్స్ ఉన్న ఈ వెబ్ సిరీస్‌ను ఇప్పటి వరకు తెలుగు ఓటీటీలో ఎవరూ నిర్మించని రీతిలో దీన్ని భారీ బడ్జెట్, హై టెక్నికల్ వేల్యూస్‌తో జీ5 రూపొందిస్తోంది. అంతే కాకుండా తొలిసారి విదేశాల్లో చిత్రీకరణ జరుపుకుంటున్న తొలి తెలుగు సిరీస్ కూడా ఇదే. అలాగే ఇంటర్నేషనల్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ నేతృత్వంలో ఫైట్స్‌ను డైరెక్టర్ ప్రవీణ్ సత్తారు చిత్రీకరిస్తున్నారు అని మేకర్స్ అన్నారు.



తిరువీర్







## ఉద్యోగం వదిలి ఉద్యమంలోకి..
# రాష్ట్రం కోసం ఉద్యోగం వదిలిపెట్టిన కేటీఆర్

**• రాజకీయంలో కేటీఆర్ సత్తా • శాసనసభ్యుడిగా, మంత్రిగా..**

నవతెలంగాణ-రత్నాకర్

**తెలంగాణ** అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన కల్వకుంట్ల తారక రామారావు సిరిసిల్లా జిల్లా, బియినపల్లి మండలం, కొదురుపాకలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, శోభ దంపతులకు జన్మించారు. రాజకీయ కుటుంబ నేపథ్యంలో పుట్టిన ఆయన చిన్నప్పటి నుంచి అదే వాతావరణంలో పెరిగారు. కొదురుపాకలో జన్మించనప్పటికీ కేటీఆర్ సిద్ధిపేట, కరీంనగర్, హైదరాబాద్‌లో పెరిగారు. 10ఏండ్లలోనే 7 స్కూళ్లను మార్చారు. అనంతరం ఆయన రెండు పోస్ట్ గ్రాడ్యేయేషన్‌లను పూర్తి చేశారు. తర్వాత న్యూయార్క్ వెళ్లి మార్కెటింగ్ అండ్ ఈకామర్స్‌లో ఎంబీఏ చేశారు. 2001 నుంచి 2006 దాకా ఐటీ ప్రొఫెషనల్‌గా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కోసం 2006లో కేటీఆర్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సమితి(ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరారు. తండ్రి కేసీఆర్ తరఫున ప్రచారంలో పాల్గన్నారు. అప్పుడు కేసీఆర్ కరీంనగర్ లోక్‌సభ నుంచి పోటీ చేసి 2 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కేటీఆర్ క్రీయాశీలక పాత్ర పోషించారు. 2008లో తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు.

### గ్రేటర్ హైదరాబాద్‌లో కేటీఆర్ సత్తా

2016 జీహెచ్ఎంసీ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కేటీఆర్‌ను పార్టీ ఇన్‌చార్జీగా చేశారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ 99 స్థానాల్లో గెలిచింది. అంతకుముందు, 2014లో హైదరాబాద్, పరిసరాల్లోని 24 అసెంబ్లీ స్థానాల్లో టీఆర్ఎస్ రెండు స్థానాల్లోనే గెలిచింది. అయినా కానీ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కేటీఆర్ పార్టీ ఇన్‌ఛార్జిగా సత్తాచాటారు. అప్పటి నుంచి కేటీఆర్ పార్టీని ముందుండి నడిపించారు.

### శాసన సభ్యుడిగా, మంత్రిగా

కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గం నుండి ఎన్నికైన శాసనసభ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2009 నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. 2014లో తొలిసారి ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఐటీ, వాణిజ్య శాఖ, గనులు, ప్రజా వ్యవహారాలు, పంచాయతీరాజ్, ప్రవాసుల శాఖ మంత్రిగా క్యాబినెట్ మంత్రి హెూదాలో పనిచేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రిగా అనుభవముంది. 2018 డిసెంబరు 17న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు.



### తండ్రికి తగ్గ తనయుడు...

తండ్రికి తగ్గ తనయుడు... ఈ మాట కేటీఆర్‌కు అతికినట్లు సరిపోతుంది. పార్టీలో సాధారణ కార్యకర్తలా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. పద్మవ్యూహాల్లాంటి సమస్యలను దాటుకుంటూ ప్రజల మనసు గెలుచుకున్నారు. నిజానికి ఎన్నికలూ, ప్రచారాలూ, ఎమ్మెల్యే పదవులూ, మంత్రిగా బాధ్యతల్లాంటివి తాను కల్లో కూడా ఊహించలేదని స్వయంగా కేటీఆర్ పలు సందర్భాల్లో చెప్పారు.

### దాక్టర్‌గా చూడాలని అమ్మా.... సివిల్ సర్వెంట్‌గా చూడాలని నాన్నా....

కేటీఆర్‌కు చదువులో మంచి మార్కులే వచ్చేవి. అల్లరి కూడా తక్కువే. ఇతర సబ్జెక్టులతో పోలిస్తే లెక్కల్లో కాస్త వెనకబడేవారు. పదో తరగతిలో ఉన్నప్పుడు భవిష్యత్తులో ఇంక ఆ సబ్జెక్టు జోలికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. ఇలావుండగా కేటీఆర్ వాళ్ళ అమ్మకు కేటీఆర్‌ను డాక్టర్‌గా చూడాలని ఉండేది, తండ్రి కేసీఆర్‌కు మాత్రం కేటీఆర్‌ను సివిల్ సర్వెంట్‌గా చూడాలని కోరుకునేవారు. అయితే తండ్రి కేసీఆర్‌కు నేరుగా ఆ విషయం చెప్పలేక ఓ రోజు అబిడ్స్ వెళ్లి హెచ్ఈసీ, సీఈసీకి సంబంధించిన పుస్తకాలను తీసుకొచ్చి కేసీఆర్‌కు కనిపించేలా షెల్ఫ్‌లో పెట్టారు. అప్పుడు కేసీఆర్‌కు అర్థమై ఒత్తిడి చేయలేదు. ఇదిలావుండగా 2009 ఎన్నికల్లో తొలిసారి సిరిసిల్ల ఎమ్మెల్యే బరిలోదిగి తొలిప్రయత్నంలో స్వల్ప మెజారిటీతోనే విజయం దక్కింది. కేసీఆర్ కొడుకన్న బ్రాండ్ ఇమేజ్‌ను పక్కనబెట్టి కష్టపడి పనిచేయడం మొదలుపెట్టారు. దాని ఫలితం తరవాతి ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ప్రస్తుతం కేటీఆర్‌గా బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించారు.

### దేశంలో ఎక్కడాలేని విధంగా టీ-హబ్

మంత్రి కే.తారకరామారావు సారథ్యంలో జలమండలి, జీహెచ్ఎంసీ, ఐటీతోపాటు అన్ని రంగాలు తొమ్మిదేండ్లలోనే ఎంతో పురోగతి సాధించాయి. ముఖ్యంగా దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఐటీ రంగంలో హైదరాబాద్ దూసుకుపోతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో ఐటీ రంగంలో 3 లక్షల 23 వేల 396 ఉద్యోగాలుంటే ఇప్పుడు ఆ సంఖ్య 9 లక్షల 5 వేల 715కు చేరుకుంది. ఐటీలో ముంబాయ్, బెంగళూరుతో పోటీపడేలా హైదరాబాద్ నిలబడింది. దేశంలోనే పెట్టుబడులకు గమ్యస్థానంగా దూసుకుపోతోంది. తొమ్మిదేండ్లలోనే ఐటీ ఎగుమతుల్లో రికార్డుస్థాయిలో 31.44% వృద్ధిని సాధించింది. ఐటీ ఎగుమతుల్లో హైదరాబాద్ జాతీయ సగటు కంటే మూడున్నర రెట్లు ఎక్కువ వృద్ధి సాధించింది. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ కేంద్రంగా టీ హబ్-2 అవతరించింది. దేశంలో ఎక్కడాలేని విధంగా టీ-హబ్ 5,82,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు.

### జలమండలి-జీహెచ్ఎంసీ..

- హైదరాబాద్‌లో మురుగు నీటి శుద్ధి కోసం చేసిన ప్రణాళికలు విడతల వారీగా అందుబాటులోకి వస్తున్నాయి. కోకాపేటలో 15 ఎంఎల్డీల సామర్థ్యంతో, రూ॥ 41 కోట్ల వ్యయంతో నిర్మించిన మొదటి ఎస్టీపీ ప్రారంభంతో హైదరాబాద్ దేశంలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే తొలి నగరంగా అవతరించింది. రూ.3866 కోట్లతో 1259 ఎమ్మెల్డిల సామర్థ్యంతో మొత్తం కొత్తగా 31 ఎస్టీపీలు శ్రీకారం చుట్టిందని, అన్నీ ఎస్టీపీలను సెప్టెంబర్ చివరినాటికి హైదరాబాద్‌లో 100 శాతం మురుగును శుద్ధి చేస్తామని ధీమాతో ప్రభుత్వం ఉంది.
- జీహెచ్ఎంసీ పరిధిలో 11 లక్షల కుటుంబాలకు నెలకు 20 వేల లీటర్ల వరకు ఉచిత తాగు నీరు అందిస్తున్నారు.
- వరసగా కరువచ్చినా 50ఏండ్లకు సరిపడే విధంగా తాగునీటి అందించేందుకు ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు.
- ప్రజా సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించేందుకు వార్డు వ్యవస్థను నగర వ్యాప్తంగా 150 డివిజన్లలో ప్రారంభించారు.






























Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

# డెడ్ స్టోరేజ్‌లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు

**517 అడుగులకు పడిపోయిన నీటి మట్టం ● గతేడాది 530 అడుగులకుపైగా నీరు ● నేటికీ ఎగువ నుంచి రాని వరద**



## దుక్కులు దున్ని.. నార్లు పోసుకొని రైతుల ఎదురుచూపు

- ఏటా 2 నుంచి 3 టీఎంసీలు తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం

**నవతెలంగాణ- నాగార్జునసాగర్**

సాగర్ నుంచి ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేసే అవకాశాలు ఇప్పట్లో కానరావడం లేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కనీస నీటి మట్టానికి చేరువలో ఉంది. గతేడాది జులై 20న 530 అడుగులకు పైగా నీరు నిల్వ ఉండటంతో సాగునీటికి ఎలాంటి ఢోకా లేదు. గతేడాది జులై 20న శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 55 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం పై నుంచి వరద లేక.. సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 517 అడుగుల వద్ద ఉన్నది. ఇది 144.0402 టీఎంసీలకు సమానం. జలాశయం గరిష్టస్థాయి నీటిమట్టం 510 అడుగులు కాగా, 7అడుగులు తగ్గితే డెడ్ స్టోరేజ్‌కి వెళ్తుంది. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాల్లేకపోవడంతో కృష్ణానది పరివాహక ప్రాజెక్టులైన ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టుల్లో సైతం నీటిమట్టం పడిపోయింది.

నాగార్జునసాగర్ ఎడమకాలువ రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు నార్లు చల్లుకున్నారు. బోర్లు, బావుల కింద ఉన్న రైతులు ముందస్తుగానే నార్లు పోసుకొని నాటుకు సిద్ధమవుతున్నారు.

కాగా ఏ ఆధారం లేని రైతులు సాగర్ కాల్వల నీరు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 23 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీనితోపాటు హైదరాబాద్ జంట నగరాలకు తాగునీటి అవసరాలు కూడా తీర్చుతోంది. అలాంటిది ఇప్పుడు డెడ్ స్టోరేజ్‌కు చేరువకావడం ఆందోళన కలిగిస్తోంది.

**గతేడాది జులై 20న ప్రాజెక్టుకు వరద**

గతేడాది భారీ వర్షాల కారణంగా జులై 20వ తేదీన శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 55 వేల క్యూసెక్కుల వరద నీరు నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లోకి వచ్చి చేరింది. అదే నెల 28వ తేదీన ఎడమ కాల్వకు మంత్రి జగదీశ్ రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది జులై గడుస్తున్నా సరైన వర్షాల్లేక.. నీటి నిల్వలు అడుగంటిపోయాయి. గట్టి వానలు పడి కృష్ణానది ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వస్తేనే జలాశయంలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. అప్పటిదాకా సాగర్ ఆయకట్టు కాలువలకు నీరు విడుదల చేసే పరిస్థితి లేదు. దీంతో వానాకాలం సాగు ఆలస్యం అవుతున్నది. జులై మొదటి వారంలో యేటా వరి నారు పోసుకొని ఆగస్టులో నాట్లు వేసేవారు. ఈసారి ఆ పరిస్థితి లేదు. మరోవైపు ఇక్కడ వరి సాగు తప్ప మెట్ట పంటలు పండే పరిస్థితి లేదు.

రైతులు ఇప్పటికే దుక్కులు దున్ని పొలాలను చదును చేసి పెట్టుకొని నీటి కోసం ఎదురుచూస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ పరిధిలో మొత్తం 6.50లక్షల ఎకరాలు ఉండగా.. అందులో నల్లగొండ జిల్లాలో 1,45,727 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 1,45,727 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో ఎత్తిపోతలతో కలుపుకుని 2,41,000 వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉంది.

**కొనసాగుతున్న స్పిల్‌వే పనులు**

ప్రాజెక్టు స్పిల్‌వే దశాబ్దకాలంగా మరమ్మతులకు గురవుతోంది. దీంతో నాలుగు నెలలుగా గుత్తేదారులు చేపడుతున్న పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జులై చివరి నాటికి స్పిల్ వే పనులను పూర్తి చేస్తామన్న అధికారులు చేయించలేకపోయారు. శుక్రవారం నుంచి 8వ రేడియటల్ క్రస్ట్ గేట్ వద్ద పడిన గుంతలను పూడుస్తున్నారు. కొన్ని క్రస్ట్ గేట్ల వద్ద పెద్ద, పెద్ద గుంతలు అలాగే ఉన్నాయి. చుట్టుపక్కల గ్రామాల్లో కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వడంతో స్పిల్ వే పనులకు కూలీలు దొరక్క కొంత జాప్యం జరుగుతోంది.

**ఏటేటా తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం**

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఏటేటా పూడిక పేరుకుపోయి రెండు నుంచి మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. పూడికపై మేధావులు, నిపుణులు హెచ్చరిస్తున్నా పాలకులు కనీసం పట్టించుకోవడం లేదు. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 408 టీఎంసీలు కలిగిన ప్రాజెక్టు నేడు 300 టీఎంసీల నీటి నిల్వకే పరిమితమైంది.

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం పడిపోతోందని ఇప్పటికే నిపుణులు నిర్ధారించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉండగానే 2010లో ఏపీ ఇంజినీర్స్ లేబోరేటరీ ఆధ్వర్యంలో సర్వే చేశారు. అప్పట్లో శాటిలైట్ ద్వారా ఈ పరిశీలన చేశారు. ఆ సర్వే రిపోర్ట్ ప్రకారం కేవలం 312 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకోగలుగుతున్నట్టు నిర్ధారించారు. సుమారుగా 100 టీఎంసీల వరకూ నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని ధృవీకరించారు. ఏటా పూడిక వల్ల 2 నుంచి 3 టీఎంసీల వరకూ నీటి నిల్వ తగ్గిపోతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. రిజర్వాయర్ పరిసరాల్లో కూడా మట్టి పేరుకుపోతున్న తరుణంలో డ్యామ్, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు నష్టం వస్తుందని, తగిన సాంకేతికత ఉపయోగించి పూడిక తగ్గించేందుకు ప్రయత్నించాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.



## 'భీముని పాదం' వద్ద సందర్శకుల సందడి

**నవతెలంగాణ-గూడూరు**

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో భీమునిపాదం జలపాతం పరవళ్లు తొక్కుతోంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం గ్రామపం చాయతీ కొమ్ముల‌వంచ అటవీ ప్రాంతంలో ఉన్న భీముని పాదం జలపాతం వద్ద ఆదివారం సందర్శకుల సందడితో కిక్కిరి సింది. జిల్లాతోపాటు సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు. కాగా జలపాతం వద్ద ఎలాంటి ప్రమాదాలు సంఘటనలు జరగకుండా అటవీశాఖ ఆధ్వర్యంలో సిబ్బందిని ఏర్పాటు చేశారు.

## జీపీల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా..?

- కొత్తగూడెంలో సమ్మెకు మద్దతు తెలిపిన.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- కొనసాగుతున్న.. పంచాయతీ కార్మికుల సమ్మె

**నవతెలంగాణ-విలేకరులు**

పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఆదివారం పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని జీపీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాపితంగా సమ్మె చేస్తున్నారని, కార్మికుల సమ్మె ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేస్తూ వారి సహనాన్ని పరీక్షించొద్దని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలు జరిపి వారి డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండల కేంద్రంలో కార్మికులు వంటావార్పు నిర్వహించారు. అశ్వారావుపేటలో స్థానిక మూడు రోడ్ల కూడలిలో చెవిలో పువ్వు.. చేతిలో చిప్పతో.. కార్మికులు నిరసన తెలిపారు. చంద్రుగొండలో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. సారపాకలో సీఐటీయూ జిల్లా ఉపధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి సంఘీభావం తెలిపారు. మణుగూరు గ్రామపంచాయతీ కార్మికులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట కార్మికులు ఆందోళనకు దిగారు. మంచాల, కందుకూరు, షాబాద్, వికారాబాద్, పరిగి మండలాల్లో చేపట్టిన సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

యాదాద్రిభువనగిరి జిల్లాలో ఆలేరు, మోటకొండూరు మండలాల్లో జీపీ కార్మికులు సమ్మె నిర్వహించారు. భువనగిరి మండలంలో సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలకేంద్రంలో జీపీ కార్మికులు సమ్మె నిర్వహించారు. నల్లగొండ జిల్లా చండూర్, మర్రిగూడ, కట్టంగూరు, కేతేపల్లిలో సమ్మె కొనసాగింది. నాంపల్లిలో మోకాళ్లపై కూర్చోని నిరసన తెలిపారు.

## మైనార్టీలకు లక్ష రూపాయల జీవో పట్ల బోయినపల్లి హర్షం

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు రూ. లక్ష ఆర్థిక సహాయం చేస్తూ జీవో ఇవ్వడం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మైనార్టీ సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. ఆదివారం ఈమేరకు పలువురు మైనార్టీ నేతలు ఫిరోజ్ ఖాన్, ఫైజల్ ఖాన్, ఫసిఖాన్, అయాన్ ఖాన్, అక్బర్, జాఫర్ పటేల్, సాజిద్, తదితరులు ఆయనకు కతజ్ఞతలు తెలిపారు.

**చదువుల తల్లులకు 'గిఫ్ట్ ఏ స్మైల్'**
**తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్**

పేదరికంతో చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్న ఇద్దరు విద్యార్థినీలకు 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా ఆర్థిక సాయం చేసినట్టు తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పేద విద్యార్థినీలకు చెక్కులు అందజేసినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంజీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ చదువుతున్న కొమ్ము కిష్టయ్య కుమార్తె సుమలికి, మీర్‌పేట్ టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న మల్లెపాక రాములు కుమార్తె శ్వేతకు చెరో లక్ష రూపాయల చొప్పున ఆయన ఆర్థిక సాయం అందజేశారు.

## స్వాతంత్ర్య సమరయోధుడి భార్య సజీవ దహనం

### మణిపూర్‌లో వెలుగుచూసిన మరో ఘాతుకం



ఇంఫాల్ : సంఘ్ పరివార్ మతోన్మాద విద్వేష భావజాలం తలకెక్కిన మానవ మృగాల మారణకాండలో స్వాతంత్ర్య సమరయోధుడి సతీమణి సజీవ దహనమైన హృదయవిదారక ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. మణిపూర్ కాక్చింగ్ జిల్లా సెరౌ గ్రామంలో నివాసముంటున్న స్వాతంత్ర్య సమరయోధుడు ఎస్ చురచంద్ సింగ్ భార్య ఇబెటోంబి (80)ని దుండగులు సజీవ దహనం చేశారు. ఈ ఘటన మే 28 తెల్లవారుజామున జరిగింది. అదే రోజు గ్రామంలో భారీ హింసాత్మక ఘటనలతోపాటు కాల్పులు కూడా జరిగాయి.

80 ఏళ్ల ఇబెటోంబి ఇంట్లో ఉండగా.. సాయుధ దుండగులు ఆ ఇంటి బయట గడియ పెట్టి, నిప్పుపెట్టారు. ఆమెను రక్షించేందుకు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొనేసరికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. మరోవైపు తూటాలతో కాల్పులు జరిపారు. ఈ విషయాన్ని ఇబెటోంబి మనవడు 22 ఏళ్ల ప్రేమ్‌కాంత్ వెల్లడించారు. ఆ దారుణం నుంచి తాను తృటిలో తప్పించుకున్నానని చెప్పారు. తన అమ్మమ్మను రక్షించడానికి ప్రయత్నించినప్పుడు బుల్లెట్లు తన చేయి, కాలు నుంచి దూసుకుపోయినట్లు తెలిపారు. "మాపై కాల్పులు జరగడాన్ని గమనించిన మా అమ్మమ్మ ముందు అక్కడి నుండి పరుగెత్తి వెళ్లిపొమ్మని చెప్పింది. కొంత సమయం తర్వాత తన కోసం తిరిగి రావాలని చెప్పింది. అవే ఆమె చివరి మాటలు" అని భావోద్వేగంతో మీడియాకు వివరించారు. తమ తాతయ్య చురచంద్ సింగ్‌ని అప్పటి రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్‌కలామ్ ఘనంగా సత్కరించిన ఫొటో తన అమ్మమ్మకి అత్యంత ఇష్టమైనదంటూ ఆ ఫొటో మీడియాకు చూపిస్తూ, కన్నీటి పర్యంతమయ్యారు. తన శరీరంపై బుల్లెట్ గాయాలను ప్రేమ్‌కాంత్ మీడియాకు చూపించారు.

నాడు సుందర గ్రామం.. నేడు శ్మశాన గ్రామం...

మే 3న హింస ప్రారంభంకావడానికి ముందు, ఇంఫాల్‌కు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుందరమైన గ్రామం సెరౌ. ఇప్పుడు అగ్నికి ఆహుతైన నివాసాలు, గోడలపై బుల్లెట్ రంధ్రాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు వ్యాపారాలతో కళకళలాడిన ఆ గ్రామం శ్మశాన వైరాగ్యంతో నిశ్శబ్దంగా మారింది. మెయితీ - కుకీ ఘర్షణల్లో అత్యంత దారుణంగా దెబ్బతిన్న గ్రామాల్లో ఇది ఒకటి. ఇబెటోంబి శరీర అవశేషాలను సేకరించే సమయంలో తీసిన వీడియోను ఎన్‌డి టివి చూసింది. ఆమె మంచం ఉన్న ప్రదేశం చుట్టూ పుర్రె, శిథిలాలలో కాలిన ఎముకలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కాల్పుల నుంచి ప్రాణాలు దక్కించుకునేందుకు ఆ గ్రామ ప్రజలు పారిపోయారు. మరో సెరో నివాసి, ఇబెటోంబి కోడలు ఎస్.తమ్‌పక్సానా మాట్లాడుతూ 'సాయుధ మూక దాడులకు పాల్పడుతుండటంతో మే 28వ తేదీ తెల్లవారుజామున 2.10 గంటల సమయంలో మేము భయపడి పారిపోయాం. అదే సమయంలో మా అత్తగారు ఇబెటోంబిని కూడా రావాలని పట్టుబట్టాం. ముందు మీరు భద్రంగా వెళ్లండి. ఆ తరువాత రక్షించేందుకు ఎవరైనా ఒకరిని పంపండి. అని ఆమె చెప్పారు.

దీంతో మేము వెళ్లి స్థానిక ఎమ్మెల్యే వద్ద ఆశ్రయం పొందాం. తెల్లవారుజామున 5.30-6 గంటలకు మా అబ్బాయిలు వెళ్లేటప్పటికి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఆమె సజీవ దహనమైపోయారు' అని చెప్పారు. హింసాకాండలో తమ ఆత్మీయులని కోల్పోయిన కుటుంబాలు, తమ కళ్ల ముందు జరిగిన ఘోరాల నుంచి కోలుకోలేకపోతున్నారు. ఇప్పటికీ తమ నివాసాలకు తిరిగి వెళ్లాలంటేనే గ్రామస్తులు భయపడిపోతున్నారు.

## బీరేన్‌సింగ్ రాజీనామా చేయాలి

- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఘోర హింసాకాండను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైన సిఎం ఎన్.బీరేన్‌సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఐద్వా ఆధ్వర్యాన మహిళలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జార్ఖండ్ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం, వివిధ ప్రజాసంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు చేశాయి. బీరేన్‌సింగ్ దిష్టిబొమ్మలను తగలబెట్టాయి. మహారాష్ట్రలోని మరోల్ తదితర ప్రాంతాల్లో సిపిఎం, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు.

**ప్రధాని దేశానికి క్షమాపణ చెప్పాలి**
**సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు కెకె శైలజ**

ఆడపిల్లలను వీధుల్లో ఊరేగించి సామూహిక అత్యాచారం చేసి చంపే దేశంగా భారతదేశం దిగజారిపోయిందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు కెకె శైలజ విమర్శించారు. మహిళలు, బాలికల గౌరవాన్ని కాపాడడంలో విఫలమైనందుకు ప్రధాని జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అల్లర్లకు సహకరిస్తున్న మణిపూర్ ముఖ్యమంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు, మణిపూర్‌లో జరిగిన సామూహిక అత్యాచారం, హత్యకు వ్యతిరేకంగా తలస్సేరిలో మహిళా అసోసియేషన్ జిల్లా కమిటీ నిర్వహించిన నిరసన ర్యాలీని ఆమె ప్రారంభించారు. మణిపూర్ కాలిపోతుంటే మోడీ విదేశాల్లో పర్యటిస్తున్నారని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడి భార్యను ఆమె ఇంట్లోనే కాల్చివేసి, కార్గిల్ యుద్ధ సైనికుడి భార్యను వివస్త్రను చేశారని విమర్శించారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం మహిళల, యువతుల గౌరవాన్ని కాపాడలేకపోయిందని అన్నారు. ఇంటర్నెట్‌ను నిలిపివేయడం ద్వారా మణిపూర్‌లో ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలియకూడదని మోడీ భావించారని చెప్పారు.

## మహిళలే గూండాలకు అప్పగించారు

### 18 ఏండ్ల బాలికపై సామూహిక లైంగికదాడి కేసు

- ఫిర్యాదులో పేర్కొన్న బాధిత బాలిక

ఇంఫాల్, న్యూఢిల్లీ : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. ఈ దారుణాలు వెలుగు చూస్తున్న కొద్దీ ఇందులో వెల్లడవుతున్న వాస్తవాలు నివ్వెరపరుస్తున్నాయి. మే 15న ఇంఫాల్ ఈస్ట్‌లో 18 ఏండ్ల బాలికను అపహరించి, దాడి, గ్యాంగ్‌రేప్ చేసిన ఘటనపై ఈ నెల 21న జీరో ఎఫ్ఐఆర్ నమోదయింది. ఈ ఎఫ్ఐఆర్ ప్రకారం కొంతమంది మహిళల గుంపే ఈ బాలికను సాయుధ గూండాలకు అప్పగించింది. మే 15న ఆ ప్రాంతంలో కవాతు చేసుకుంటూ వెళుతున్న మెతేలకు చెందిన 'మైరా పైబీస్' అనే మహిళల బృందం (దీనిని మదర్స్ ఆఫ్ మణిపూర్‌గా పిలుస్తారు) ముందుగా ఈ బాలికను గుర్తించింది. నలుగురు సభ్యులు ఉన్న సాయుధ గూండాల గ్రూపునకు బాలికను అప్పగించింది. తరువాత గ్యాంప్‌రేప్‌కు గురైన బాలిక తీవ్రగాయాలతో సమీప రాష్ట్రం నాగాలాండ్‌లో ఒక ఆసుపత్రిలో చేర్చబడింది. ఈ నెల 21న శుక్రవారం కాంగ్పోక్పి పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుతో వివిధ సెక్షన్ల కింద జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. తరువాత ఈ కేసును ఇంఫాల్ ఈస్ట్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మే 4న మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన నేపథ్యంలో ఈ బాలిక తనపై జరిగిన ఘోరాన్ని ఫిర్యాదు చేయడానికి ముందుకు వచ్చింది.

**పోలీసులపై నమ్మకం లేక..**

మే 15న సాయంత్రం 5 గంటల సమయంలో తనను నలుగురు సాయుధ వ్యక్తులు కారులో అపహరించారని 18 ఏళ్ల బాలిక ఫిర్యాదులో పేర్కొంది. కారులోనే తీవ్రంగా కొట్టుకుంటూ ఒక కొండ ప్రాంతం వద్దకు తీసుకుని వెళ్లి వారిలో ముగ్గురు తనపై అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపింది. తరువాత కూడా తీవ్రంగా కొట్టారని, తనను చంపడానికే నిర్ణయించుకున్నారని ఫిర్యాదులో వెల్లడించింది. సురక్షితమైన ప్రదేశంలో చంపడానికి, తనను మళ్లీ కారులో ఎక్కించుకుని తీసుకుని వెళ్లడానికి ప్రయత్నిస్తుంటే కారు తగిలి కొండ కిందకు తాను పడిపోవడంతో వారు వెళ్లిపోయారని తెలిపింది. తరువాత తాను రోడ్డు వద్దకు చేరకుని ఒక ఆటో డ్రైవర్‌ను సహాయం కోరానని, తనను కూరగాయల కుప్ప కింద దాచి బిష్ణుపూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లాడని అయితే పోలీసులపై నమ్మకం లేక న్యూ లంబులనే ప్రాంతంలో దింపమని డ్రైవర్‌ను వేడుకున్నట్లు తెలిపింది. తరువాత రోజు ఉదయం మే 16 ఉదయం 4:30 గంటలకు ఇంఫాల్ చేరుకున్నానని, అక్కడి నుంచి కాంగ్పోక్పి జిల్లా ఆసుపత్రికి వెళ్లానని, కానీ నా పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ సిబ్బంది నన్ను నాగాలాండ్‌లోని కోహిమా ఆసుపత్రికి తరలించారని తెలిపింది.

## ఫ్లెక్సీలు కడుతూ.. హీరో సూర్య అభిమానులు మృతి

నవతెలంగాణ-హైదరాబాద్ : స్టార్ హీరో సూర్యకు ఊహించని షాక్ తగిలింది. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం మోపువారిపాలెంలో విషాదం నెలకొంది. స్టార్ హీరో సూర్య పుట్టినరోజు సందర్భంగా ఫ్లెక్సీలు కడతుండగా కరెంట్ షాక్ కొట్టి ఇద్దరు యువకులు చనిపోయారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. డిగ్రీ సెకండ్ ఇయర్ విద్యార్థులు నక్క వెంకటేష్, పోలూరు సాయి అక్కడికక్కడే మరణించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శివ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న చిత్రం 'కంగువ'. ఇవాళ సూర్య పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ గ్లింప్స్ ను యూనిట్ విడుదల చేసింది. దీనిలో సూర్య సరికొత్త పాత్రలో కనిపించారు. పది భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. స్టూడియో గ్రీన్, యువి క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. దిశా పటాని ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది.

## మధ్యప్రదేశ్‌లో మరో దారుణం..

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో దారుణాలకు అంతూపొంతూ లేకుండా పోతోంది. పొరపాటున తనను తాకిన ఓ దళితుడి ముఖం, శరీరంపై మానవ విసర్జితాలను చల్లాడో వ్యక్తి. చత్తర్‌పూర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన మరోమారు చర్చనీయాంశమైంది. నిందితుడు రామ్‌కపాల్ పటేల్ ప్రస్తుతం తమ అదుపులో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. తనపై జరిగిన దారుణంపై బాధితుడు దశరథ్ అహిర్వార్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుకౌరా గ్రామంలో పంచాయతీ కోసం శుక్రవారం డ్రెయిన్‌ను నిర్మిస్తున్నప్పుడు పొరపాటున గ్రీజుతో ఉన్న తన చేయి నిందితుడికి తాకినట్టు ఆయన పేర్కొన్నాడు. ఆ వెంటనే ఆగ్రహంతో ఊగిపోయిన పటేల్ సమీపంలో పడి వున్న మానవ వ్యర్థాలను మగ్గులో తీసుకొచ్చి ముఖంపైనా, శరీరంపైనా పోసినట్టు ఆరోపించాడు. అంతేకాకుండా కులం పేరుతో దూషించినట్టు తెలిపాడు.

## ఇద్దరు కాశ్మీరీ రచయితల రచనలు ఔట్

- రెండు ప్రముఖ కాశ్మీర్ విశ్వవిద్యాలయాల తీరు
- ఎలాంటి వివరణా లేకుండానే తొలగింపులు

శ్రీనగర్: విమర్శకుల ప్రశంసలు పొందిన ఇద్దరు కాశ్మీరీ రచయితల రచనలను కాశ్మీర్‌లోని రెండు ప్రముఖ విశ్వవిద్యాలయాలు వివరణ లేకుండా పాఠ్యాంశాల నుంచి తొలగించాయి. లోయలోని ప్రధాన ఉన్న విద్యా సంస్థగా ఉన్న యూనివర్శిటీ ఆఫ్ కాశ్మీర్ (యూఓకే) ఆంగ్లంలో పోస్ట్-గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ పాఠ్యాంశాల నుంచి రచయిత, పాత్రికేయుడు బషరత్ పీర్ జ్ఞాపకాలతో పాటు కాశ్మీరీ-అమెరికన్ కవి అఘా షాహిద్ అలీ మూడు కవితలను తొలగించింది.

షాహిద్ ప్రసిద్ధ పద్యాలు 'పోస్ట్‌కార్డ్ ఫ్రమ్ కాశ్మీర్', 'ఇన్ అరబిక్', 'ది లాస్ట్ సఫ్రాన్', పీర్‌కు చెందిన 'కర్ఫ్యూడ్ నైట్' విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ ఆఫ్ ఆర్ట్స్ (ఇంగ్లీష్) కోర్సు యొక్క మూడో సెమిస్టర్‌లో బోధించబడ్డాయి. అయితే, ఈ ఏడాది నుంచి ఇవి పాఠ్యాంశాల్లో భాగంగా ఉండవని విశ్వవిద్యాలయానికి చెందిన వర్గాలు తెలిపాయి. మార్చిన సిలబస్ త్వరలో అందుబాటులోకి వస్తుందని వెల్లడించాయి. అయితే, ఈ తొలగింపులపై యూఓకే వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నీలోఫర్ ఖాన్ నుంచి సరైన స్పందన రాకపోవటం గమనార్హం.

ఇక, షాహిద్ రెండు కవితలు, 'ఐ సీ కాశ్మీర్ ఫ్రమ్ న్యూ ఢిల్లీ ఎట్ మిడ్‌నైట్', 'కాల్ మి ఇస్మాయిల్ టునైట్' అనే రెండు కవితలను నిలిపివేయాలని క్లస్టర్ యూనివర్సిటీ శ్రీనగర్ (సీయూఎస్) అధికారులు తెలిపారు. అయితే, ఈ తొలగింపులపై ఎలాంటి అధికారిక వివరణా లేకపోవటం గమనార్హం. వర్సిటీ యంత్రాంగాల తీరును విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు తప్పుబడుతున్నారు. ఎలాంటి కారణాలు లేకుండానే ఇలాంటి చర్యలకు దిగటం ఏ మాత్రమూ సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలు సమాజంలో ప్రతికూల సందేశాన్ని తీసుకెళ్తాయని హెచ్చరిస్తున్నారు.

## మణిపూర్‌లో హింసాకాండతో

- మిజోరంలో మెయితేల భయాందోళనలు
- రాష్ట్రం విడిచి వెళ్లడానికి యత్నాలు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసాకాండ మిజోరంలో నివసిస్తున్న మెయితేల గ్రూపు ప్రజల్లో భయాందోళనలను కలిగిస్తుంది. దీంతో మిజోరం రాష్ట్రం విడిచివెళ్లాని వీరు భావిస్తున్నారు. అందకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మిజో నేషనల్ ఫ్రంట్ మిలిటెంట్స్‌కు చెందిన పీస్ అకార్డ్ ఎంఎన్ఎఫ్ రీటర్నీస్ అసోసియేషన్ (పిఎఎంఆర్ఎ) ఈ నెల 21న ఒక ప్రకటన విడుదల చేసిన దగ్గర నుంచి ఈ ఆందోళనలు ఎక్కువయ్యాయి. మిజోరంలో నివసిస్తున్న మెయితేలు తమ భద్రత కోసం రాష్ట్రం విడిచి వెళ్లాలని పిఎఎంఆర్ఎ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. మిజోరం రాష్ట్రం నుంచి మెయితేలను తీసుకునిరావడానికి ఛార్టెడ్ విమానాలు ఏర్పాటు చేస్తామని మణిపూర్ ప్రభుత్వం చెబుతోంది. అయితే మరోవైపు మిజోరంలో మెయితేల భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని మిజోరం రాష్ట్ర హోం శాఖ ప్రకటించింది. శాంతిభద్రతలు కాపాడ్డం కోసం ముందు జాగ్రత్తగా మిజోరం యూనివర్శిటీ, వేటీ కాలేజ్, ఫాల్కావన్ ప్రాంతాల్లో భద్రతా దళాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. మిజోరంలో ఉండే స్థానిక గ్రూపు మిజోలకు మణిపూర్‌లో కుకిలతో బంధుత్వం ఉంది. ఈ కారణంతో మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమైన దగ్గర నుంచి మిజోరంలో సుమారు 13 వేల మంది కుకీలు తలదాచుకుంటున్నారు. మరోవైపు మిజోరంలో సుమారు 2 వేల మంది మెయితేలు ఉంటారని అంచనా. వీరిలో ఎక్కువ మంది ఐజ్వాల్‌లో ఉంటారు.

## టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల చేయాలి : ఎంపీ కోమటిరెడ్డి

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని కోమటిరెడ్డి నివాసంలో టీఆర్టీ అభ్యర్థులు ఆయన్ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ టీర్టీ నోటిఫికేషన్ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు. పార్టీలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల్లో వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం భర్తీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్ల కోసం స్కీమ్‌ల పేరుతో మోసాలు చేస్తున్న కేసీఆర్‌కు నిరుద్యోగుల బాధలు పట్టవా? అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం దిగిరాకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు.

**కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు**
**అసంఘటిత కార్మిక, ఉద్యోగ కాంగ్రెస్‌లో విక్రమార్క**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు కార్మికుల అవసరాలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఆవరణలోని ప్రకాశ్‌హాల్‌లో అసంఘటిత కార్మిక, ఉద్యోగ కాంగ్రెస్ (కేకేసీ) కో ఆర్డినేటర్ సమీర్ కౌశల్ అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో కనీసవేతనాలపై సమీక్షించలేదని విమర్శించారు. 2023- 24లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలు తీసుకొస్తామన్నారు. సమావేశంలో ఏఐసీసీ అసంఘటిత కార్మిక విభాగం కాంగ్రెస్ చైర్మెన్ ఉదిత్‌రాజ్, ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్, నాయకులు మధు యాష్కీ, మహేష్ కుమార్ గౌడ్, కుసుమ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. వినోద్‌రెడ్డి, సంగిశెట్టి జగదీష్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.